
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


'సర్'లో 21% ఓట్లు తొలగిపోయే ప్రమాదం
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రాన్ని స్తంభింపజేస్తాం


03



సంపుటి 09, సంచిక: 255 | శుక్రవారం | 14-08-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# విప్లవ వేగుచుక్క కాస్ట్రో

## ఘనంగా క్యూబా విప్లవ వీరుడి శతజయంతి
## ఢిల్లీలో నివాళులర్పించిన సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**న్యూఢిల్లీ :** విప్లవ వేగు చుక్క, క్యూబా మాజీ అధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రో శతి జయంతి వేడుకలను ఢిల్లీలోని సిపిఐ జాతీయ కార్యాలయం అజయ్ భవన్‌లో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాస్ట్రో చిత్ర పటానికి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ పాండా అన్నీ రాజా, ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ ప్రధాన కార్యదర్శి నిషా సిధు, ఎఐకెఎస్ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, ఐద్వా ప్రధాన కార్యదర్శి కనినికా ఘోష్ పుష్పాంజలి ఘటించారు. కాస్ట్రో ఘన విప్లవ వారసత్వం, ఆయన విప్లవ దృష్టి, నిరంతర ప్రాసంగికతపై ఈ సందర్భంగా డి.రాజా ప్రసంగించారు. సోషలిజం, జాతీయ సార్వభౌమత్వం, అంతర్జాతీయ ఐక్యత, మనుషుల ఆత్మగౌరవం పట్ల కాస్ట్రో అచంచలమైన నిబద్ధత కనబరిచేవారని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల పోరాటాలకు స్ఫూర్తినిచ్చిన విప్లవకారుడు ఫిడెల్ కాస్ట్రో అని అన్నారు. క్యూబా నుండి ప్రపంచం అంతటా, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, శ్రామిక ప్రజల హక్కుల కోసం ఆయన దృఢంగా నిలబడ్డారని రాజా గుర్తు చేసుకున్నారు. మరింత న్యాయమైన, సమానమైన ప్రపంచం కోసం పోరాడుతున్న వారికి కాస్ట్రో సందేశం స్ఫూర్తినిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు.

## పార్లమెంట్ నిరవధిక వాయిదా

# చర్చ లేకుండానే పలు బిల్లులు ఆమోదం

## వీడ్కోలు ప్రసంగం చేయని స్పీకర్

**న్యూఢిల్లీ:** తీవ్రమైన నిరసనలు, రాజకీయ వాగ్వాదాల మధ్య పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. గురువారం (ఆగస్టు 13) రోజున లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడటంతో పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు తెరపడింది. విద్యార్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల నిధులపై వచ్చిన ఆరోపణలు వంటి అంశాలపై ప్రతిపక్షం నిరసనలు కొనసాగించడంతో సభా కార్యకలాపాలు తరచూ స్తంభించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు రావాలని కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేసినప్పటికీ, అధికార పార్టీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. నిబంధనల ప్రకారం నోటీసు ఇస్తే, తాను సభకు వచ్చి సమాధానాలు ఇస్తానని, అందుకోసం ఎంత సమయాన్నయినా కేటాయిస్తానని బుధవారం ఒక ప్రకటన చేసి, తప్పును ప్రతిపక్ష పార్టీలపై నెట్టేందుకు అమిత్ షా ప్రయత్నించారు. మొత్తం మీద మోదీ, అమిత్ షా చివరి రోజున కొన్ని నిమిషాలను మినహాయిస్తే, పూర్తిగా సభకు హాజరుకాకుండానే పార్లమెంటు సమావేశాలు ముగిశాయి. అదే సమయంలో పలు కీలక బిల్లులు ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. గురువారం సభ సమావేశమైన వెంటనే జాతీయ గీతంలోని ఆరు చరణాలను ఆలపించారు. అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేశారు. సాధారణంగా సమావేశాల ముగింపు సందర్భంగా సభ పనితీరు, ఉత్పాదకతను వివరించే వీడ్కోలు ప్రసంగాన్ని స్పీకర్ చేస్తారు. అయితే ఈసారి ఆయన అలాంటి ప్రసంగం చేయలేదు. సభ కొద్దిసేపు సమావేశమైన సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ,


తరువాయి 8లో




### ఎట్టకేలకు సభలో మోదీ, అమిత్ షా

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరుగుతున్నంత కాలం మొహం చాటేసిన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, హఠాత్తుగా సభలో ప్రత్యక్షమయ్యారు. పార్లమెంటు నివరధికంగా వాయిదా పడిన వేళ, వందేమాతరం పూర్తి ఆరు చరణాలను ఆలపించారు. 3 నిమిషాల 10 సెకెన్లపాటు కొనసాగినప్పుడు మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సభలో కనిపించారు.

# నల్సార్ విద్యార్థులను ఎన్‌రోల్‌మెంట్ నిలిపివేత

**న్యూఢిల్లీ :** నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా నుండి 2026లో పట్టభద్రులయ్యే విద్యార్థులను రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో నమోదు చేసుకోవడాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిలిపివేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఇది అమలులో ఉంటుందని చైర్మన్ మన్నన్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. నల్సార్ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు ఛీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మిశ్రాను ఆహ్వానించటాన్ని అక్కడి విద్యార్థులు వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్‌కు లేఖ రాయడం సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో నల్సార్‌లో ఈ ఏడాది గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నవారిని ఎన్‌రోల్ చేసుకోవద్దని అన్ని బార్ కౌన్సిల్‌లకు బిసిఐ చైర్మన్ లేఖ రాశారు.

# 22ఏ భూములకు భరోసా

## సమస్యను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ
## కెపిహెచ్‌బిలో 'ఇందిరమ్మ ఇండ్ల టవర్స్'కు భూమిపూజ

ప్రజాపక్షం/హైదరాబాద్

నిషేధిత జాబితా 22ఏలో ఉన్న భూముల విషయంలో రైతులు, కొనుగోలుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సిఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. పొరపాటున ఏదైనా భూమి 22ఏలో నమోదైతే దానిని తిరిగి ఇప్పించే బాధ్యత తనదేనని, ఒక సర్వే నెంబర్‌లో సమస్య ఉంటే యావత్తు 500 ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిన ఉదంతాలున్నాయని, సబ్ నెంబర్లు కేటాయించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో కొందరు చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని నమ్మవద్దని


తరువాయి 8లో





## మోదీకి ట్రంప్ ఫోబియా

# తప్పు చేయకపోతే జంకు ఎందుకు?

- అల్పసంఖ్యాకులైన సంపన్నులు, కార్పొరేట్ల కోసం మాత్రమే పనిచేస్తున్నారు
- ప్రజల హక్కులు, సంక్షేమ పథకాలు కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే వచ్చాయి
- ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు









ప్రజాపక్షం/ఖమ్మం

సువిశాల భారతదేశానికి ప్రధాని అయిన నరేంద్ర మోదీ పిరికివాడిగా మారిపోయాడని, ఆయనకు ట్రంప్ ఫోబియా పట్టుకుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. 140 కోట్ల జనాభా గలిగిన దేశానికి ప్రధానిగా ఉన్న మోదీ అల్పసంఖ్యాకులైన సంపన్నులు, కార్పొరేట్ల కోసం మాత్రమే పనిచేస్తున్నారన్నారు. సిపిఐ జన చైతన్య యాత్రల ముగింపు సందర్భంగా గురువారం ఖమ్మం నగరంలో పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రల అనంతరం ఖమ్మం జడ్పీ సెంటర్ నుంచి పాత బస్టాండ్, మయూరి సెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వందలాది పార్టీ కార్యకర్తలు, కళాకారుల ప్రదర్శనతో వైరా రోడ్డు అరుణవర్ణం అలుముకుంది. భక్తరామదాసు


తరువాయి 12లో


## పెద్దలను నిలదీసేది..

# పేదలకు అండగా నిలిచేది ఎర్రజెండానే

- పేదలు ఉన్నంత వరకూ సిపిఐ ఉంటుంది
- సిపిఐ జన చైతన్య పాదయాత్ర ముగింపు సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి






ప్రజాపక్షం / హుస్నాబాద్

దేశంలో పేదలు ఉన్నంత వరకు సిపిఐ ఉంటుందని, పెద్దలను నిలదీసేది పేదలకు నిరంతరం అండగా ఉండేది ఎర్ర జెండ పార్టీ మాత్రమేనని సిపిఐ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సిపిఐ జన చైతన్య పాదయాత్ర ముగింపు సభలో పార్టీ ముఖ్యనేతలు రాష్ట్ర సహాయ కార్యదర్శి టి శ్రీనివాస్‌రావు, కార్యవర్గ సభ్యులు కళవేని శంకర్‌తో కలిసి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గలోని గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన పరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిహారం చెల్లించని ఎడల సెప్టెంబర్ ఆఖరిలో సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామన్నారు. హుస్నాబాద్ మెట్ట ప్రాంత ప్రజల కోసం సిపిఐ పోరాడి సాధించి గౌరవెల్లి తీసుకువచ్చిందని, పరిహారం ఇచ్చే వరకు పోరాటం చేసేది సిపిఐయే అని అన్నారు. ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి హుస్నాబాద్ ప్రజల కళ సాకారం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హుస్నాబాద్ అంటేనే కరువు ప్రాంతం అని, నిరంతరం కష్టపడి కూలీనాలీ చేసుకుంటే తప్ప పూట గడవని ప్రజల కోసం ప్రభుత్వం వెంటనే ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజా శ్రీనివాస్, హన్మకొండ కర్రె భిక్షపతి, సిద్దపేట జిల్లా సహాయకార్యదర్శి గడిపె మల్లేశ్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ, నియోజకవర్గ కన్వీనర్ జాజగీరు సత్యనారయణ, సిపిఐ రాష్ట్ర నాయకులు ఆదిరి శ్రీనివాస్, కె శంకర్, కేదారి, బొయిని ఆశోక్, గూడేం లక్ష్మి, జ్యోతి, గూడ పద్మ, లక్ష్మన్, సంపత్, ఆందే ఆశోక్, జనగాం రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా పుట్ట లక్ష్మణ్

- బారాబంకీలో జరిగిన జాతీయ కౌన్సిల్‌లో ఎన్నిక
- మరో ఉపాధ్యక్షుడిగా శుభదీప్ మజుందార్, కార్యదర్శులుగా బందెల నాసర్జీ, ఎ.అదీన్









ప్రజాపక్షం/హైదరాబాద్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జాతీయ ఉపాధ్యక్షునిగా తెలంగాణాకు చెందిన పుట్ట లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బారాబంకిలో జరిగిన ఎఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ ముగింపు వేడుకలలో భాగంగా గురువారం ఎఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ నాయకత్వంలో మార్పులు జరిగాయి. జాతీయ ఉపాధ్యక్షులుగా పుట్ట లక్ష్మణ్ (తెలంగాణ), సుభదీప్ మజుందార్ (త్రిపుర), జాతీయ కార్యదర్శులుగా బందెల నాసర్జీ(ఆంధ్రప్రదేశ్), ఎ.అదీన్(కేరళ)లను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడ డివిజన్‌కు చెందిన పుట్ట లక్ష్మణ్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో 2007లో ఎఐఎస్ఎఫ్‌లో చేరిన ఆయన ఘట్‌కేసర్ మండల అధ్యక్షునిగా పనిచేశారు. ఆ తర్వాత ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కార్యదర్శిగా పనిచేసి, 2022లో కొత్తగూడెం జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గత ఫిబ్రవరిలో నిజామాబాద్ జిల్లాలో జరిగిన



తరువాయి 8లో


## వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌లో

# బాయిలర్ పేలి ఇద్దరు మృతి

ప్రజాపక్షం / వరంగల్

వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌లో బాయిలర్ పేలి ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు సాంకేతిక నిపుణులు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. గీసుకొండ మండలం కాకతీయ వస్త్ర పరిశ్రమలోని గణేశా ఎకోపెట్ కంపెనీలో బుధవారం అర్ధరాత్రి బాయిలర్ పేలడంతో ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాంకేతిక నిపుణులు అభిలాష్ (30), సూర్యప్రకాష్ (31)ల మృతి చెందారు. ప్రమాద తీవ్రతపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి, ఫ్యాక్టరీలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించారా? లేదా అనే కోణంలో సమగ్ర విచారణ జరపాలని, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లు, ఫైర్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఫ్యాక్టరీలోని వైరింగ్, బాయిలర్ కండిషన్, సిసిటివి ఫుటేజీలను పరిశీలించి త్వరితగతిన



పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గీసుకొండ పోలీసులు కంపెనీ యాజమాన్యం, నిర్వాకుల నిర్లక్ష్యం పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. మృతదేహాలు వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం అనంతరం మృతుల కుటుంబ సభ్యులు ఉత్తరప్రదేశ్ నుండి రాగానే అధికారికంగా మృతదేహాలను అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం తేలితే కంపెనీపై మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

# క్యూబాపై సైనిక చర్య!

## పలు ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తున్న అమెరికా యుద్ధమంత్రి పీట్ హెగ్సెత్



**వాషింగ్టన్:** క్యూబాపై సైనిక చర్య చేయడంతో సహా అనేక ప్రత్యామ్నాయ మార్గాలను అమెరికా పరిశీలిస్తోందని టాస్ వార్తాసంస్థ గురువారం ప్రకటించింది. క్యూబాపై తదుపరి చర్యలు తీసుకోవడానికి తమ వద్ద అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని పెంటగాన్ అధిపతి, అమెరికా యుద్ధమంత్రి పీట్ హెగ్సెత్ చెప్పారు. ఆక్సియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ప్రశ్నలకు హెగ్సెత్ సమాధానాలు చెప్పారు. గడచిన జూన్ నెలలో కూడా హెగ్సెత్ ఇదేవిధమైన ప్రకటన చేశారు.అమెరికా వ్యూహాత్మక హక్కులను ఉపయోగించుకోవడానికి ట్రంప్ ఎంతో సుముఖంగా ఉన్నారని, ఈ విషయం క్యూబా గమనించుకుంటే మంచిదని హెచ్చరించారు.ఇరాన్ సర్వాధినేతను హతమార్చిన తర్వాత మార్చి ఐదో తేదీన ట్రంప్ మాట్లాడుతూ, ఇక అమెరికా తదుపరి లక్ష్యం క్యూబా దేశమేనని, దానిని స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. అప్పటినుండి క్యూబాకు వేధింపులు,దిగ్బంధన చర్యలు ఎక్కువైపోయాయి. క్యూబాపై సైనిక శక్తిని ప్రయోగించడంపైనే ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నట్లు మే 18వ తేదీన "పొలిటికో" ఒక నివేదిక ప్రచురించింది.

# పార్లమెంట్‌లో 'ఇండియా' సఫలం

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు గురువారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. పరీక్షా పత్రాల లీకేజీ సవరణ బిల్లుపై చర్చ జరిగిన రోజు మినహా దాదాపు అన్ని రోజులూ ఉభయ సభలు వాయిదా పర్వం కొనసాగుతూ వచ్చింది. సాధారణ పరిస్థితుల్లో ఈ 21 రోజుల సమావేశాలు వృథా అయినట్లుగానే జనసామాన్యం భావిస్తుంటుంది. కానీ, ఈసారి సమావేశాలలో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, అప్రజాస్వామిక ధోరణులను ఎదురొడ్డి నిలువరించటంలో ప్రతిపక్షాలు చారిత్రక విజయాన్నే సాధించాయి. నీట్ పేపర్ లీకేజీపై జంతర్‌మంతర్‌లో విద్యార్థి ఉద్యమం, సభలో ప్రతిపక్షాల ఒత్తిడి ఫలితంగా కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయడం గొప్ప విజయమే. పన్నెండేళ్ళుగా వివిధ అంశాలలో తమ వైఫల్యాలను కించిత్ కూడా అంగీకరించేందుకు ఇష్టపడని కేంద్ర ప్రభుత్వ దురహంకారపు కొమ్ములు విరిచిన ఘట్టమిది. 'చలో సంసద్'లో విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు, కేంద్ర రిజర్వు బలగాల పాశవిక దాడికి బాధ్యత వహించాలని ప్రతిపక్షాలు పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టగలిగాయి. మరీ ముఖ్యంగా ప్రభుత్వానికి సర్వాంతర్యామి అయిన ప్రధాని మోదీ, ఆయువుపట్టు లాంటి కేంద్ర హోం మంత్రి అమిత్ షాలను ఆత్మరక్షణలోకి నెట్టేయడంలో విపక్ష ఎంపిలు సఫలమయ్యారు. వారి విమర్శల ధాటికి తట్టుకోలేక ఉభయసభలలోకి అడుగుపెట్టేందుకు సైతం సంకోచించే స్థితికి నెట్టివేయబడ్డారు. పార్లమెంటుకు వచ్చినా తమ ఛాంబర్‌లోనే మిన్నకుండిపోయారు. అమిత్ షా సభకు వచ్చి ప్రకటన చేయాలన్న ప్రతిపక్షాల ఏకోన్ముఖ డిమాండ్‌కు రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సైతం స్పందించాల్సి వచ్చింది. ప్రతిపక్షాల భావాలను హోం మంత్రికి తెలియజేయాలని ఆయన పార్లమెంటు వ్యవహారాల మంత్రికి సూచించారంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ ఆయన సభకు రాలేదు. ప్రధాని, హోం మంత్రులిరువురూ పార్లమెంటులో కనపడడం లేదనే ప్రతిపక్షాల నిరసనధ్వనులు వారికేమో కానీ, దేశ ప్రజల వీనుల్లోకి గట్టిగానే చేరాయి. నష్టనివారణలో భాగంగా చివరాఖరి రోజున లోక్‌సభ నిరవధిక వాయిదా పడేందుకు కొద్ది నిమిషాల ముందు వారిద్దరు సభకు హాజరు కాకతప్పలేదు. ప్రస్తుత సమావేశాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఆమోదింపజేసుకోవాలనుకున్న లోక్‌సభ నియోకజవర్గాల పెంపుపై రాజ్యాంగ సవరణ బిల్లు, 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' బిల్లు, విద్యపై కేంద్ర పెత్తనాన్ని తావిచ్చే 'వికసిత్ భారత్ శిక్షా అభియాన్' బిల్లులను కేంద్ర ప్రభుత్వం కనీసం వాటిని పార్లమెంటులో ప్రవేశపెట్టలేకపోయింది. మైనారిటీల స్వచ్ఛంద సంస్థల వెన్నువిరిచే ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లును ప్రతిపక్షాల పంతం కారణంగా నెగ్గించుకోలేక జెపిసికి పంపించారు. ఇదంతా ప్రతిపక్షాల విజయమే.

వాస్తవానికి కొద్ది రోజుల ముందు పూర్తి భిన్నమైన వాతావరణం నెలకొంది. ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే శివసేన పార్టీల నుంచి 34 మంది ఎంపిలను ఎన్‌డిఏ పంచన చేరేలా బిజెపి తెగబడింది. ఇండియా కూటమిలో శరద్ పవార్ ఎన్‌సిపిని, తమిళనాడు ఎన్నికల తరువాత దూరమైన డిఎంకెను సైతం దొడ్డి దారి మంతనాల ద్వారా మచ్చిక చేసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు మంత్రాంగం సాగించారు. ప్రతిపక్ష శిబిరాన్ని ధ్వంసం చేసేందుకు కుటిల పన్నాగాలన్నీ ప్రయోగించారు. కేరళ ఎన్నికల్లో తమపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలతో సిపిఐ(ఎం) గుర్రుగా ఉండటం, జూన్ 8న జరిగిన ఇండియా కూటమి పార్టీల సమావేశానికి ఆప్,డిఎంకె దూరంగా ఉండటం ప్రతిపక్షాల ఐకత్యపై అనుమానాలు ముసురుకున్నాయి. ఒకవైపు దూకుడు మీద ఉన్న అధికార పక్షం, మరోవైపు ఫిరాయింపులతో సంఖ్యా బలం తగ్గి, పూర్తి స్థాయి సఖ్యత లేని ప్రతిపక్ష శిబిరం. ఈ వాతావరణంలో వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. జంతర్‌మంతర్‌లో విద్యార్థుల నిరసనోద్యమం, వారిపై జరిగిన దాష్టీకం పరిస్థితిని మలుపుతిప్పింది. దీనిని సరైన రీతిలో ఎత్తిపట్టుకున్న ప్రతిపక్షాలు పార్లమెంటులో ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. తమకు సమాచారం ఇవ్వకుండా కాంగ్రెస్ ఎంపిలు మాత్రమే ప్రధాని నివాసం వద్ద ధర్నాకు దిగడంపై ఇతర ప్రతిపక్ష పార్టీలు కొంత కినుకవహించాయి. వాస్తవానికి ప్రధాని ఇంటి ఎదుట ధర్నా అంశాన్ని అదే రోజు ఉదయం వామపక్ష ఎంపిలు ప్రతిపాదించాయని వార్తలు కూడా వచ్చాయి. అయితే, ప్రజా కంటక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో ఇలాంటి పొరపొచ్చాలను పక్కనబెట్టాయి.

మొత్తం 21 రోజుల పాటు సమావేశాలు జరిగితే, అందులో 18 రోజులు ప్రతి రోజూ ఉదయం సభ ఆరంభానికి ముందు ఇండియా కూటమి ఎంపిలు సమావేశమై వ్యూహరచన చేయడం విశేషం. దీనికి టిఎంసి ప్రతినిధితో పాటు, శరద్ పవార్ ఎన్‌సిపి తరఫున సుప్రియా శూలే కూడా నిత్యం హాజరయ్యారు. ప్రతి రోజు సభ లోనూ, వెలుపలా సమన్వయంతో వ్యవహరిస్తూ, ప్రతిపక్ష ఎంపిలు ఉమ్మడిగా నిరసనల చేపట్టడం ద్వారా ఐక్యతను చాటి చెప్పారు. ఇండియా కూటమికి దూరంగా ఉన్నప్పటికీ ఆప్, డిఎంకెలు విడిగానే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు నిర్వహించాయి. ఈ పరిణామాలు ప్రతిపక్షాన్ని బలహీనపరిచామనుకున్న అధికార పక్షానికి గర్వభంగమైంది. ఈ సమావేశాలలో నీట్ పేపర్ లీకేజీ, అయోధ్య రామాలయంలో చందా చోరీ, ఇ–20 పెట్రోల్ తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సర్వసన్నద్ధమైన ప్రతిపక్షాలకు చివరి వరకు పేపర్ లీకేజీ, జంతర్ మంతర్ నిరసనలపై ప్రశ్నించడంతోనే సరిపోయింది. అయినప్పటికీ, వ్యూహాత్మకంగా ప్రతి రోజూ చందాచోరీపై పార్లమెంటు ప్రాంగణంలో నిరసన, చిన్నపాటి నాటిక (స్కిట్) వేయడం ద్వారా ఆ ఇతర అంశాలను మరుగునపడకుండా చూశాయి. రాజ్యసభలో సిపిఐ(ఎం) జాన్ బ్రిట్టాస్ చర్చలో పాల్గొంటున్న సమయంలో, ఆయనను ఉద్దేశించి బిజెపి మహిళా ఎంపి ఒకరు 'లుంగీవాలా' అని పదే పదే అవమానపరిచదాన్ని ఖండిస్తూ ప్రతిపక్ష ఎంపిలు ఒక్కతాటిపై నిలిచారు. బ్రిట్టాస్‌కు మద్దతుగా సిపిఐ ఎంపిలు సందోష్‌కుమార్, పి.పి.సునీర్‌లతో పాటు రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే సైతం లుంగీ కట్టుకొని సంఘీభావం వ్యక్తం చేశారు. చర్చ సందర్భంగా కమ్యూనిస్టులపై అక్కసుతో కేంద్ర ఆర్థికమంత్రి వాచాలత్వాన్ని నిరసిస్తూ సందోష్‌కుమార్ రాజ్యసభాధిపతికి లేఖ రాశారు. ఈ సమావేశాలలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ అమోఘమైన పాత్రను నిర్వర్తించారు. స్వయంగా ప్రధాని ఇంటి వద్ద ధర్నాలో నేలపై పడుకోవడం, సభలో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడం వంటివి ప్రజల్లో సానుకూల ముద్ర వేశాయి. మొత్తమ్మీద పుష్కరకాల మోదీ ప్రభుత్వ అప్రతిహత యాత్రకు తాజాగా ముగిసిన పార్లమెంటు సమావేశాలు బ్రేకులు వేశాయి. సమన్వయలోపాలను దాటుకొని 'ఇండియా' కూటమి పక్షాలు మరింత చేరువయ్యాయి. ●



## నల్సార్ విద్యార్థులను భయపెట్టలేరు

బార్ కౌన్సిల్ చైర్మన్, బిజెపి ఎంపి హైదరాబాద్ నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సుప్రీం కోర్టు ఛీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని అక్కడి విద్యార్థులు వ్యతిరేకించారు. దీంతో 2026 లో నల్సార్ నుంచి పట్టభద్రులయ్యే నల్సార్ విద్యార్థులను న్యాయవాదులుగా ఎన్‌రోల్ చేయొద్దని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మన్నన్ కుమార్ ఉత్తరువులు జారీ చేశారు. ఈ విధంగా ఆయన యువతను భయపెట్టలేరు. ఆ రోజులు పోయాయి. మన్నన్ కుమార్ బిజెపి తరఫున రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. సిజెఐ నుంచి పట్టా స్వీకరించబోమని నల్సార్ విద్యార్థులు అంటే వారిని ఎన్‌రోల్ చేయవద్దని అక్రమ ఉత్తరువులు ఇస్తారా? నిరసన ప్రాథమిక హక్కు అని ఆయనకు తెలియదా? ఆయన 2012 నుంచి బార్ కౌన్సిల్ చైర్మన్ పదవిలో ఉన్నారు. ఆయన ట్రాక్ రికార్డును పరిశీలిస్తాం.

– సిజెపి అధికార ప్రతినిధి సౌరవ్ దాస్



## జెన్ జీ తరం మారింది.. డిజిటల్ ఉచ్చు బిగుస్తోంది!

కాలం మారింది. జీవనశైలి మారింది. చేతిలోని చిన్న తెర ప్రపంచాన్నే అరచేతిలోకి తెచ్చింది. విద్య, ఉపాధి, వ్యాపారం, వైద్యం, వినోదం— అన్నింటికీ డిజిటల్ మార్గాలు తెరుచుకున్నాయి. అయితే సౌకర్యం పెరిగిన కొద్దీ ఆధారపడటం పెరిగితే అదే వరం భారంగా మారుతుంది. నేటి జెన్ జీ ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న ఇదే. జేబులో పాకెట్ మనీ లేకపోయినా ఇంటి నుంచి బయటకు వెళ్లగలిగే యువకుడు, ఫోన్ ఇంట్లో మరిచిపోతే మాత్రం తిరిగి పరుగెత్తుకొస్తున్న దృశ్యం ఇప్పుడు ఆలోచింపజేయాలి. నోటిఫికేషన్ కోసం ఎదురుచూడటం, రీల్ తర్వాత మరో రీల్ చూడటం, చాటింగ్‌లో గంటలు కరిగిపోవడం సరదాగా మొదలై అలవాటుగా, ఆపై ఆధారపడగలిగేగా మారవచ్చు. ఇక్కడ తప్పు మొత్తం యువతదే అని చెప్పడం న్యాయం కాదు. పిల్లల చేతికి పరికరాలు ఇచ్చింది కుటుంబమే. చదువు, వినోదం, సంభాషణ, చెల్లింపులు అన్నింటినీ ఒకే తెరపైకి తెచ్చింది సమాజమే. తల్లిదండ్రులు కూడా పిల్లల అలవాట్లను పరిశీలించాలి. భోజన బల్లపై సంభాషణకు బదులు ఫోన్లు కనిపిస్తే పిల్లలకు చెప్పే నియమాలకు విలువ తగ్గుతుంది.

మారుతున్న వినియోగ సంస్కృతి మరో ప్రమాదం. ఖరీదైన ఫోన్ స్థాయికి గుర్తు, బ్రాండ్ ప్రతిష్ఠకు చిహ్నం, వైరల్ కావడం విజయానికి కొలమానం అన్న భావన బలపడితే అవసరం–ఆడంబరం మధ్య గీత చెరిగిపోతుంది. డిజిటల్ చెల్లింపులు, తక్షణ కొనుగోళ్లు, అప్పుల సౌకర్యం చేతిలో డబ్బు లేకున్నా ఖర్చు చేసే అవకాశాన్ని పెంచుతున్నాయి. సంపాదన రాకముందే ఖర్చు అలవాటైతే రేపటి ఆర్థిక స్వేచ్ఛకు బంధం పడుతుంది. జేబు ఖాళీ కావడం కంటే లక్ష్యం ఖాళీ కావడమే ప్రమాదకరం.

సమాజం కూడా ఈ మార్పును కేవలం యువత సమస్యగా చూడకూడదు. పాఠశాలల్లో డిజిటల్ బాధ్యత, సైబర్ భద్రత, సమాచారాన్ని పరిశీలించే నైపుణ్యాలపై అవగాహన పెరగాలి. కుటుంబాల్లో ఫోన్ లేని సంభాషణకు సమయం కేటాయించాలి. యువతకు ఆజ్ఞలు కాదు, కారణాలు చెప్పాలి. స్వేచ్ఛతో పాటు బాధ్యతను నేర్పాలి. ఎందుకంటే రేపటి సమాజాన్ని నిర్మించేది నేటి తెర ముందు కూర్చున్న తరమే. వారి చేతిలోని పరికరం జ్ఞానానికి తలుపు కావాలా, వ్యసనానికి తలుపు కావాలా అన్నది మనం ఇచ్చే దిశపై కూడా ఆధారపడి ఉంటుంది.

ఫోన్ బ్యాటరీ ఖాళీ అయితే ఛార్జర్ ఉంటుంది. డబ్బు తగ్గితే మళ్లీ సంపాదించే అవకాశం ఉంటుంది. కానీ కాలం ఖాళీ అయితే దానికి ఛార్జర్ ఉండదు. అందుకే చేతిలోని పరికరం భవిష్యత్తుకు మెట్టుగా ఉండాలి; జెన్ జీ ముందు ఉన్న పోరాటం సాంకేతికతతో కాదు.. దానిమీద ఆధిపత్యంతో. మొబైల్ చేతిలో ఉండాలి; మనిషి మొబైల్ చేతిలో బందీ కాకూడదు. ఈ రోజు ఏం చూస్తున్నామన్నది కంటే, ఏం కోల్పోతున్నామన్నది కూడా ప్రశ్నించుకోవాలి. సమయాన్ని కాపాడితే భవిష్యత్తు నిలుస్తుంది. కుటుంబాన్ని కాపాడితే మనసు నిలుస్తుంది. ఆరోగ్యాన్ని కాపాడితే జీవితం నిలుస్తుంది. సాంకేతికతను అదుపులో ఉంచితే ప్రగతి నిలుస్తుంది. లేదంటే తరం మాత్రమే మారుతుంది.. ఉచ్చు మాత్రం మారదు.

# ఆకలిదప్పులతో మలమలలాడే అనాథలెందరో!



ఎం.కోటేశ్వరరావు

"ఆకలి ఒక తల్లి విపరీత చర్యకు పాల్పడేట్లు చేసింది, ఇది సామూహిక వైఫల్యం" ఈ వ్యాఖ్య చేసింది గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి హెచ్‌డి సుతార్. ఆ తల్లిది పన్నెండు సంవత్సరాల క్రితం ఒక ఆదర్శంగా వర్ణించి, దేశంలోని ప్రతి రాష్ట్రాన్ని అదే విధంగా మారుస్తానని వాగ్దానం చేసిన ప్రధాని నరేంద్రమోదీ స్వంతగడ్డ. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా 2001 అక్టోబరు ఏడు నుంచి 2014 మే 22వ తేదీ వరకు పని చేశారు. ఆ కాలాన్ని గుజరాత్ స్వర్ణయుగంగా కొందరు పరిగణిస్తారు. తరువాత అదే బిజెపి నేతల ఏలుబడిలో ఉంది. మోదీ కేంద్రంలో ప్రధానిగా రెండింజన్ల పాలన సాగిస్తున్నారు. అలాంటి చోట ఒక తల్లి తన రెండు సంవత్సరాల కుమార్తెకు (బేటీ పడావో, బేటీ బచావో నినాదం ఇచ్చిన తరువాత) ఆకలి తీర్చలేక అసహాయతకు లోనై ఏడుస్తున్న పసికందు నోరు మూయించేందుకు ఒక దెబ్బవేసింది. అపస్మారకంలోకి పోవటంతో స్వయంగా తల్లే బతికించేందుకు ఆసుపత్రికి తీసుకుపోయింది. ఫలితంలేక ఆ బేటీ మరణించింది. కూతుర్ని చంపిన నేరానికి ఏడు నెలల గర్భిణిగా ఉన్న తల్లిని జైల్లో పెట్టారు. బెయిలు కోసం దరఖాస్తు చేస్తే గుజరాత్ పోలీసులు వ్యతిరేకించారు. ఆ కేసులో హైకోర్టు విచారణలో న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలను ఎగువన చదివారు. ఆ తల్లికి షరతులతో కూడిన బెయిలు మంజూరు చేశారు.

తనను దూషించిన జెన్ జీ తరం యువతీ యువకులను క్షమిస్తున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. మోదీ గనుక అంత ఉదారత ప్రదర్శించారని దాన్ని కూడా ఆయన ప్రతిష్ట పెంచేందుకు ఉపయోగించిన వారిని దేశం చూసింది. అసలు క్షమాపణ చెప్పాల్సిన ప్రధానే క్షమించటం అనే విడ్డూరపు చర్యకు పాల్పడటం ఏమిటని కొందరు విమర్శించారు. కాసేపు దాని మంచి చెడ్డలను పక్కన పెడదాం. తన రాష్ట్రంలో ఒక తల్లి విపరీత చర్యకు పాల్పడిన పరిస్థితులను కల్పించిన తన పాలనతీరు తెన్నులకు ఆ తల్లి ఉదంతంమీద మోదీ ఎందుకు స్పందించలేదు అన్నది అసలు సమస్య. సామూహిక వైఫల్యం అని న్యాయమూర్తి వ్యాఖ్య ప్రకారం దానిలో నరేంద్ర మోదీ భాగం లేదా? ప్రధాని లేదా గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఇతర బిజెపి నేతలెవరూ ఏ మాత్రం స్పందించలేదు.

సూరత్ ప్రాంతానికి చెందిన లఖీ సోలంకి ఇద్దరు బిడ్డల తల్లి, ఏడు నెలల గర్భంతో ఉంది. ఆమె భర్త సముద్రాలమీద పనిచేసేందుకంటూ ఆరు నెలల క్రితం ఆమెకు ఎలాంటి ఆదరువు చూపకుండా వెళ్లిపోయాడు. అతడు తిరిగి వస్తాడో రాడో తెలియదు, కడుపుతో ఉన్న ఆమెకు అవసరమైన ఆర్థిక ఏర్పాట్లు కూడా లేవు. మీడియాలో వచ్చిన వార్తల ప్రకారం ఇలాంటి స్థితిలో వివాహ బంధం లేకుండా మైత్రీ ఖరారు ఒప్పందంతో ఆమె ఒక వ్యక్తితో సహజీవనం చేస్తున్న క్రమంలో ఆకలికి తాళలేక బిడ్డ ఈషా ఏడ్పులను తట్టుకోలేక 2026, మార్చినెల 19 తేదీన చేయిచేసుకుంది. ఈ ఉదంతం న్యాయమూర్తి వ్యాఖ్యానించినట్లుగా దిక్కులేని కుటుంబాలు, వ్యక్తులు, వారి దారిద్ర్యం, ఆకలి పట్ల సమాజ, ప్రభుత్వ బాధ్యత ఏమిటనే ప్రశ్నలను ముందుకు తెచ్చింది. ఏ ఇథియోపియానో, మరో ఆఫ్రికన్ దేశంలో ఈ ఉదంతం జరిగిందంటే అర్థం చేసుకోవచ్చు. దేశం మొత్తం మీద సంపదలు కలిగిన ధనికులు అత్యధికంగా ఉన్న రాష్ట్రం గుజరాత్. విలువలు, వలువలు ఉన్నాయని చెప్పుకొనే సంఘపరివార్‌కు ఎంతో పట్టున్న ప్రాంతం.

లఖీ సోలంకి ఉదంతాన్ని ఒక వ్యక్తి విషాదంగా చూడటానికి లేదు. దుర్భరదారిద్ర్యంలో నివసిస్తున్న వారి రక్షణకు అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాల వ్యవస్థ వైఫల్యానికి ప్రతిబింబం అని కోర్టు వ్యాఖ్యానించింది. బిజెపి చెప్పే రెండింజన్ల పాలనలో ఉన్న గుజరాత్ ప్రభుత్వానికి ఈ వ్యాఖ్య చెంపపెట్టు. తల్లి కొట్టిన దెబ్బలకే రెండేండ్ల కూతురు మరణించినట్లు పోస్టు మార్టం నివేదికలో చెప్పినందున ఇది చాలా తీవ్రమైన నేరం అంటూ పోలీసులు లఖీకి బెయిలు ఇవ్వరాదని వాదించారు. సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని చెప్పారు. ఆమే స్వయంగా అపస్మారకంతో ఉన్న తన కుమార్తెను ఆసుపత్రికి తీసుకువెళ్లిందని, చంపాలనే ఉద్దేశ్యం ఆమెకు లేదని కోర్టు చెప్పింది. తన కుమార్తె ఆకలిని తీర్చలేక వత్తిడికిలోనై బాధ్యతారహితంగా వ్యవహరించిందని కూడా వ్యాఖ్యానించింది. ఆ కుటుంబం దీర్ఘకాలం పాటు దారిద్ర్యం, ఆకలికి లోనైందని పేర్కొన్నది.

ఈ సందర్భంగా న్యాయమూర్తి సుతార్ ఆకలి, దారిద్ర్యం, న్యాయం మధ్య ఉన్న సంబంధాన్ని వివరించేందుకు అనేక సాహిత్య, తత్వశాస్త్రాలు, మత గ్రంధాలు చెప్పిన అంశాలను ప్రస్తావించారు. వివిధ మత గ్రంధాలు ఆకలిగొన్నవారికి అన్నం పెట్టాలనే నీతి బోధనలను కూడా ప్రస్తావించారు. తినే ముందు ఆహారాన్ని ఇతరులతో పంచుకుంటే పాపాల నుంచి విముక్తి అవుతారని భగవద్ గీత, ఆకలితో ఉన్న నాకు ఆహారాన్ని ఇవ్వు అన్న బైబిల్‌లోని ఏసుక్రీస్తు మాటలు, పొరుగువారు ఆకలితో ఉండగా కడుపునిండా తిని పడుకుంటే అలాంటి వారు నిజమైన విశ్వాసులు కాదన్న ఇస్లామిక్ బోధనలను ఉటంకించారు. కొంతమంది ఆకలితో ఇబ్బంది పడుతుంటే అది కేవలం సామాజి క వైఫల్యం మాత్రమే కాదు నైతిక, ఆధ్యాత్మిక వైఫల్యం కూడా అవుతుందని జస్టిస్ సుతార్ పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 45లో పేర్కొన్నట్లుగా పసితనంలో పిల్లల సంరక్షణ, విద్య రాజ్యం బాధ్యత అని కూడా న్యాయమూర్తి చెప్పారు. అవి పిల్లల ప్రాథమిక హక్కులన్నారు. పౌష్టికాహా రం, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచటం రాజ్యాంగ బాధ్యత అని,

> ఈ కేసు రెండింజన్ల పాలన, గుజరాత్ ఆదర్శ రాష్ట్రం అనే ప్రచార బండారాన్ని బట్టబయలు చేసింది. బిజెపి ఏలుబడిలో నెలకొన్న పరిస్థితిని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవటం అవసరం.' ప్రతి ఏటా దేశాల ఆకలి సూచికలను ప్రకటిస్తున్నారు. మన దేశానికి ఇస్తున్న సూచికలను మేం అంగీకరించం' అని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది, పోనీ స్వంత సూచికలను వెల్లడిస్తున్నదా అంటే అదీ లేదు. ప్రపంచ ఆకలి సూచిక 2022లో మనదేశం 121 దేశాలలో 107వదిగా ఉంది.

వాటిని నెరవేర్చటంలో వైఫల్యం చెందినట్లు లఖీ సోలంకి కేసు వెల్లడించిందన్నారు. ఆకలిగొన్న వ్యక్తి ముందుగా రొట్టెను కోరతాడు తప్ప తత్వం కాదనే మాటతో న్యాయమూర్తి బెయిల్ ఉత్తరువును ముగించారు.

ఈ కేసు రెండింజన్ల పాలన, గుజరాత్ ఆదర్శ రాష్ట్రం అనే ప్రచార బండారాన్ని బట్టబయలు చేసింది. బిజెపి ఏలుబడిలో నెలకొన్న పరిస్థితిని ఈ సందర్భంగా గుర్తు చేసుకోవటం అవసరం. ప్రతి ఏటా దేశాల ఆకలి సూచికలను ప్రకటిస్తున్నారు.మన దేశానికి ఇస్తున్న సూచికలను మేం అంగీకరించం అని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది, పోనీ స్వంత సూచికలను వెల్లడిస్తున్నదా అదీ లేదు. ప్రపంచ ఆకలి సూచిక 2022లో మనదేశం 121 దేశాలలో 107వదిగా ఉంది. మనకంటే ఎగువన నైజీరియా 103, పాకిస్తాన్ 99వ స్థానంలో ఉన్నాయి. ఎనభైకోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు ఇస్తున్న నరేంద్రమోదీ సర్కార్ అంటూ డబ్బా కొట్టుకుంటున్న తరుణంలో ఈ సూచిక వెలువడింది. తరువాత 2025లో 123 దేశాల్లో 102వదిగా ఉంది. అతల్ బిహారీ వాజ్‌పేయి ఏలుబడి 2000 సంవత్సరంలో నూటికి మన మార్కులు 38.1, తరువాత 2008లో 34.6, నరేంద్రమోదీ అధికారానికి వచ్చిన తరువాత 2016లో 29.3, పదకొండు సంవత్సరాల పాలన తరువాత 2025లో 25.8 పాయింట్లు వచ్చాయి. ప్రపంచ సూచికల ప్రకారం 10పాయింట్లలోపు ఉన్న దేశాల్లో తక్కువ ఆకలి, పది నుంచి ఇరవై పాయింట్ల మధ్య ఉంటే కాస్త మెరుగు, ఇరవై నుంచి 35 పాయింట్ల మధ్య ఉంటే తీవ్రం, 35–50 మధ్య ఉంటే ఆందోళనకరం, అంతకు మించి ఉంటే మరింత ఆందోళనకర జాబితాలుగా దేశాలను వర్గీకరించారు. పన్నెండేళ్ల స్వర్ణయుగ పాలన తరువాత మనదేశం మూడవ తరగతిలో అంటే తీవ్ర ఆకలి ఉన్న దేశంగా ఉంది. హరిత విప్లవం తరువాత విదేశాల నుంచి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకొనే స్థితి నుంచి ఎగుమతి చేస్తున్నాం. అయితే జనం కడుపునిండా మూడుపూటలా తింటే ఎగుమతికి అవకాశం ఉండదు. అలాంటి స్థితి లేని కారణంగానే మన దేశంలో "కనిపించని ఆకలి" ఉందని అనేక మంది వర్ణిస్తున్నారు. ఎనభై కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలు అందిస్తున్నట్లు గొప్పగా చెప్పుకున్నప్పటికీ, పోషకాహార లేమిని అంగీకరిస్తూ పోషణ్ అభియాన్ పేరుతో కేంద్రం ఒక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నది. అయినప్పటికీ మన దేశం 2025 ప్రపంచ ఆకలి సూచికలో 123 దేశాలకు గాను 102వదిగా ఉంది, మనకంటే మరో 21 ఇంకా దరిద్రంలో ఉన్నాయి. దున్నబోతే దూడల్లో మెయ్యటానికి వచ్చేసరికి ఎద్దుల్లో అన్నట్లుగా బిజెపి వ్యవహారం ఉంది. రాజకీయంగా మాకు తిరుగులేదు అని చెప్పుకొనేందుకు మెజారిటీ రాష్ట్రాలలో తాము లేదా మిత్ర పక్షాలు అధికారంలో ఉన్నాయని, తదుపరి లోక్‌సభ ఎన్నికల్లో కూడా తమదే ఆధిపత్యం అని బిజెపి చెప్పుకుంటుంది.మరి దాని పాలిత రాష్ట్రాలు మానవాభివృద్ధి సూచికల్లో అధోగతిలో ఎందుకు ఉన్నట్లు ? పన్నెండేండ్ల మోదీ స్వర్ణయుగ పాలన తరువాత దేశంలో ఉన్న పరిస్థితుల గురించి చూద్దాం.

జనాభాయే మనకు పెద్ద పెట్టుబడి అని నేతలు కబుర్లు చెబుతారు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని మహాకవి గురజాడ ఎప్పుడో చెప్పారు. మన మనుషులు ఎలా ఉన్నారు? ఉన్న సమాచారం, అంచనాల ప్రకారం పైన చెప్పిన ఉచిత ధాన్యం, పోషణ్ కార్యక్రమం అమలు తరువాత కూడా దేశంలో 12శాతం మంది అంటే 17.2 కోట్ల మందికి పోషకాహారం లేదు. భావి భారత పౌరులుగా ఉండాల్సిన పిల్లల్లో ఐదేండ్ల లోపువారిలో 35శాతం మంది వయసుకు తగ్గ ఎత్తు పెరగటం లేదు, అంటే వారికి పోషకాహారం లేదు. ఎత్తుకు తగ్గ బరువులేని వారు 18.7 శాతం మంది ఉన్నారు. ప్రపంచంలో ఎక్కువగా జనాభా ఉన్న దేశాలలో మనది ఒకటి. ఒకవైపు పరిస్థితి ఇలా ఉండగా మరోవైపు అధికబరువు, ఊబకాయం సమస్య కూడా పెరుగుతున్నది. ఆకలి జబ్బు కొందరికైతే అధిక తిండి మరో జబ్బు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే5 ప్రకారం పిల్లలు 67.1శాతం, మంది తరుణ వయస్సులో ఉన్న బాలికలు 59.1శాతం రక్తహీనతతో ఉన్నారు. పిల్లలను కనే వయస్సులో ఉన్న మహిళల్లో సగం మంది రక్తహీనతతో ఉన్నారు.ఇది కనిపించని ఆకలికి ఒక సూచిక అని చెప్పవచ్చు. ప్రపంచ ఆహార మరియు పోషకాహార ప్రపంచ స్థితి నివేదిక 2025లో మన దేశంలో 40.4శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేసే శక్తి లేదు. అరవై శాతం మంది పట్టణ జనాభాకు ప్రొటీన్ల లోపం ఉంది. రెండు భారతాల దృశ్యం కనిపిస్తున్నది. ఒకటి పోషకాహారం లేని వారు, రెండు ఊబకాయం, అవసరానికి మించి బరువు పెరుగుల ఒక విచిత్రమైన స్థితి. మొత్తం మరణాల్లో అంటు వ్యాధులు కాని గుండె, మధుమేహం, కేన్సర్, శ్వాసకోశ సమస్యలతో మరణిస్తున్నవారు 63.65శాతం మంది ఉన్నట్లు అంచనా.

పైన చెప్పుకున్న లఖీ సోలంకి ఉదంతం ఏమి చెబుతోంది? ఆమెకు సంక్షేమ పథకాలు అంది ఉంటే ఇంట్లో ఆహార సమస్య వచ్చి ఉండేది కాదు, బిడ్డను చేతులారా పొగొట్టుకొనేది కాదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే, ఇతర వనరుల నుంచి సేకరించిన సమాచారం మేరకు రాష్ట్రాల ఆకలి సూచికలను కూడా తయారు చేశారు. దేశాల సూచికల మాదిరే వంద మార్కులకు వచ్చిన మార్కులను బట్టి వాటిని వర్గీకరణ అదే మాదిరి చేశారు. దేశ జాతీయ సగటు మార్కులు 29 తీవ్ర ఆందోళనకరంగా ఆకలి ఉన్న రాష్ట్రాలు అంటే 35 కంటే ఎక్కువగా ఉన్నవాటిలో బీహార్, ఝార్కండ్, చత్తీస్‌ఘర్ ఉన్నాయి. ఇవి బిజెపి లేదా వారి మిత్రుడైన నితీష్ కుమార్ ఏలుబడిలో ఉన్నవే అని వేరే చెప్పనవసరం లేదు. దేశ సగటు 29 కంటే ఎక్కువ ఆకలి ఉన్నవాటిని ఆందోళనకర వర్గీకరణలో చేర్చారు, అవి గుజరాత్, ఉత్తర ప్రదేశ్, అసోం, ఒడిషా, మధ్యప్రదేశ్, త్రిపుర, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్. ఒక మాదిరి అంటే 16 కంటే తక్కువ మార్కులు వచ్చిన సిక్కిం, పుదుచ్చేరి, కేరళ వంటివి ఉన్నాయి. తక్కువ ఆకలి ఉన్నది, పన్నెండు కంటే తక్కువ మార్కు లు వచ్చింది ఒక చండీఘర్ కేంద్ర పాలిత ప్రాంతమే. ఇలాంటి పరిస్థితి ఉన్నపుడు బిజెపి లేదా మోదీ దేశాన్ని పరుగులు పెట్టిస్తామంటే నమ్మేదెలా !

# పాడి పరిశ్రమకు కొరవడిన ప్రోత్సాహం



డా.ముచ్చుకోట సురేష్ బాబు

వ్యవసాయానికి అనుబంధ రంగాల్లో అత్యంత కీలకమైనది పాడి పరిశ్రమ. దేశంలో కోట్లాది చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీలు, మహిళా స్వయం సహాయక సంఘాలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ఒకప్పుడు పంటలు విఫలమైనా కుటుంబ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేది పాడి పరిశ్రమే. కానీ నేడు పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, గిట్టుబాటు ధరలు లేకపోవడం, ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటం వల్ల ఈ రంగం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

ఆత్మనిర్భర్ భారత్ ప్యాకేజీ, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్, యానిమల్ హస్బెండరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ వంటి పథకాలు ప్రకటించినప్పటికీ, వాటి ప్రయోజనాలు చిన్న పాడి రైతులకు ఆశించిన స్థాయిలో అందలేదు. రూ.15 వేల కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేస్తామని ప్రకటించినా, గ్రామీణ స్థాయిలో పాడి రైతుల పరిస్థితిలో గణనీయమైన మార్పు కనిపించడం లేదు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ప్రధానంగా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికే పరిమితమై, పాడి రైతుల అవసరాలు పెద్దగా పట్టించుకోలేదు.

కరోనా లాక్‌డౌన్ సమయంలో హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు మూతపడటంతో పాలకు దాదాపు 28 శాతం వరకు డిమాండ్ తగ్గింది. రోజుకు సుమారు 560 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ, కేవలం 360 లక్షల లీటర్లకే మార్కెట్ లభించింది. దీంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. సహకార డెయిరీల ద్వారా పాల కొనుగోలు జరిగినా, అది రైతుల నష్టాలను పూర్తిగా భర్తీ చేయలేకపోయింది.

ప్రస్తుతం పాడి రైతులను అత్యధికంగా ఇబ్బంది పెడుతున్న అంశం దాణా, పశుగ్రాసం ధరల పెరుగుదల. గత కొన్నేళ్లలో పశువుల దాణా ధరలు గణనీయంగా పెరిగాయి. పచ్చగడ్డి కొరత, ఎండుగడ్డి అధిక ధరలు పాడి రైతులపై అదనపు భారం మోపుతున్నాయి. ఒకప్పుడు రూ.600 ఉన్న తౌడు బస్తా ఇప్పుడు రూ.700కు చేరగా, ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు పలుకుతోంది. దీంతో పాల ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరిగింది.

రోజుకు నాలుగు లీటర్ల పాలు ఇచ్చే గేదెకు అవసరమైన దాణాపైనే దాదాపు రూ.100 వరకు ఖర్చవుతోం ది. డెయిరీలు లీటరు పాలకు చెల్లించే ధరతో రైతుకు మిగిలేది చాలా స్వల్పం. పశువుల సంరక్షణ, వైద్య ఖర్చులు, శ్రమ, విద్యుత్తు, నీటి వ్యయం కలిపి చూస్తే చాలామంది రైతులు రోజుకు రూ.250 నుంచి రూ.300 వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు డెయిరీలు పాల ఉత్పత్తుల ధరలను తరచూ పెంచుతున్నప్పటికీ, రైతుల నుంచి సేకరించే పాల ధరలను పెంచడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయి. విజయ డెయిరీతో పాటు హెరిటేజ్, హాట్సన్, తిరుమల, శ్రీచక్ర, గాయత్రి తదితర



ప్రైవేట్ డెయిరీలు రైతులకు గిట్టుబాటు ధర చెల్లించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ప్రైవేట్ డెయిరీల మధ్య పోటీ ఉన్నప్పటికీ, రైతుల ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో పెరగడం లేదు.

పశువైద్య సేవల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. అనేక పశువైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా రైతులకు సమయానికి సేవలు అందడం లేదు. పశువుల్లో నోటి కాలి వ్యాధి, గాలిసోకు, ఇతర అంటువ్యాధుల నివారణకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ కార్యక్రమాన్ని మరింత సమర్థంగా అమలు చేయాలి. దేశవ్యాప్తంగా పశువులకు వంద శాతం టీకాలు అందించే చర్యలు చేపట్టాలి. అలాగే కృత్రిమ గర్భధారణ సేవలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలి.

రాష్ట్రంలో సహకార డెయిరీల ద్వారా రోజుకు సుమారు 21.7 లక్షల లీటర్ల పాలు, ప్రైవేట్ డెయిరీల ద్వారా 47.5 లక్షల లీటర్ల పాలు సేకరించబడుతున్నాయి. అదనంగా అసంఘటిత రంగం ద్వారా సుమారు 220 లక్షల లీటర్ల వరకు పాలు విక్రయమవుతున్నట్లు అంచనా. ఈ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నప్పటికీ, తగిన ప్రోత్సాహం లేక అభివృద్ధికి నోచుకోవడం లేదు.

ప్రస్తుత పరిస్థితుల్లో పాడి రైతులకు ప్రత్యేక సహాయక చర్యలు అత్యవసరం. పాడిపశువుల కొనుగోలుకు కనీసం రూ.20వేల సబ్సిడీ, పశు బీమాకు రూ.2 వేల ఆర్థిక సహాయం, సబ్సిడీపై నాణ్యమైన దాణా సరఫరా, పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమాలు, ఉచిత పశువైద్య సేవలు, నాణ్యమైన పాలకు ప్రీమియం ధర వంటి చర్యలు అమలు చేయాలి. లీటరు గేదె పాలకు కనీసం రూ.10, ఆవు పాలకు రూ.5 అదనపు ప్రోత్సాహక ధర చెల్లించే విధానాన్ని ప్రభుత్వంపరిశీలించాలి.

పాడి రైతుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు కూడా అవసరం. పాడి రైతు కుటుంబంలో వివాహం జరిగితే ఆర్థిక సహాయం, ప్రతిభ కనబరిచిన వారి పిల్లలకు విద్యా ప్రోత్సాహకాలు, ఉన్నత విద్యలో ప్రవేశం పొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, ఉత్తమ పాల ఉత్పత్తిదారులకు నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందించాలి. పాడి రైతు మరణించినపుడు అంత్యక్రియల ఖర్చులకు ప్రత్యేక సహాయం అందించాలి.

అదేవిధంగా పెద్ద డెయిరీ ఫార్మ్‌లకు గడ్డి కోయు యంత్రాలు, పాల క్యాన్లు, విద్యుత్తు రాయితీలు, మినరల్ మిక్చర్, బీమా ప్రీమియంపై సబ్సిడీలు అందించాలి. సహకార డెయిరీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి, ఉద్యోగులకు తగిన వేతన సవరణలు అమలు చేయాలి. పాడి రైతుల సంక్షేమం, ఆధునికీకరణ, మార్కెటింగ్ కోసం ప్రత్యేకంగా కనీసం రూ.20కోట్ల నిధిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

దేశంలో శ్వేత విప్లవం విజయవంతం కావడానికి పునాది వేసింది పాడి రైతులే. అలాంటి రైతులను నిర్లక్ష్యం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. పాడి పరిశ్రమను వ్యవసాయానికి అనుబంధ రంగంగా కాకుండా, గ్రామీణ ఉపాధి, మహిళా సాధికారత, పోషకాహార భద్రతకు కీలకమైన ఆర్థిక రంగంగా గుర్తించి సమగ్ర విధానంతో ప్రోత్సహించినప్పుడే దేశంలో మరోసారి శ్వేత విప్లవానికి నాంది పలకగలుగుతాం.

# అరుణార్ణవమైన ఖమ్మం పురవీధులు

- మూడు ప్రాంతాలలో పాదయాత్రలు
- జెడ్‌పి సెంటర్ నుండి మహాప్రదర్శన
- స్ఫూర్తిమంతంగా ప్రజా చైతన్య యాత్ర ముగింపు వేడుక

ప్రజాపక్షం/ఖమ్మం –ఖమ్మం రూరల్: ఐదలాపు జెదారి...హై, మార్పు కావాలి అనే నినాదాలతో ఖమ్మం నగర వీధులు మార్మోగాయి. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)జాతీయ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజాచైతన్య పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా ఖమ్మం ప్రధాన రహదారులన్నీ గురువారం అరుణార్ణవమయ్యాయి.పాదయాత్రకు పలువురు సంఘీభావం తెలిపారు. జై సిపిఐ నినాదాలు, కళాకారుల నృత్యాలు, డప్పుల దరువులు, ఎర్రజెండాల రెపరెపలతో యాత్ర సాగిన తీరు నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజా సమస్యల ప్రజల్లోకి తీసుకువెళ్లడం, మార్పు ఆవశ్యకత చాటిచెప్పడం. సామాజిక న్యాయం కోసం ప్రజలను చైతన్యపరచడమే లక్ష్యంగా పెద్ద సంఖ్యలో సిపిఐ శ్రేణులు యాత్రలో పాల్గొన్నాయి. సిపిఐ జాతీయసమితి సభ్యులు బాగం హేమంతరావు,జిల్లా కార్యదర్శి దండి సురేష్,జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి నాయకత్వాన మూడు మార్గాల్లో పాదయాత్రలు చేపట్టారు. ఈ మూడు పాదయాత్రలూ జెడ్.పి.సెంటర్‌కు చేరుకున్నాయి. అక్కడినుండి మహాప్రదర్శన ప్రారంభమైంది.కళాకారుల నృత్యాలు, డప్పుల దరువులు, విప్లవ గీతాలు కార్యకర్తల్లో ఉత్సాహం నింపాయి. ప్రజా ఉద్యమాలకు సిపిఐ ఎప్పటికి అండగా ఉంటుందని, మార్పు కోసం ప్రజలను ఐక్యం చేస్తామని నాయకులు పిలుపునిచ్చారు. ముందుగా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా ఎర్రజెండా ఊపి ప్రారంభించిన ఎర్రదండు యాత్ర గాంధీచౌక్ వైపు కదిలింది. మధ్యగేటు నుంచి కమన్‌బజార్‌లోకి, అక్కడి నుంచి పాత మున్సిపాలిటీ కార్యాలయం రోడ్డు మీదుగా బస్టాండ్‌వైపు కొనసాగింది. యాత్రలో పాల్గొన్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు ఎర్ర జెండాలను చేతబూని ముందుకు సాగుతుండగా



వారి వెనుక కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

**పలు డివిజన్లలో పాదయాత్ర**

కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో సిపిఐ పాదయాత్ర నిర్వహించింది. ప్రధానమంత్రి మోదీ విధానాలను వ్యతిరేకిస్తూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు నేతృత్వంలో రోటరీనగర్ సిపిఐ కార్యాలయం నుండి పాదయాత్ర ప్రారంభించి ఇందిరానగర్ ద్వారా జెడ్పి సెంటర్‌కు చేరుకున్నది. జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేతృత్వంలో నయా బజార్ కళాశాల నుండి ప్రారంభమై పాదయాత్ర కాల్వఒడ్డు, గాంధీ చౌక్ ,కమాన్‌బజార్, పాత మున్సిపాలిటీ, శుక్రవారపు పేట మీదుగా జడ్పి సెంటర్‌కు చేరుకుంది. జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి నేతృత్వంలో అల్లీపురం క్రాస్‌రోడ్ నుండి ప్రారంభమైన ప్రదర్శన సంజీవనగర్, ముస్తఫానగర్, బోనకల్ రోడ్డు మీదుగా జెడ్.పి.సెంటర్‌కు చేరుకుంది. వందలాదిమంది డప్పు కోలాట దరువుల ముందు నడవగా ఎర్రదండు వైరారోడ్‌లో కదం తొక్కింది. పాతబస్టాండ్, మయూరి సెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రం వరకు సాగింది. మమత ఆసుపత్రివద్ద డాక్టర్ బాగం కిషన్ రావు, సిహెచ్ సత్యనారాయణరెడ్డి పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి సత్కరించారు. వైరా రోడ్‌లో డాక్టర్ గోర్కి ఆసుపత్రి సిబ్బంది ఏలూరి కృష్ణప్రసాద్ నేతృత్వంలో పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. జమ్మిబండ సమీపంలో పోటు ప్రసాద్ స్మారకస్థూపం వద్ద పార్టీ పతాకాన్ని జమ్ముల జితేందర్‌రెడ్డి ఆవిష్కరించగా, షేక్ జానిమియా, కొండపర్తి గోవిందరావు, బిజి క్లైమెంట్, మల్లేష్, వరద నరసింహరావు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

## కాంగ్రెస్ అడ్డుకోవడం వల్లే..



న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సజావుగా సాగలేదని, అందుకు కాంగ్రెస్ కారణమని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ప్రతిపక్ష కాంగ్రెస్ సభను పదేపదే అడ్డుకోవడం వల్ల కీలక బిల్లులపై సమగ్ర చర్చ జరగలేదని ఆయన అన్నారు. లోక్‌సభ ఉత్పాదకత కేవలం 19 శాతంగా, రాజ్యసభ ఉత్పాదకత 39 శాతంగా నమోదైందని చెప్పారు. ఈ సమావేశాల్లో మొత్తం 12 బిల్లులు ఆమోదం పొందగా, రెండు సభల్లో చర్చ జరిగిన బిల్లు కేవలం ఒక్కటేనంటూ, 'పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్' ను రిజిజు ప్రస్తావించారు. ఈ బిల్లును రెండు సభలు వాయిస్ ఓటుతో ఆమోదించాయి. ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా ప్రతిపక్ష సభ్యులు కొనసాగనివ్వలేదని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపిలు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేయడానికి సభకు వస్తున్నారని రిజిజు విమర్శించారు. ఎన్నికై పార్లమెంటుకు వచ్చిన సభ్యులు చర్చలు, వాదోపవాదాల్లో పాల్గొనాలని, కొత్తగా ఎన్నికైన ఎంపిలకు కూడా మాట్లాడే అవకాశం దక్కకపోవడం విచారకరమని అన్నారు. శీతాకాల సమావేశాల నాటికి ప్రతిపక్ష వైఖరిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అయితే, సమావేశాల అంతరాయానికి మరో రాజకీయ నేపథ్యం ఉంది. 'నీట్' పేపర్ లీక్, అయోధ్య రామ మందిరానికి వచ్చిన విరాళాల దుర్వినియోగ ఆరోపణలు వంటి అంశాలపై ప్రతిపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. తరువాత పేపర్ లీక్‌పై నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు తీసుకున్న చర్యలపై చర్చించాలని ప్రతిపక్షం పట్టుబట్టింది. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం పేపర్ లీక్ అంశంపై చర్చకు, అనంతరం అమిత్ షా సమాధానానికి అవకాశం ఇస్తామని చెప్పినా కాంగ్రెస్ అంగీకరించలేదు. రాహుల్ గాంధీ మాత్రం విద్యార్థులపై జరిగిన చర్యలకు బాధ్యులెవరో తెలుసుకోవాలని పట్టుబట్టారు. ఈ అంశంలో అమిత్ షా బాధ్యత వహించాల్సిందేనని, ఆదేశాలు ఇచ్చి ఉంటే బాధ్యత వహించాలని, ఇవ్వకపోతే తన శాఖను సమర్థంగా నిర్వహించలేదనే కారణంతో బాధ్యత వహించాలని ఆయన వ్యాఖ్యానించారు. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో, సభ కార్యకలాపాలకు పదేపదే ఆటంకం కలిగింది.

## తీవ్ర ఒత్తిడిలో కేంద్ర ప్రభుత్వం

కాంగ్రెస్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఇటీవల ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేనంతగా ఒత్తిడికి గురైందని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ప్రభుత్వం భయపడిపోయిందని, ప్రతిపక్షం లేవనెత్తిన అంశాలను ఎదుర్కొనలేని పరిస్థితిలో లేకపోవడంతో సభా కార్యకలాపాలు సజావుగా సాగకుండా చేశారని ఆరోపించింది. అదే సమయంలో, మొత్తం సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీల ఐక్యత స్పష్టంగా కనిపించిందని కాంగ్రెస్ పేర్కొంది. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేశ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమావేశాల సమయంలో పార్లమెంట్‌కు పెద్దగా హాజరు కాలేదని ఆరోపించారు. చివరి రోజు సభ నిరవధికంగా వాయిదా పడే ముందు మాత్రమే వారు సభకు వచ్చారని ఎద్దేవా చేశారు. 2015లో వ్యాపమ్ కుంభకోణం నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, 11 ఏళ్ల తర్వాత మళ్లీ యువతకు సంబంధించిన అంశం కారణంగా సమావేశాలు దాదాపు స్తంభించాయని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీల ఐక్యతకు ఈ సమావేశాలు ఉదాహరణగా నిలిచాయని జైరాం రమేష్ అన్నారు. 'ఇండియా కూటమి' నేతలు ప్రతిరోజూ రాజ్యసభలో మల్లికార్జున ఖర్గే ఛాంబర్‌లో సమావేశమై ఉమ్మడి వ్యూహాన్ని రూపొందించారని చెప్పారు. 'వన్ నేషన్–వన్ ఎలక్షన్'పై నివేదిక వాయిదా పడటం, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు ముందుకు రాకపోవడం, అరెస్టు తర్వాత ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి పదవి నుంచి ఆటోమేటిక్‌గా తొలగించే ప్రతిపాదనపై రాజ్యాంగ సవరణ బిల్లు చర్చకు రాకపోవడం ప్రతిపక్ష విజయాలని కాంగ్రెస్ అభివర్ణించింది. ఎస్‌ఐఆర్ సవరణ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపడం కూడా తమ ఒత్తిడి ఫలితమేనని పేర్కొంది. అయితే ఈ వాదనలకు మరో వ్యాఖ్య కూడా ఉంది.లోక్‌సభలో కాంగ్రెస్ ఉపనేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో అవకతవకలు, రామమందిరానికి సంబంధించిన విరాళాల ఆరోపణలు, బిజెపి పాలిత రాష్ట్రాల్లో అవినీతి ఆరోపణలు, విదేశాంగ విధానం, మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో నిధుల వినియోగం వంటి అంశాలను సభలో ప్రస్తావించేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, విద్యార్థులపై జరిగిన చర్యలపై హోంమంత్రి ప్రకటన, ప్రధాని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేసిందని తెలిపారు.

# పకడ్బందీగా రైతు సంక్షేమ పథకాలు

## అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతు సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయడం ద్వారా కేం ద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణను వేగవంతం చేయడంతో పాటు రైతులకు నాణ్యమైన మొక్కలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గురువారం సచివాలయంలో తన పరిధిలోని వివిధ శాఖలు, సంస్థల ఉన్నతాధికారులతో సమిక్ష స మావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ నకిలీ డిఎపి తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, మార్కెట్లలో కొనసాగుతున్న ఆర్‌డి వ్యవస్థను పూర్తి గా నిర్మూలించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ధారించిన 9 వరి రకాలను సాగు చేసిన రైతులు ఎఇఒల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకునేలా రైతువేదికల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సూ చించారు. ప్రస్తుత పంటల పరిస్థితులు,వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ఇప్పటివరకు రైతులకు సబ్సిడీపై అందించిన యంత్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్న పంపిణీలో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఆదేశించారు. రైతు సంక్షేమ పథకాల అమలుకు సిబ్బంది కొరతను సాకుగా చూపరాదని అవసరమైతే ఇతర శాఖల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని, ఏడాదికి 2 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులను అదేశించారు.ప్రతి ఉ మ్మడి జిల్లాకు కనీసం ఒక ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే రైతుల్లో మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్, మిడ్‌డే మీల్స్ కార్యక్రమాలకు అవసరమైన కూరగాయలను స్థానిక రైతుల నుంచే కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించాలని, వంట నూనెగా విజయ ఆయిల్‌ను వినియోగించే విషయంపై హరేకృష్ణ చారిటీ ట్రస్ట్ ప్రతినిధులతో చర్చించాలని సూచించారు.విజి రామ్ జి పథకం కింద ఎకో పాండ్లు, వెదురు సాగు చేపట్టేలా పం చాయతీరాజ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని వ్యవసాయశాఖ కార్యదర్శిని మంత్రి ఆదేశించారు. ఒకే తరహా విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖలు, కార్పొరేషన్లు, సొసైటీలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే అవకాశాలను పరిశీలించాల ని వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ను ఆదేశించారు. దీనివల్ల పరిపాలన మరింత సరళంగా మారడంతో పాటు పర్యవేక్షణ సమర్థవంతంగా ఉంటుందని సూచించారు. ఈ సమీక్షలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, కోఆపరేటివ్ కమిషనర్ రాహుల్ రాజ్, హాకా ఎండి చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ, హార్టికల్చర్ యూనివర్సిటీల వీసీలు జానయ్య, రాజిరెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మ ణుడు తదితర అధికారులు పాల్గొన్నారు.



# 'సర్'లో 21% ఓట్లు తొలగిపోయే ప్రమాదం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా 21 శాతం ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందని, పకడ్బందీ కార్యాచరణతో చర్యలు చేపట్టకపోతే భవిష్యత్‌లో రాజకీయంగా పెద్ద నష్టం జరుగుతుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి మంత్రుల నుంచి బూత్ లెవెల్ వరకు సరైన బాధ్యత తీసుకోకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్‌లో సమస్యలను పరిష్కరించడంతో పాటు బిజెపి, బిఆర్ఎస్ కలిసి చేస్తున్న ఓట్ల తొలగింపు కుట్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఈ విషయాన్ని పార్టీలోని ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకుని ముందుకు వెళ్లాలని ఆయన ఆదేశించారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన గురువారం రాత్రి జరిగిన పార్టీ నేతల జూమ్ సమావేశంలో సిఎం మాట్లాడారు. తక్షణమే జిల్లా ఇన్‌చార్జి మంత్రులు జిల్లాల్లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో సమీక్ష సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రెండు రోజులు క్షేత్ర స్థాయికి వెళ్లి జిల్లాల్లో సమీక్షలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు ప్రతీ నియోజకవర్గానికి సంబంధించి నివేదిక తయారు చేయాల్సిందేనని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఇన్‌చార్జిలు 4 రోజులు నియోజకవర్గంలో ఉండి సమస్య లు తెలుసుకుని పూర్తి స్థాయిలో పరిష్కరించాల్సిందేనని సిఎం ఆదేశించారు. ప్రతి బూత్ స్థాయిలో పార్టీ శ్రేణులు బాధ్యత తీసుకోవాలని, ఎక్కడైనా ఓటర్లకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతస్థాయి నాయకత్వం దృష్టికి తీసుకురావాలని అన్నారు. సర్ ప్రక్రియపై సరైన కార్యాచరణతో ముందుకు వెళ్లకపోతే పార్టీ ఉపేక్షించబోదని సిఎం స్పష్టం చేశారు. భవిష్యత్‌లో రాజకీయంగా పెద్ద నష్టం జరగకుండా ఇప్పటి నుంచే పకడ్బందీ కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సిఎం ఆదేశించారు. ఈ మేరకు ఎఐసిసి నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయని ఆయన చెప్పారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జులు, బూత్ స్థాయి నాయకులు సమన్వయంతో పనిచేసి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా చూడాలని సిఎం ఆదేశించారు.



**73 లక్షల ఓట్లు తొలగింపు, 64 లక్షల ఓట్లు 'అనమిలిస్'లో పెట్టడం తీవ్రంగా పరిగణించాలి: మీనాక్షి నటరాజన్**

తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ 73 లక్షల ఓట్లు తొలగించడం, మరో 64 లక్షల ఓట్లను 'అనమిలిస్'గా గుర్తించడం పట్ల కాంగ్రెస్ పార్టీ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. ఇంత భారీ స్థాయిలో ఓట్ల తొలగింపు దేశంలోని మరే రాష్ట్రంలోనూ జరగలేదని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో భారీగా ఓట్ల తొలగింపు వెనుక బిజెపి, ఎన్నికల కమిషన్ కుట్ర ఉందనే అనుమానాలను తోసిపుచ్చలేమని, ఓట్ల తొలగింపు రాజకీయ కుట్రలు అత్యంత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పరిణామాలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అర్హత లేని ఓట్లను తొలగించడంతో పాటు, అర్హులైన ఓటర్లు తిరిగి తమ ఓటు హక్కును పొందేలా చూడటంలో బూత్ లెవల్ ఏజెంట్ల (బిఎల్ఎ) పాత్ర అత్యంత కీలకమని మీనాక్షి నటరాజన్ అన్నారు. ప్రతి వార్డులో బిఎల్ఎలు ప్రతి ఓటును క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో ఉన్న డిజిటల్, 'అనమిలిస్' ఓట్లను ఎమ్మెల్యేలు, ఎంపిలు, పార్టీ నాయకులు ప్రత్యేకంగా పరిశీలించాలని సూచించారు. తొలగించిన ఓట్లు, అనమిలిస్ ఓట్లు కలిపి కోటి 30 లక్షలకు పైగా ఉన్నాయని, భవిష్యత్‌లో జరగనున్న ఎన్నికల్లో ఇవే ఓట్లు కీలకంగా మారుతాయని, ఇంత భారీ స్థాయిలో ఓట్ల తొలగింపు అత్యంత ప్రమాదకరమని ఆమె అన్నారు. వెంటనే కాంగ్రెస్ నాయకులంతా సర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడాలని అన్నారు. ఎక్కడైనా చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా సహించేది లేదని ఆమె పార్టీ నేతలను హెచ్చరించారు. బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించని కోఆర్డినేటర్లు, బిఎల్ఎలను వెంటనే తొలగించి, చురుకుగా పనిచేసే కొత్త వారిని నియమించాలని ఆదేశించారు. ఇన్‌చార్జ్ మం త్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు సర్ ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మీనాక్షి నటరాజన్ సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితుల ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఓటర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అన్నారు. 'మన నిర్లక్ష్యం అత్యంత ప్రమాదకర పరిస్థితులకు దారితీసే అవకాశం ఉంది. ప్రతి నాయకుడు, ప్రతి బిఎల్ఎ బాధ్యతగా పనిచేయాలి. ఓటర్ల జాబితాలో ప్రతి పేరును పరిశీలించి అ ర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా చూ డాలి' అని మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు.



# బెంగాల్ మాదిరిగానే తెలంగాణలోనూ కుట్ర

## ఓట్ల తొలగింపుపై సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా నుండి లక్షలాది ఓట్లను తొలగించిన విధంగానే తెలంగాణలో కూడా అదే పని చేయడానికి కొన్ని రాజకీయ శక్తులు కుట్ర పన్నుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ తెలంగాణలో ఓట్లను తొలగించడానికి కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో తమ ఓ ట్లు తొలగించబడకుండా చూసుకోవాలని రాష్ట్ర ప్రజలకు సిఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని బంజారాభవన్‌లో గురువారం జరిగిన 'మైనారిటీ ఎక్సలెన్స్ సమ్మిట్'లో సిఎం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ సందర్భంగా కొన్ని శక్తులు పెద్దఎత్తున ఓట్లను తొలగించడానికి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. 'ప్రతి ఒక్కరూ రేవంత్ రెడిగా మారి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు ను కాపాడాలి'' అని సిఎం అన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హిందువులు, ముస్లింలు తన రెండు కళ్లని అన్నారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే మైనారిటీలకు ఉన్న 4 శాతం రిజర్వేషన్‌ను తొలగిస్తామని కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పిన విషయాన్ని సిఎం గుర్తుచేశారు. 'ముందుగా గుజరాత్‌లో ముస్లిం కోటాను తొలగించాలని మేము అమిత్ షాకు ఇప్పటికే సవాల్ చేశాం' అని అన్నారు. మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం 4 శాతం రిజర్వేషన్‌ను సమర్థవంతంగా అమలు చేసింది. యువత గ్రూప్ I,II సర్వీసులలో ఉద్యోగాలు పొందారు. గ్రూప్ ఉద్యోగాల నియామక ప్రక్రియను అడ్డుకోవడానికి కొన్ని శక్తులు సుప్రీంకోర్టుకు వెళ్లినప్పటికీ, ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి నియామకాలను విజయవంతంగా పూర్తి చేశా ము. కాంగ్రెస్ ప్రభుత్వంలో మైనారిటీలకు వారి సముచిత స్థానం లభించేలా చర్యలు తీసుకున్నాం. వారి కోసం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నామని, ఈ వర్గానికి చెందిన ఒక సభ్యుడిని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు నియమించాం. భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్‌కు రాష్ట్ర మంత్రి పదవి ఇచ్చాం. ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌కు రూ.3 కోట్ల నగ దు బహుమతితో గ్రూప్1 ఉద్యోగం ఇవ్వగా, క్రికెటర్ మహమ్మద్ సిరాజుద్దీన్‌కు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా నియమించాం'' అని సిఎం వివరించారు. జర్మనీ, జపాన్‌లలో ఉన్న అనేక ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి మైనారిటీ యువత తమ విద్యతో పాటు నైపుణ్యాలను కూడా సంపాదించుకోవాలని సిఎం నొక్కి చెప్పారు. విద్యార్థుల నైపుణ్యాల ను మెరుగుపరచడానికి ప్రభుత్వం ఇప్పటికే ఒక స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా, ప్రభుత్వ ఉద్యోగా లు పొందిన మైనారిటీ యువతను, ఐఐటి, నీట్, ఇతర జాతీయ పోటీ పరీక్షలలో ఉన్నత ర్యాంకులు సాధించిన మై నారిటీ గురుకుల పాఠశాలల విద్యార్థులను ముఖ్యమంత్రి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రు లు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మ హ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఇ - మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ భూకేటాయింపులపై

# బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం

## కెటిఆర్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి : ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఈ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ భూకేటాయింపుల విషయంలో బిఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తోందని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాజకీయ లబ్ధి కోసం వాస్తవాలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ మా న్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ కోసం 2007లోనే 590 ఎకరాల భూమిని కేటాయించినట్లు చామల తెలిపారు. భూకేటాయింపుల విషయంలో అధికారుల కమిటీ నిర్ణయం తీసుకుంటుందని, ఇందులో టిఐడిసి, జిహెచ్ఎం సి, హెచ్ఎండిఎ తదితర సంస్థల అధికారులు భాగస్వాములుగా ఉంటారని వివరించారు. రాజకీయ నేతలకు నేరుగా భూములు కేటాయించే అధికారం లేదని స్పష్టం చేశారు. టెస్సాక్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థ 2024 డిసెంబర్‌లో భూమి కోసం దరఖాస్తు చేసిందని, దాదాపు ఏడాది పాటు అధికారిక ప్రక్రియ కొనసాగిన అనంతరం 2025 డిసెంబర్‌లో భూకేటాయింపు జరిగిందని చామల తెలిపారు. 2024లో కంపెనీ భూమి కోసం దరఖాస్తు చేసిన సమయంలో కొండల్‌రెడ్డి కంపెనీ డైరెక్టర్‌గా లేరని, 2025లో భూకేటాయింపు జరిగిన సమయంలోనూ కంపెనీలో ఆయన లేరని తెలిపారు. 2026 మార్చిలో మాత్రమే ఆయన కంపెనీ అడ్వైజరీ బోర్డులో గౌరవ సలహాదారుగా చేరారని చెప్పారు. కొండల్‌రెడ్డికి కంపెనీలో ఒక్క షేర్ కూడా లేదని, ఆయన కుటుంబ సభ్యులకు సైతం కంపెనీలో ఎలాంటి వాటాలు లేవని చామల స్పష్టం చేశారు. తెలంగాణలోని నీటి సమస్యలు, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై కెటిఆర్ దృష్టి సారించాలని హితవు పలికారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రాన్ని స్తంభింపజేస్తాం

## ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆటో డ్రైవర్ల నిరవధిక సమ్మె: ఆటో, యాప్ ఆధారిత సంఘాల జెఎసి

ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఆటో కార్మికులకు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని తక్షణమే పరిష్కరించకుంటే రాష్ట్రాన్ని స్తంభింపజేస్తామని రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జెఎసి ప్రభుతాన్ని హెచ్చరించింది. ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికై తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత డ్రైవర్ల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో గురువారం బాగ్ లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో బి.వెంకటేశం(ఎఐటియుసి), జెఎసి సీనియర్ నాయకులు గాజుల ముకేశ్ గౌడ్, వి.మారయ్య(బిఆర్‌టియు) పి.శ్రీకాంత్(సిఐటియు), రవిశంకర్(బిఎంఎస్), వి.ప్రవీణ్(టియుసిఐ) జి. మల్లేష్ గౌడ్(ఐఎన్‌టియుసి) పి.యాదగిరి (టిఎన్‌టియుసి) శివానంద (టిఎండియు), డి. శ్రీనివాస్ (జియుటిఎస్) ఎస్ జమా (జిహెచ్ఎడియు), ఎస్.దయానంద్ (టిటిడబ్ల్యుయు), కొమరయ్య (టిఎడియు), క్యాబ్ యూనియన్ బి.రాజు గౌడ్, జెఎసి నాయకులు మంద రవికుమార్, ఎం.ఎ. సలీమ్, ఎండి. మజీద్ తదితరులు పాల్గొని ఈ నెల 23 అర్ధరాత్రి నుంచి చేపట్టబోయే నిరవధిక సమ్మె(బంద్)కి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఆటో జెఎసి కన్వీనర్ బి.వెంకటేశం మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు అనారోగ్యాలు, ప్రమాదాలతో అకస్మాత్తుగా మృతి చెందుతున్నప్పటికీ వారి కుటుంబాలకు ప్రభుత్వపరంగా తగిన భరోసా లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు సేవ చేస్తున్న ఆటో డ్రైవర్లను కూడా ప్రభుత్వం పౌరులుగా గుర్తించి సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు. ఆర్‌టిసి లేదా కార్పొరేట్ సంస్థలకు ఈ.వి ఆటోలు అందించే ప్రతిపాదనను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సుమారు 7.5 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, హైదరాబాద్ సుమారు 2.5 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఆటోలు కార్పొరేట్ సంస్థలకు ఇవ్వడం వల్ల డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటుందని అన్నారు. ఇప్పటికే గిరాకీ తగ్గి ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఫైనాన్స్ కట్టలేక అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఆటో మీటర్ చార్జీలను పెంచాలని, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు ఇతర న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ ప్రభుత్వం కల్పించాలని అన్నారు. ఓలా, ఉబర్ వంటి ప్రైవేట్ సంస్థల కమిషన్ల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక ఆటో యాప్ తీసుకురావాలని సూచించారు. కమిషన్, దోపిడీ లేకుండా ప్రయాణికులకు, డ్రైవర్లకు ప్రయోజనం కలిగేలా ప్రభుత్వ యాప్ ఉండాలని సూచించారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వాన్ని కలిసి విజ్ఞప్తులు చేశామని తెలిపారు. ఒక రోజు సమ్మె చేసినప్పుడు సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చినా, ఇప్పటివరకు కీలక డిమాండ్లు అమలు కాలేదన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మాకు వ్యతిరేకత లేదని, ఆటో డ్రైవర్లు బతికే పరిస్థితులు కల్పించడం, మా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడం ప్రభుత్వాల బాధ్యత అని, సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని బి.వెంకటేశం స్పష్టం చేశారు.



**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
పటాన్‌చెరు సర్కిల్-46, శేరిలింగంపల్లి జోన్.

షార్ట్ టెండర్ నోటీసు నెం.Engg-17/CMC/PTC-C-46/2026-27 తేది: 11.08.2026

NIT No. షార్ట్ టెండర్ నోటీసు నెం.Engg-17/CMC/PTC-C-46/2026-27, తేది: 11.08.2026, పని పేరు: 1 సంఖ్య ఇంజెక్షన్ బోర్‌వెల్, 1 సంఖ్య PVNR ఆడిటోరియంలో అలంకరణ లైటింగ్ ఏర్పాటు, అంచనా విలువ / ఇసివి: రూ.56.00లక్షలు, డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 13.08.2026 మ.2:00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 20.08.2026 మ.2:00గం.ల వరకు, ఇఇ అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46. ఫోన్ నెం. 7331189492. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.telangana.gov.in, పటాన్‌చెరు సర్కిల్-46 లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.
DIPR R.O. No. : 7847-PP/CL/ADVT/2026-27, Date: 13-08-2026

తెలంగాణ ప్రభుత్వం
**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, మిషన్ భగీరథ సర్కిల్ :: ఖమ్మం**
(ఎస్.సి. బాయ్స్ హాస్టల్ పక్కన, రామాలయం వీధి, ఎన్.ఎస్.పి. క్యాంప్, ఖమ్మం)


షార్ట్ టెండర్ నోటీసు నెం. 3/6th Call/2026-27, తేదీ: 12.08.2026

ఖమ్మం జిల్లా, మిషన్ భగీరథ సర్కిల్ పరిధిలోని ఈ క్రింది పనుల కోసం అర్హులైన కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా బిడ్లు ఆహ్వానించబడుతున్నాయి. దీనికి సంబంధించిన షెడ్యూల్స్ 14.08.2026 నుండి 21.08.2026 మధ్యాహ్నం 3:00 గంటల వరకు https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. బిడ్లు 21.08.2026 సాయంత్రం 4:00 గంటలకు తెరవబడతాయి.

| క్రమ సంఖ్య | టెండర్ నోటీసు నం. | పని పేరు | అంచనా వ్యయం (రూ. లక్షల్లో) | గ్రాంట్ | కేటగిరీ |
|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 1 | 3 6th call | ఖమ్మం జిల్లా, తిరుమలాయపాలెం మండలం, బీరోలు (గ్రామం & గ్రామ పంచాయతీ) వద్ద కొత్త OHSR (ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్) నిర్మాణం. | 48.00 | SDF 2025-26 | General (Open) |

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, మిషన్ భగీరథ సర్కిల్, ఖమ్మం
DIPR R.O. No. : 7823-PP/CL/ADVT/2026-27, Date: 13-08-2026

## కాలువలో వాహనం బోల్తా



ప్రజాపక్షం/ముప్కాల్: బాల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన వరద కాలువ బ్రిడ్జిపై నుండి ఐచర్ వాహనం బోల్తా పడింది. ఆదిలాబాద్ పాసింగ్‌తో గల ఆ వాహనం నిర్మల్ వైపు నుండి హైదరాబాద్ వైపు వెళుతుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఇద్దరు మరణించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాహనం పూర్తిగా పెద్దకాలువలో పడిపోవటంతో అందులో ఎంతమంది ఉన్నారనేది తెలియరావడంలేదు. బాల్కొండ, ముప్కాల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జాతీయ రహదారి సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఐచర్ వాహనాన్ని బయటకు తీసే వరకు పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

## దహిగూడ ఇక 'రాజర్షిషా గూడ'

### కలెక్టర్‌కు గిరిజనుల కృతజ్ఞత



ప్రజాపక్షం/ మావల: నిరుపేద కొలాం గిరిజనులకు ఇళ్ల పట్టాలతో పాటు ఇందరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలను నిజం చేసిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాపై గిరిజనులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం పిప్పల్‌ధరి పంచాయతీ పరిధిలోని దహిగూడ కొలాం గూడేనికి 'రాజర్షిషాగూడ'గా నామకరణం చేసుకున్నారు. గురువారం ఈ గ్రామంలో పర్యటించిన కలెక్టర్, నిర్మాణం పూర్తయిన మూడు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గృహ ప్రవేశ వేడుకలను స్వయంగా ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ.. పిప్పల్‌ధరి పంచాయతీ పరిధిలో మరో 10 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి మేకలు, పాడి పశువుల యూనిట్లు, మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల శిక్షణ, చదువుకున్న యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. విద్యుత్, సెల్ నెట్‌వర్క్, రవాణా, ఆధార్ నమోదు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డీఓ రవీందర్ రాథోడ్, హౌసింగ్ పీడీ శంకర్, తహశీల్దార్ గోవింద్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలికను ప్రేమ పేరుతో వేధించిన నిందితుడికి జైలు శిక్ష

### ఎస్‌పి డివి. శ్రీనివాస రావు



ప్రజాపక్షం/వెల్దుర్తి: పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించాలంటూ వెంటపడి వేధింపులకు గురిచేసిన నిందితుడికి జిల్లా ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్‌పి డి. వి. శ్రీనివాస రావు తెలిపారు. నరేష్ (27) అనే వ్యక్తి పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించాలంటూ వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు వెల్దుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెల్దుర్తి ఎస్ఐ మధుసూదన్ గౌడ్ జులై 2022లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో సమర్పించారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించగా, లీగల్ అడ్వైజర్ శ్వేత బాధిత బాలిక సాక్ష్యం చెప్పడంలో సహకరించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను, ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు నరేష్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన్నట్లు జిల్లా ఎస్‌పి తెలిపారు. ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ ప్రవీణ్ సహకరించారని ఎస్‌పి తెలిపారు. బాలికలు, మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వేధింపులపై వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య

### అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య



ప్రజాపక్షం / కన్నెపల్లి/ బెల్లంపల్లి : ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందించాలని అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య సూచించారు. గురువారం ఆయన బెల్లంపల్లి, కన్నెపల్లి కస్తూర్బా విద్యాలయం, నందులపల్లి గ్రామ పంచాయతీలతో పాటు తహసిల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలను సందర్శించి పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. బెల్లంపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించి పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. కన్నెపల్లి జడ్‌పిహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయురాలు రమాదేవి బాల్య మిత్రురాలు ఎంటి. రాజేశ్వరి సమకూర్చిన రూ. 1.80 లక్షల విలువైన సైకిళ్లు, కుట్టుమిషన్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సతీష్, శ్రీనివాస్, పి.మహేశ్వర రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు పాల్గొన్నారు.

## స్కూల్ యూనిఫారాల పంపిణీ



ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ : ఖానాపూర్ మండలం మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవసరమైన ప్రభుత్వ స్కూల్ యూనిఫారాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. యూనిఫారాలను గ్రామ సర్పంచ్ దొనికేని లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల చదువు కోసం అనేక సౌకర్యాలను కల్పిస్తోందని, విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకోవాలని అన్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యాల కోసం గ్రామ పంచాయతీ పూర్తి సహకారం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.ఉపసర్పంచ్ దొనికేని వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందంపాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలి

### ఎమ్మెల్యే గడ్డం వినోద్



ప్రజాపక్షం/బెల్లంపల్లి : బెల్లంపల్లి పట్టణంలో చేపట్టనున్న రోడ్ల విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్ల విస్తరణతో పాటు సింగరేణి పరిధిలో విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్ పనులను ఆయా శాఖల సమన్వయం తో పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. స మావేశంలో సింగరేణి జిఎం రాధాకృష్ణ, మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్ బాబు, కమిషనర్ తన్నీరు రమేష్, ఎసిపి కిరణ్ కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరు మృతి



ప్రజాపక్షం/ముప్కాల్ : మెండోరా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడిచెర్లకు చెందిన మెట్టు కైలాస్ (51) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ సుహాసిని గురువారం తెలిపారు. బుధవారం ఇంటిపై శుభ్రం చేసే క్రమంలో ఇంట్లో దూలాలపై ఉన్న ఓ ఇనుప రేకుకు తెగి ఉన్న విద్యుత్ తీగ తగలటంతో ఆ ఇనుప రేకును ముట్టుకున్న కైలాస్‌కు ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగిలి కింద పడటంతో గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నిర్మల్ ఆస్పత్రికి తరలించగా హాస్పిటల్ చేరుకోగానే కైలాస్ మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ




ప్రజాపక్షం/బెల్లంపల్లి : బిజెపి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోకుండా ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ విమర్శించారు. జాతీయ సమితి పిలుపుమేరకు చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం బెల్లంపల్లి పట్టణంలోని పలు బస్తీల్లో పట్టణ కార్యదర్శి రాజమౌళి ఆధ్వర్యంలో రెండో రోజు ప్రజా యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ, విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. పేపర్ లీకేజీలను ప్రశ్నించిన యువతపై దమనకాండ జరపడం సరికాదన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, సమస్యలపై ప్రజలను చైతన్యం చేస్తూ పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దాగం మలేష్, అక్కపెల్లి బాబు, బొంతల లక్ష్మి నారాయణ, కొండు బానేష్, గుండా చంద్రమాణిక్యం, బొల్లం తిలకం, రత్నం రాజ్యం, తిరుపతి గౌడ్, వడ్డేమల్ల రాజేందర్, బండారి శంకర్, కామెర దుర్గయ్య, ఉప్పుల శంకర్, రాజేందర్, స్వామి దాసు, నర్సింగ్ పాల్గొన్నా రు.

## అదనపు తరగతి గదులు ప్రారంభం



ప్రజాపక్షం/భైంసా : కుభీర్ మండలంలోని న్యూ సాంవ్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యా వసతులు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు.పాఠశాలకు ప్రహరీ గోడ అవసరాన్ని గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, తక్షణమే ప్రహరీ గోడను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.అలాగే న్యూ సాంవ్లి గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, గ్రామంలో విఒ భవనం, గోదాం, సిసి రోడ్లు ,డ్రైన్లు తదితర పలు అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు,మండల సీనియర్ నాయకులు,అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్ కె.హరిత



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకల కోసం వేదిక అలంకరణతో పాటు ప్రముఖులు, మీడియా, అధికారులు, ప్రజల గ్యాలరీలలో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. షామియానాలు, కుర్చీలు, సౌండ్ సిస్టమ్, స్టాళ్ల ఏర్పాటు, విద్యార్థుల నృత్య ప్రదర్శన స్థలాన్ని చదును చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని చెప్పారు. అంతకుముందు మైదానానికి చేరుకున్న కలెక్టర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు నదీమ్, సురేష్, సిద్దిక్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

### ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, దేశం, ధర్మం కోసం యువత తమ సమయాన్ని కేటాయించాలని బిజెఎల్‌పి నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన తిరంగా ర్యాలీ ఉత్సాహభరితంగా సాగింది. పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువకులు, దేశభక్తులు, బిజెపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తిని చాటారు. 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలతో నిర్మల్ పట్టణం మార్మోగింది. స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, అంబేద్కర్ చౌక్, పాత బస్టాండ్ మీదుగా వివేక్ చౌక్ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బిజెపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ర్యాలీలో యువత చూపిన ఉత్సాహం చూస్తుంటే భారతదేశం ప్రపంచంలోనే విశ్వగురుగా అవతరించే దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. దేశభక్తి భావన ప్రతి ఒక్కరిలో మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. యువత చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించి యువతతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, బిజెపి నాయకులు రావుల రాంనాథ్, భూమయ్య, స్రవంతి రెడ్డి, తక్కల రమణ రెడ్డి, కరిపే విలాస్, మెడిసెమ్మ రాజు, రాజేశ్వర్ రెడ్డి, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు, పట్టణ బిజెపి కౌన్సిలర్లు, విద్యార్థులు, బిజెపి నాయకులు కార్యకర్తలు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా చెత్త సేకరణ పర్యవేక్షణ

### కలెక్టర్ భవేష్ మిశ్రా



ప్రజాపక్షం/నిజామాబాద్ : ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను ఆదేశించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ గురువారం సందర్శించారు. నగరపాలక సంస్థ పరిధిలో రోజువారిగా ఇంటింటికి తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిల్వ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారిగా వేరు చేస్తూ, ఎరువులు,ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు ఎరువును ఎవరికి అందజేస్తున్నారు. తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభమవుతుందన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మేరకు వేస్టేజ్ ప్రాసెసింగ్ యంత్రాలతో శుద్ధి ప్రక్రియ జరిపించాలన్నారు. కాగా నగరంలో ప్రధాన మార్గాలలో రహదారులపై ఎక్కడబడితే అక్కడ ఆవులు, ఇతర పశువులు సంచరిస్తుండటంతో ప్రజలు, ప్రత్యేకించి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే ప్రమాదముందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ ఇతర అధికారులున్నారు.

## రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి

### రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా కేంద్రీకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. గురువారం మంచిర్యాల జోన్ పరిధిలోని శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు విభాగాలను, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. 5 ఎస్ విధానాన్ని అమలు చేస్తూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సిసిటిఎన్ఎస్ లో వివరాల నమోదు, వాహనాలు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. నేరాలకు పాల్పడే వారిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. సిబ్బందికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

## జిల్లాలో ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

### కలెక్టర్ ప్రతిమా సింగ్



ప్రజాపక్షం/మెదక్ : రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుండి జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు. జిల్లాలోని పంటల వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారని అన్నారు.ఇలాంటి పరిస్థితులపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లోని గ్రామ సర్పంచ్‌లకు, రైతులకు ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, విస్తరణ అధికారుల పాల్గొన్నారు.

### జనాభా లెక్కలతోనే సరైన అభివృద్ధి

జనగణన 2027 సన్నాహకాల్లో భాగంగా జిల్లా జనాభా లెక్కల హ్యాండ్ బుక్ అత్యంత ప్రామాణికమైనదని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఆర్‌డిఒలు, తాహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో జిల్లా జనాభా లెక్కల హ్యాండ్ బుక్ తయారీపై గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధమైన భవిష్యత్తు అభివృద్ధికి జనాభా లెక్కలు దోహదం చేస్తాయన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి రంగం సమగ్ర సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల వారీగా జనాభా వివరాలు నమోదు చేయడం. మౌలిక వసతులు, విద్య, వైద్యం పౌర సౌకర్యాల సమాచారం సేకరించడం. డిజిటల్ యాప్‌లు లేదా వెబ్ పోర్టల్స్ ద్వారా ఖచ్చితమైన డేటాను క్రోడీకరించడం. రెవెన్యూ గ్రామాల స్థాయిలో అధికారుల ద్వారా పర్యవేక్షణ జరపడం చేయాలన్నారు. ఈ గూగుల్ మీట్ సమావేశంలో డిఆర్‌ఓ అంబాదాస్ రాజేశ్వర్,ఆర్డీఓలు, రమాదేవి, రామకృష్ణ, బవయ్య, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి

### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు




ప్రజాపక్షం/సిర్పూర్ (టి) : వెంకట్రావుపేట అంతరాష్ట్ర వంతెన నుంచి నవేగాం ఆర్ అండ్ బి రోడ్డు వరకు నూతన బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. గురువారం సిర్పూర్ (టి) మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బైపాస్ రోడ్డు పూర్తయితే సిర్పూర్ పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలు తగ్గుతాయని, నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపిఒ వినోద్, స్పెషల్ ఆఫీసర్ ధర్మేందర్, మండల వ్యవసాయ అధికారి గిరీష్, అటవీ శాఖాధికారి శ్రీనివాస్, సర్పంచ్ నాగమణి, అధికారులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో 'టైగర్ టాస్క్‌ఫోర్స్' మెరుపు దాడులు

### దొంగల ముఠా గుట్టురట్టు!



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా నిర్మల్ పోలీసులు చెమటోడుస్తున్నారు. రాత్రి పెట్రోలింగ్‌ను తీవ్రత రం చేసిన పోలీసులు, ఇళ్లలో చోరీలకు యత్నిస్తున్న దొంగల ముఠాపై టైగర్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో మెరుపు దాడులు నిర్వహించి పలువురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని బర్కత్‌పురా ప్రాంతంలో దుండగులు ఒక ఇంటి తలుపులు, బీరువా పగులగొట్టి చోరీకి యత్నించినట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించారు. డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించాయి.అనుమానాస్పదంగా తిరుగుతున్న వా రిపై దృష్టి సారించి ముగ్గురి ప్ర మేయం ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. వీరిలో ఒక నిందితుడు నేరాన్ని అంగీకరించగా, అతని వద్ద నుండి ఒక బంగారు ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాగులవాడ ప్రాంతంలో ఓ ఇంటిలో చోరీకి పాల్పడుతున్నాడని స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు క్షణాల్లో అక్కడికి చేరుకున్నారు. యానాం ప్రాంతానికి చెందిన 32 ఏళ్ల వ్యక్తిని పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ప్రజల భద్రత కోసం రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను మరింత కట్టుదిట్టం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అపరిచిత వ్యక్తులు లేదా అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సకాలంలో స్పందించి నిందితులను పట్టుకోవడంలో చురుకుగా వ్యవహరించిన నిర్మల్ టైగర్ టాస్క్‌ఫోర్స్ మరియు పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే పోలీసులకు సమయానుకూలంగా సమాచారం అం దించి సహకరించిన స్థానిక ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

# పకడ్బందీగా చేయూత పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియ

## కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : చేయూత పింఛన్ల కోసం జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. చేయూత పెన్షన్ల కోసం వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు(తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా) గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు మొత్తం ఏడు రకాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, చేయూత పెన్షన్ల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడు రకాల పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జిల్లాలో మొదలుపెట్టామని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో సంబంధిత అధికారులు సిబ్బంది దరఖాస్తులు స్వీకరిస్తున్నారని వివరించారు. ప్రతి దరఖాస్తుతో పాటుగా ఆధార్ కార్డ్, వయసు ధ్రువీకరణ (ఓటర్ కార్డు/జనన ధ్రువీకరణ పత్రము/విద్యాభ్యాసం ధ్రువీకరణ పత్రం) రేషన్ కార్డ్, తహసీల్దార్ జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్ బుక్ జత చేయాలని సూచించారు. వితంతు మహిళలు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళలు గ్రామాల్లో 30 ఏండ్ల వయసు, పట్టణాల్లో 35 ఏండ్ల వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని, వీరికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి, వార్డు అధికారులు ధృవీకరణ చేయాలని, గీత కార్మికులు 50 ఏండ్ల వయసు ఉండాలని, ఎక్సైజ్ శాఖ అధికారుల ధ్రువీకరణ పత్రంతో పాటు, గీత కార్మికుల సొసైటీలో సభ్యులుగా ఉండాలని స్పష్టం చేశారు. నేత కార్మికులు 50 ఏండ్ల వయసు ఉండాలని, హ్యాండ్లూమ్ టెక్స్టైల్ శాఖ వారి గుర్తింపు పత్రం ఉండాలని తెలిపారు. ఫైలేరియా బాధితులు వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డయాలసిస్ బాధితులు ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్న వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దివ్యాంగులకు సదరం శిబిరం ద్వారా మంజూరు అయిన 40 శాతం వైకల్య ధ్రువీకరణ యూడీఐడీ పత్రం, చెవిటి వారికి 51 శాతం వైకల్య ధ్రువీకరణ యూ డీ ఐ డీ పత్రం ఉండాలని సూచించారు. తల సేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులు కూడా యూడీఐడీ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు జాగ్రత్తగా నింపాలని, కావాల్సిన పత్రాలను



జత చేసి ఆన్లైన్ కూడా పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు తమ అప్లికేషన్ కు కావలసిన అన్ని పత్రాలను కచ్చితంగా జత చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

### ప్రత్యేక సదరం శిబిరాలు నిర్వహించాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగులు, తలసేమియా, సికిల్ సెల్, హిమోఫోలియా కోసం ప్రత్యేక సదరం వైకల్య నిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఈ మేరకు బాధితులకు సమాచారం అందించాలని ఆదేశించారు. సదరం సర్టిఫికెట్లు జారీ వేగంగా చేయాలని స్పష్టం చేశారు. జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం,మున్సిపల్ కమిషనర్ లోకేష్, జీజీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## పేదలకు అండగా నిలువడమే లక్ష్యం

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/ఎండపల్లి : పేద కుటుంబాలకు అండగా నిలవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.వెల్గటూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని 80 మంది లబ్ధిదారులకు రూ.25.56 లక్షల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.అనారోగ్యం,వైద్య చికిత్స తదితర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు.ప్రజలకు అవసరమైన సమయంలో ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం,పేద కుటుంబాల ఆర్థిక భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ప్రజాప్రతినిధులు,అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారులు, పాల్గొన్నారు.

## మహాసభల కరపత్రం ఆవిష్కరణ



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మున్సిపల్ ,మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా మహాసభల కరపత్రం పెద్దపల్లి గోదాం ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను హక్కులను కాలరాచివేస్తే చూస్తూ ఊరుకునే స్థితిలో కార్మిక వర్గం శ్రామిక లోకం లేదన్నారు.ఉద్యమాలు ఉధృతం చేసి సమరశీల పోరాటాలు చేసి పోరాడి సాధించుకున్న హక్కులు చట్టాలను కాపాడుకుంటామని కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. 44 లేబర్ కోడ్లను యధావిధిగా కొనసాగించాలని, సుల్తానాబాద్ లో ఆగస్టు 20 రోజున జరిగే జిల్లా ఏఐటీయూసీ నాలుగవ మహాసభ లో చర్చించడం జరుగుతుందని మహాసభకు కార్మిక వర్గం శ్రామిక లోకం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పెద్దపెల్లి సివిల్ సప్లై అధ్యక్షులు ఎం కుమార్ ,జిల్లా ఉపాధ్యక్షులు కడారి తిరుపతి ,మున్సిపల్ కార్యదర్శి బి పోషమల్లు ,నాయకులు మహేష్ కె, నరేష్, కే శ్రీనివాస్, బి శ్రీనివాస్ ,డి సతీష్, డి.ఓదెలు ,తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించాలి

### అదనపు కలెక్టర్ శ్రీరాములు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పెద్దపల్లి జిల్లాలో వైభవంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి శ్రీరాములు తెలిపారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో చేస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఏర్పాట్లను డిసిపి రామ్ రెడ్డితో కలిసి పరిశీలించారు.ఆగస్టు 15 న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు ముఖ్య అతిథిగా హాజరు అవుతారని అన్నారు.స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందిగా పూర్తి చేయాలని అన్నారు.పెరేడ్ నిర్వహణ సంబంధించి చేస్తున్న రిహార్సల్స్ను అదనపు కలెక్టర్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్ సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/రాయికల్ : రాయికల్ పట్టణ మరియు మండలానికి చెందిన 57 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 18 లక్షల 60 వేల రూపాయల విలువ గల చెక్కులను గురువారం పట్టణంలోని గుడేటి రెడ్డి సంఘంలో లబ్ధిదారులకు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అందజేశారు.రాయికల్ పట్టణ మండల ప్రజాప్రతినిధులు,నాయకులు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

### కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పి అశోక్ కుమార్

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు.గురువారం జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ లోని ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్,ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు. జగిత్యాల జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్లో ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించిన వేదిక నిర్మాణం,పతాకావిష్కరణ స్థలం,సాంస్కృతిక కార్యక్రమాల ప్రాంగణం, స్టాల్స్,పార్కింగ్, భద్రతా చర్యలు వంటి అంశాలను ప్రత్యక్షంగా సమీక్షించారు.జిల్లావ్యాప్తంగా జరిగే కార్యక్రమాలకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు.రెవెన్యూ, పోలీస్ ,డి ఆర్ డి ఓ , మున్సిపల్ సంబంధిత అధికారులతో సమన్వయం పెంచుతూ భద్రతా బందోబస్తును,ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని సూచించారు.ఆహ్వానితులకు,విద్యార్థులకు, ప్రజలకు అవసరమైన నీటి సదుపాయాలు, వైద్య సిబ్బంది,శానిటేషన్ వ్యవస్థలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు.పతాకావిష్కరణ అనంతరం జరిగే అట్టహాసపూరిత పరేడ్,శకటాలు,సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు.విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని సూచించారు.ప్రభుత్వ గౌరవాన్ని నిలబెట్టేలా అన్ని ఏర్పాట్లు నాణ్యతతో చేయాలని అన్నారు.

## 12వ ప్యాకేజీ ఉప కాలువ నిర్మాణం చేపట్టాలి

### సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని అచ్చమయ్య పల్లె గుండ కెనాల్ కట్ట నిర్మాణం మధ్యలోనే ఆపారని అక్కడి నుంచి ముత్యాల వరకు ముత్యాల లోని చెరువులు నిండుకొని గంభీరావుపేట మండలంలో వివిధ గ్రామాలకు సంబంధించి పదివేల ఎకరాలకు సాగునీరు అందించే 12వ ప్యాకేజీ ఉప కాలువను వెంటనే నిర్మాణం చేయాలని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. గురువారం చిప్పలపల్లి రైతులతో కలిసి కాలువను సందర్శించారు.ముచ్చర్ల కాలువల ద్వారా చిప్పలపల్లి చెరువులు కుంటలు నిండుతూ 6 నుంచి 700 ఎకరాలకు నీరు అందించే విధంగా ఉపయోగపడుతుంది 12వ ప్యాకేజీ పనుల మూలంగా ముస్తాబాద్ మండలంలో వివిధ గ్రామాలలో పదివేల ఎకరాలకు ఈ ప్యాకేజ్ ద్వారా నీరు అందించే అవకాశం ఉందన్నారు.దీని మూలంగా భూగర్భ జలాలు పుష్కలంగా ఉండటంతో పాటు చెరువులు కుంటలు నిండి రైతులకు రెండు పంటలకు భూగర్భ జలాలు పుష్కలంగా అందుతాయి అన్నారు. రామచంద్రం, బాలరాజు నరేందర్లు ఉన్నారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా విద్యాబోధన

### కలెక్టర్ చిత్రా మిశ్రా సూచన



ప్రజాపక్షం/కరీంనగర్ : విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా విద్యా భోదన చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. కరీంనగర్ ముకరాంపురలోని ఓల్డ్ హైస్కూల్ క్యాంపస్లో ఉన్న ఇంటిగ్రెటెడ్ బాలుర హాస్టల్ను కలెక్టర్ గురువారం పరిశీలించారు. అంతకుముందు డాక్టర్ స్ట్రీట్లోని అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్ను ఆమె సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అర్బన్ రెసిడెన్సియల్ స్కూల్లో లీకేజీలు, కెచెన్ షెడ్డు, తాగునీరు, టాయిలెట్స్ తదితర మౌళిక వసతులకు సంబంధించిన సమస్యలను గుర్తించిన కలెక్టర్ వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన మౌళిక వసతులను మెరుగుపరిచి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు. మరమ్మత్తు పనులు పూర్తయ్యేవరకు అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులను ముకరాంపురలోని ఓల్డ్ హైస్కూల్ క్యాంపస్లో ఉన్న ఇంటిగ్రెటెడ్ హాస్టల్కు తరలించి అక్కడే హాస్టల్ వసతితోపాటు తరగతుల నిర్వహిణ విద్యాబోధన కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ఈ మేరకు ఇంటిగ్రెటెడ్ హాస్టల్ను పరిశీలించిన కలెక్టర్ చిత్రా మిశ్రా విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా వసతి, భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కొద్దిరోజులపాటు విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటూ తరగతులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్లో మరమ్మత్తు పనులు పూర్తయిన వెంటనే విద్యార్థులను తిరిగి అక్కడికి తరలించాలని అధికారులకు ఆదేశించారు. విద్యకు ఏలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.క్ష విద్యా శాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్ తోపాటు పలువురు అధికారులు ఉన్నారు.

## గర్షకుర్తి మండలం ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం/గంగాధర : గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు గర్షకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కట్టుబడి ఉన్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కోన్నారు. గురువారం గర్షకుర్తి గ్రామస్తులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గంగాధర ప్రజా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గర్షకుర్తిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గంలోని గర్షకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని దశాబ్దకాలంగా గ్రామస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో తీర్మాణం చేసిన సమయంలో తప్పకుండా గర్షకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానన్నారు. గర్షకుర్తి గ్రామాన్ని చేనేతహబ్గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావును గర్షకుర్తికి ఆహ్వానించి ఇక్కడి చేనేత కార్మికులకు మరింత ఆర్థిక చేయూతనివ్వడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంత్రి మహేందర్, గ్రామ సర్పంచ్ చిందం ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజేశం, చిప్ప చక్రపాణి, రాజమౌళి, అన్నాల్దాస్ శ్రీనివాస్, కొలిపాక రాజు, మల్లిఖార్జున్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామీణ స్థాయిలో క్యాథలాబ్ కార్పొరేట్ వైద్యం

### 40 మందికి స్టంట్స్ వేసి ప్రాణాలను రక్షించాం

ప్రజా పక్షం/ఎల్లారెడ్డిపేట : గ్రామంలో క్యాథలాబ్ ఏర్పాటు చేసి కార్పొరేట్ వైద్యం అందిస్తున్న డాక్టర్ సత్యనారాయణ స్వామికి గురువారం అభినందనలు తెలుపుతూ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి వచ్చిన సందర్భంగా అశ్విని హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న ఉద్యమకారుడు అందే సుభాష్ ను, ఇటీవల మాజీ జెడ్పిటిసి జీడి లక్ష్మణరావు తల్లి పరమపదించగా ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. హాస్పిటల్ లో ఉన్న విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు.తెలంగాణ గ్రామపంచాయతీలో కార్పోరేట్ దీటుగా సకల సౌకర్యాలతో పెద్ద హాస్పిటల్ నిర్మించి సుమారు 45 సంవత్సరాల నుండి సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. గుండెపోటు వచ్చి హాస్పిటల్లో చేరితే వెంటనే చికిత్స అందించి స్టంట్ వేయడం జరుగుతుందని అన్నారు. 12 మంది స్పెషలిస్టు డాక్టర్లను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంచడం జరిగిందని సుమారు 40 మందికి చికిత్సను అందించడం జరిగిందని చెప్పారు.బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, సింగిల్ విండో అధ్యక్షులు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వర్సకృష్ణ హరి, సర్పంచ్ ఎలగందుల నర్సింలు, ఉప సర్పంచ్ బంధారపు బాల్ రెడ్డి, నాయకులు పిల్లి కిషన్, జబ్బర్, నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి,ఎడ్ల సందీప్, మురళి గౌడ్ ఉన్నారు.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలను నివారించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో డ్రైవర్లు, పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయరాదని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని తెలిపారు.అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ పృధ్వీరాజ్ వర్మ, సీఐ ఓ వెంకటేష్, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు మనోహరచారి, స్థానిక సర్పంచ్ ఎనగందుల నర్సింహులు, బస్సు డ్రైవర్లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులతో మారనున్న ధర్మపురి రూపురేఖలు

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/ధర్మపురి : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నా మని ధర్మపురి క్షేత్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో ధర్మపురి రూపురేఖలు మారనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.గురువారం ధర్మపురి 15వ వార్డులో అంబేద్కర్ భవన నిర్మాణ పనులను మంత్రి అడ్లూరి ప్రారంభించారు.మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ధర్మపురి పట్టణంలోని వివిధ కుల సంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. అంబేద్కర్ భవన నిర్మాణం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఇందులో భాగంగా గ్రౌండ్ ఫ్లోర్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామని తెలిపారు.మరో రెండు అంతస్తులు విద్యార్థుల చదువుకు కావలసిన ఏర్పాట్లు చేస్తామని మంత్రి వివరించారు. ధర్మపురి క్షేత్రం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రూ.117 కోట్లు కేటాయించగా ఇందులో ధర్మపురిలో రూ. 37 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మంత్రి వివరించారు.వీటితోపాటు టి యు ఎఫ్ ఐడిసి నిధులు రూ. 15 కోట్లతో పాటు అమృత పథకం ద్వారా నిధులు సాధించి ధర్మపురిలో అభివృద్ధి పనులు కొనసాగిస్తామని మంత్రి వివరించారు. ధర్మపురి క్షేత్రంలో అనేక అభివృద్ధి జరిగి ధర్మపురి రూపురేఖలు మారనున్నట్లు మంత్రి అడ్లూరి వివరించారు.మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి ,మున్సిపల్ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### డిఎస్పి శ్రీనివాసులు



ప్రజాపక్షం/చందుర్తి : సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేములవాడ డిఎస్పి శ్రీనివాసులు పేర్కొన్నారు.చందుర్తి మండల కేంద్రం లోని సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లా మోతే మండలానికి చెందిన కిలుకాని సాయిచంద్ (30), సూర్యపేట జిల్లా శాంతినగర్ కు చెందిన కట్కూరి శరత్ కుమార్(31) అను ఇద్దరు వ్యక్తులు సోషల్ మీడియా ద్వార మీసేవా కేంద్రాలు , మనీ ట్రాన్స్ఫర్ కేంద్రాల వివరాలు తెలుకొనిమోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి మీ సేవా కేంద్రం నిర్వహకుడికి గత జూన్ నెలలో ఫోన్ చేసి తాను చందుర్తి పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ రెడ్డి ని అని , తనకు అత్యవసరంగా రూ. 70,000 ఫోన్ పే ద్వారా కావాలని , కానిస్టేబుల్ ద్వార అంత మొత్తం నగదు పంపిస్తానని నమ్మబలకడం తో సదరు మీ సేవా కేంద్రం నిర్వహకుడు మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపిపి చిలుక పెంటయ్య ద్వార నిందితులు పంపిన స్కానర్ కి డబ్బులు ఫోన్ పే ద్వారా పంపించాడు.అనంతరం వారి ఫోన్ స్విచ్ ఆఫ్ రావడం తో మోస పోయామని గ్రహించిన వారు చందుర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.చందుర్తి సీఐ రవీందర్,ఎస్ఐ రమేష్,సైబర్ సెల్ ఆర్ఎస్ఐ జునైద్ తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను హైదరాబాద్ లో బుధవారం అదుపులోకి తీసుకున్నామన్నారు.విచారణలో నిందితులపై రెండు తెలుగు రాష్ట్రాలలో 28 కేసులు ఉన్నాయని, అందులో తెలంగాణలో 20 కాగా ఆంధ్రప్రదేశ్లో 8 కేసులలో రూ. 15 లక్షల వరకు మోసాలకు పాల్పడ్డారని తెలిపారు.నిందితుల వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లు , సిమ్ కార్డులు, రూ.18,000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.సైబర్ సెల్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది అనిల్ , గంగారెడ్డి లను డిఎస్పి శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు.

## విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి

### లయన్స్క్లబ్ జిల్లా చైర్మన్ వినోద్మోదాని

ప్రజాపక్షం/ సిద్దిపేట : విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ముఖ్యమని సిద్దిపేట లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్, ఎస్పిఎల్ వ్యవస్థాపకుడు వినోద్మోదాని అన్నారు. విద్యార్థుల్లో శరీర ధారుడ్యాన్ని పెంపొదించేందుకు క్రీడలు దోహదం చేస్తామన్నారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ,ఏకగ్రత పెంచుతుందన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా ధర్మాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వాలీబాల్స్, నెట్స్, టెన్నికాయిట్ క్రీడవస్తువులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వినోద్ మోదాని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అవసరమైన క్రీడ సదుపాయాలను అందించటం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో సైతం ధర్మాజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమవంతూ సహాకారం అందిస్తామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. రవీందర్రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడస్ఫూర్తిని పెంపోందించేందుకు ఈలాంటి సేవా కార్యాక్రమాలు ఏంతో దోహదం చేస్తాయన్నారు. పాఠశాల క్రీడ సామాగ్రిని అందచేసిన ఎస్పిఎల్ వ్యవస్థాపకుడు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ వినోద్మోదాని బృందాన్ని అభినందించారు. ఈకార్యక్రమంలో ఎస్పిఎల్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు బిఎల్ శ్రీనివాస్,ఆకుల పాండురంగం, పొద్దుటూరి సిద్దులు,రాజబహదూర్రెడ్డి, గ్యాదరి కుమార్, ఉపాధ్యాయులు సాదత్అలీ, నవీన్కుమార్ పాల్గొన్నారు.



## కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఏరియా స్టోర్స్ కార్మికులను కలిసిన ఎఐటియుసి నూతన బ్రాంచ్ కార్యదర్శి గట్టయ్య

**ప్రజాపక్షం/చుంచుపల్లి :** కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎఐటియుసి కొత్తగూడెం ఏరియా నూతన బ్రాంచ్ కార్యదర్శి జె.గట్టయ్య అన్నారు. గురువరం ఏరియా స్టోర్స్‌ను సందర్శించి కార్మికులను కలిసిన ఆయనకు కార్మికులు ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్టోర్స్‌లో నెలకొన్న సమస్యలను గట్టయ్య అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా అవసరమైన మేరకు మ్యాన్‌పవర్‌ను పెంచాలని, ప్లే డేలు, పిహెచ్‌డిలు పెంచడంతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కార్మికులు కోరారు. అనంతరం ఏరియా స్టోర్స్ డిజిఎం మైనేని శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. స్టోర్స్‌లో పని పరిస్థితులు, సిబ్బంది కొరత, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో ఎఐటియుసి రాజీపడే ప్రసక్తే లేదని గట్టయ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ సందబోయిన శ్రీనివాస్, ఆర్‌సిహెచ్‌పి పిట్ కార్యదర్శి సురేందర్, ఏరియా స్టోర్స్ పిట్ కార్యదర్శి కమల్ (శ్రీనివాస్), ఎస్అండ్‌పిసి పిట్ కార్యదర్శి రాంబాబు, నాయకులు రాజాలపూడి సాంబమూర్తి, అవినాష వేముల నరేష్, లికిత్, సాగర్, సురేష్, రాజేష్, మెయిన్, గావిని నాగరాజు, పడాల కృష్ణ, డిఎల్ఆర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## పొలంలో పసికందు మృతదేహం కలకలం

దున్నుతుండగా రైతుకు కనిపించిన వైనం

పోలీసుల దర్యాప్తు

**ప్రజాపక్షం/కూసుమంచి :** కూసుమంచి మండల కేంద్రంలోని శివాలయం రోడ్డులో పంట పొలంలో పసికందు మృతదేహం కనిపించడం గురువారం కలకలం రేపింది. పొలం దున్నతుండగా రైతు మృతదేహాన్ని గుర్తించి స్థానికులకు, అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కూసుమంచి ఎస్ఐ దివ్యశ్రీ, వైద్యాధికారి డాక్టర్ సాయి కుమార్, వైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రాథమికంగా సుమారు ఐదు నుంచి ఆరు నెలల గర్భధారణ అనంతరం గర్భస్రావం జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు పసికందును పొలంలో వదిలి వెళ్లారా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయి అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లో వివరాలు సేకరిస్తూ, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునే పనిలో ఉన్నారు. వైద్య పరీక్షలు, దర్యాప్తు అనంతరం వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

## రెవెన్యూ అంశాలపై సబ్ కలెక్టర్ సమీక్ష

**ప్రజాపక్షం/పెనుబల్లి :** పెనుబల్లి తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ అధ్యక్షతన రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ స్లాట్ల పురోగతి, భూభారతిరెవెన్యూ సదస్సులకు సంబంధించిన దరఖాస్తులు, సదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ప్రజా ఫిర్యాదులు మరియు వాటిపై తీసుకున్న చర్యల నివేదికలు, మీ సేవా ద్వారా జారీ చేయాల్సిన ధ్రువపత్రాల పరిష్కారం తదితర అంశాలపై మండల స్థాయి అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ప్రతి అంశంలో పెండింగ్ ను తగ్గించి, నిర్ణీత గడువులో దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు వేగవంతంగా, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని, ఫిర్యాదులపై తక్షణ స్పందనతో చర్యలు తీసుకుని ఏటీఆర్ లను సమర్పించాలని సూచించారు. అలాగే భూభారతిరెవెన్యూ సదస్సులు, సదాబైనామా, రిజిస్ట్రేషన్ మరియు మీ సేవా దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సబ్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు కట్టుదిట్టం

నేర సమీక్షలో సిపి సునిల్‌దత్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ పోలీసు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక సిపి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల రవాణకు చెక్ పెట్టడంతో పాటు వాటి భారినపడిన వారిని సాధారణ జీవన స్థితికి తీసుకువచ్చే ప్రయత్నం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. దీనిపై పాఠశాలలు, కళాశాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాలను పిల్లలు అతిగా వాడటం వలన సైబర్ నేరగాళ్ల వలలో పడేఅవకాశం ఉందన్నారు. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, ఫెస్‌బుక్, గేమింగ్ యాప్‌ల వలన నేరగాళ్లు మైనర్లతో పరిచయం పెంచుకోని స్నేహం, ప్రేమ పేరుతో నమ్మించి లోబరుచుకుని లైంగిక వేదింపులకు పాల్పడుతున్నార న్నారు. వారి వ్యక్తిగత ఫోటోలు సేకరించుకుని వాటిని అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో ఫోక్స్ కేసులు ఎక్కువగా నమోదు అవటానికి ఇదే కారణమని తెలియజేశారు. పిల్లల భద్రత పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకునేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పనిచేస్తే వాహనాదారులకు హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వంటి రోడ్డు భద్రత చర్యలపై తెలియజేయాలన్నారు. అతివేగం, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా చోరీల్లో సొత్తు రికవరికీ అధునాతన సాంకేతికతో పాటు ప్రత్యేక బృందాలను ఉపయోగించుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో గస్తీ పెంచడం, సిసి కెమెరాల నిఘా, పాతనేరస్తుల కదలికలపై ప్రత్యేక దృష్టిసారించి దొంగతనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిసిపి భోజా రామానుజం, ఖమ్మం టౌన్ ఏసిపి సురద వెంకటరమణమూర్తి, రూరల్ ఏసిపి బిల్లా తిరపతిరెడ్డి, వైరా, కల్లూరు ఏసిపిలు సాధుల సారంగపాణి, వసుంధరా యాదవ్, నరసింహారావు, మహేష్, సాంబరాజు, సత్యనారాయణ, సర్వర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధులు

కార్పొరేషన్ అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌కు అర్హత సాధించిపెట్టా

డిపిఆర్ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తాం

అవినీతి అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవు

విలేకరుల సమావేశంలో కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా నిధులు వెచ్చించి పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఆయా పనులకు సంబంధించిన డిపిఆర్ తయారీ టెండర్లలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని కొత్తగూడెం శాసన సభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు.
కొత్తగూడెం క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిధులు మంజూరీ కానున్నాయని, పనుల అంచనాల ప్రకారమే గ్రాంట్లు రాష్ట్ర వాటా, బ్యాంకు రుణాల ద్వారా నిధులు సమీకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ పథకం క్రింద దేశవ్యాప్తంగా లక్షకోట్ల కేంద్ర సహాయంతో పాటు 25శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రం, 50శాతం బ్యాంకు రుణం ఉంటుందని ఇందులో భాగమైన 26 మున్సిపాలిటీల్లో ఖమ్మం కార్పొరేషన్‌కు రూ.2670 కోట్ల రుణం వస్తుండగా, కొత్తగూడెం కార్పొరేషన్‌కు రూ.600కోట్ల రుణం అడిగామని వివరించారు. అభివృద్ధి పనుల నిధులపై కాకుండా కేవలం వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక టెండర్‌కు సంబంధించి కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. రూ.600 కోట్ల అంచనా పనులకు 1.6 శాతం చొప్పున డిపిఆర్ టెండర్ ఒప్పందం కుదిరితే అందులో ఏకంగా రూ.9.60కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం వారి అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రంలో నల్గొండలో 1.6 శాతం, మహబూబ్‌నగర్‌లో రూ.1.000 కోట్ల పనులకు 1.5 శాతంతో ఇలాగే డిపిఆర్ ఒప్పందాలు కుదిరాయని గుర్తు చేశారు. ఇతర పట్టణాలు మున్సిపాలిటీల్లోనూ ఇదే విధానంలో టెండర్లు జారీ అయినప్పుడు లేని అవినీతి కేవలం కొత్తగూడెంలోనే ఎలా జరుగుతుందని, అక్కడ కూడా అవినీతి జరిగినట్లేనా అని నిలదీశారు. ఆరు నెలల పసిపిల్లల లాంటి కొత్తగూడెం కార్పొరేషన్‌ను పురిటిలోనే చంపాలని కుట్రలు చేస్తున్నారని, అసలు నిధులే విడుదల కాకుండా డిపిఆర్ ఫేజులో కోట్ల అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలన్నారు. కొందరు పనిగట్టుకుని ప్రజల్లో అపోహలు సృష్టించారని ప్రజల్లో ఉన్న సందేహాలు, అపోహలు నివృత్తి చేసేందుకు ఆఫ్‌లైన్ డిపిఆర్ విధానాన్ని రద్దు చేసి ఆన్‌లైన్ టెండర్లకు ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. డిపిఆర్ శాతాన్ని 0.5 శాతానికి లేదా మరింత తగ్గించే సామర్థ్యం ఉన్న వాళ్లు ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొనొచ్చని పేర్కొన్నారు. చుంచుపల్లి ఉమ్మడి పంచాయతీ 45 ఏళ్లుగా సిపిఐ ఆధీనంలోనే ఉందని, ప్రజాదరణ లేకుంటే తాము ఎన్నికల్లో గెలుస్తామా అని ప్రశ్నించారు. గతంలో ప్రపంచ బ్యాంకు రుణం (టిఎండిపి) విధానాన్ని వ్యతిరేకించిన విషయాన్ని కూనంనేని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజాప్రతినిధులు, ఎవరైనా అధికారులు తప్పులకు పాల్పడినా, పేదలను మోసం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అనవసరపు ఆరోపణలు చేస్తే వెంటాడుతామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సలిగంటి శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, నాయకులు యండి యూసఫ్, మునిగడప వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు మునిగడప పద్మ, బోయిన విజయ్ కుమార్, గద్దం శాంతిప్రియ, వీశంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర రావు, నామా కీర్తి, కూరపాటి సుధాకర్, బండి నర్సింహా, ధనలక్ష్మి, దుర్గయ్య, కళావతి, శ్యామల మంద నాగమణి, మద్దాల హరిత, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మల అరుదైన రికార్డు

21సార్లు స్వాతంత్ర్య వేడుకల్లో జెండా ఆవిష్కరణ

నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో అరుదైన రికార్డు ఒకటి ఇప్పుడు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేరిట లిఖితం కానుంది. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన అరుదైన రికార్డును సొంతం చేసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పుడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జెండాను ఆవిష్కరించి మరో రికార్డును సాధించనున్నారు. దేశ రాజకీయాల్లో పార్టీలు మారుతాయి, ప్రభుత్వాలు మారుతాయి. కానీ ఒక నేత పట్ల ప్రజల విశ్వాసం మాత్రం నాలుగు దశాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉందనడానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావువే నిదర్శనం. స్వాతంత్ర్య దినోత్సవం రోజున అధికారికంగా జాతీయ పతాకావిష్కరణ చేసే గౌరవం వరుసగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకే దక్కుతుంది. ఇప్పటి వరకు 20సార్లు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈనెల 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21వసారి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఇది అరుదైన ఘట్టం. 1985లో తొలిసారిగా ఎంఎల్ఎగా గెలిచిన తుమ్మల నాగేశ్వరరావు ఎన్‌టిఆర్ ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టారు. అప్పటి నుంచి నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఐదుసార్లు ఎంఎల్ఎగా, ఒకసారి ఎంఎల్‌సిగా పనిచేశారు. ఎన్‌టిఆర్, చంద్రబాబు, కెసిఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. మైనర్ ఇరిగేషన్, రోడ్లు, భవనాలు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, మేజర్, మైనర్ ఇరిగేషన్ వంటి కీలక శాఖలు నిర్వహించారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ, సహకార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నా ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేశారు.

## ఎఐఎస్ఎఫ్ జాతీయ వేదికపై భద్రాద్రి గళం

జిల్లా సహాయకార్యదర్శి వినయ్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉత్తర ప్రదేశ్ బారాబంకిలో జరిగిన ఏఐఎస్ఎఫ్ 91వ వార్షికోత్సలాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమం తొలూత భారీ ప్రదర్శనతో ప్రారంభం కాగా పాతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వినయ్ వేదికపై మాట్లాడుతూ తెలంగాణలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా విధానాలను విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ నిర్వహిసుస్తున్న పోరాటాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల మనస్సుల్లో మతతత్వ విభేదాలు నింపే విధానాలను అవలంభిస్తోందని వివరించారు. భద్రాద్రి జిల్లా నుండి యువ ప్రతినిధిగా జాతీయస్థాయి వేదికపై పాల్గొని ప్రసంగించడం అభనందనీయమని జిల్లా నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణలో ఆర్‌కెవివై అమలు ప్రశంసనీయం

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్

రెండవ విడత నిధులు విడుదల చేయండి

కేంద్ర మంత్రిని కోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవివై) అమలులో తెలంగాణ సాధించిన అద్భుతమైన పురోగతిని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ప్రశంసించారు. మూడు రాష్ట్రాల్లో కేంద్ర ప్రాయోజిక పథకాల పురోగతిని సమీక్షించేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ అధ్యక్షతన జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆర్‌కెవివై అమలుతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫార్మర్ ఫీల్డ్ స్కూల్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆర్‌కెవివై నిధులు రెండవ విడతను వీలైనంత త్వరగా మంజూరు చేసి విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నష్టాల నుంచి రైతులను రక్షించేందుకు వారి ఉత్పత్తులకు తగిన మద్దతు ధర లభించేలా చూడాలని, రైతులు పండించిన పప్పు ధాన్యాలను వంద శాతం సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కజొన్న, ఇతర పంటలకు సంబంధించి సేకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ రెండవ విడత నిధులను త్వరితగతిన విడుదల చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని, పప్పు ధాన్యాలను వంద శాతం సేకరించేందుకు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

# మార్పు కోసమే ప్రజాచైతన్య యాత్రలు

158 బహిరంగ సభలు దిగ్విజయంగా పూర్తి

460 గ్రామాలు బస్తీల మీదుగా యాత్ర

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బద్లావ్ జరూరీ హై నినాదంతో ఆగస్టు 6 నుండి వారం రోజుల పాటు జిల్లాలో కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం నుండి అశ్వరావుపేట వరకు చేపట్టిన జన చైతన్యయాత్రలు జిల్లా వ్యాప్తంగా అత్యంత విజయవంతం అయ్యాయని జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తెలిపారు. గురువారం శేషగిరి భవన్లో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 23 మండలాల పరిధిలో 12వ తేది వరకు ప్రచార యాత్రలు ఉత్సాహ భరిత వాతావరణంలో సాగాయని ఆయన పేర్కొన్నారు. ఈయాత్రలో భాగంగా వివిధ గ్రామాలు, మండల కేంద్రాల్లో 158 బహిరంగ సభలను నిర్వహించినట్లు తెలిపారు.
460 గ్రామాలు బస్తీలు మీదుగా పాదయాత్రలు ప్రచార కార్యక్రమాలు కొనగాయాని వెల్లడించారు. వందమంది పార్టీ నాయకులు ప్రజా సంమఘాల నాయకులు యాత్రలో బృందంగా పాల్గొని జయప్రథం చేశారన్నారు. ఈ యాత్ర ద్వారా సుమారు 3 లక్ష మందిని ప్రజలను నేరుగా కలిసి యాత్ర ముఖ్య ఉద్దేశ్యాలను ప్రజా సమస్యలపై పార్టీ పోరాట పంథాను వివరించినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక కార్పోరేట్ అనుకూల విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. దేశంలో పెరుగుతున్న ధరలు నిరుద్యోగం రాజ్యాంగ బద్ద సంస్థల నిర్వీర్యం వంటి చర్యలకు నిరసనగా ప్రజలను చైతన్య వంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.
ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు ప్రజల హక్కుల సాధనకు నిరంతరం ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈయాత్ర స్ఫూర్తితో సెప్టెంబర్ 1న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో జరిగే జాతీయస్థాయి ధర్నా బహిరంగ సభకు ప్రతీ ఒక్కరూ తరలిరావాలని స్పష్టం చేశారు.

## మోర పద్మ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి సంభాని



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన మోర పద్మ కుటుంబాన్ని గురువారం రాష్ట్ర మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పరామర్శించారు. మండల కేంద్రంకు చెందిన మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోర మల్లయ్య సతీమణి పద్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకుని ఆమె నివాసంకు వెళ్లి చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి ని తెలియజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు. చెరువుమాధారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, నల్లాని మల్లిఖార్జునరావు, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎరువు బరువు





అమాంతంగా ధరలకు రెక్కలు

యూరియా బస్తా రూ.600, ఇతర ఎరువులు 3వేల పైనే

ప్రస్తుతానికి జిల్లాలో 4.35 లక్షల ఎకరాల్లోనే ముందుకు సాగని సాగు

వర్షాలు లేక అవస్థలు

**వాతావరణ మార్పుల,కొనసాగుతున్న ఎల్‌నినో ప్రభావం రైతన్నలను రందిలో పడేసింది. 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డ' చందంగా ఎరువులు, పురుగు మందుల ధరలకు అమాంతంగా రెక్కలు వచ్చాయి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ ఇబ్బడి ముబ్బడిగా దోచుకొంటున్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలకు యూరియా సాగుచేయాల్సిన పంటలకు డిఎపి కాంప్లెక్స్ ఎరువుల అవసరముంది. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు ఎంఆర్‌పి కంటే రెట్టింపు ధరలకు విక్రయాలు సాగిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నారు. ఈ ఏడాది వానా కాలంలో 6,37,800 ఎకరాల సాగు అంచనాలు చేయగా ప్రస్తుతం 435210 ఎకారాల్లో మాత్రం సాగుతోంది. ఇంకా 2,02,590 ఎకరాల్లో సాగు ముందుకు సాగట్లేదు.**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతుండటంతో ఇప్పటి వరకు సగం సాగు కూడా ముందుకు సాగలేదు. వర్షాలు పడితే తప్ప పంటలు సాగుచేసే పరిస్థితి లేదు. ఎరువుల తయారీకి అవసరమైన ముడి సరుకు దిగుమతి ఖర్చులు పెరిగిందనే కుంటి సాకులతో మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో పలు చోట్ల డిఎపి యూరియా నిల్వలు లేక రైతులు రంది పడుతున్నారు. డిఎపి ఒక్కక్క బస్తాకు రూ.1350 నిర్ణయ ధర ఉంటే రూ.1800 నుండి రూ.2వేల వరకు బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. యూరియా బస్తా రూ.266లకు విక్రయించాల్సి ఉండగా, రూ.500 నుండి 600 వరకు విక్రయిస్తున్నారు. అదే విధంగా కాంప్లెక్స్ ఎరువులు రకాల బట్టి రూ.1200 నుండి రూ.2000 వరకు అమ్ముతున్నారని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ధరలు పెరిగిన తర్వాత 20:20:0:13 బస్తాను రూ.3 వేలకు పైబడి అమ్ముతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 6,37,800 ఎకరాల్లో పంటల సాగు అంచనా ఉండగా, సుమారు 1,55,567 టన్నుల ఎరువులు అవసరమని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కాగా ఇప్పటి వరకు కనీసం 40 శాతం ఎరువులు కూడా అందుబాటులో లేనట్లు తెలుస్తోంది.

**యాప్ తిప్పలు :**
ఎరువులు కావాలంటే ముందుగా యాప్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంది. ఇది తీవ్ర ఇబ్బందిగా మారిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అసలైన రైతులు అవస్థలు పడుతున్నారు. యాప్ కూడా వారి ఇష్టానుసారంగా నడుపుతూ మూసేస్తున్నారు. జిల్లాలో ఆయా దుకాణాల వారీగా కేటాయించిన ఎరువులు లేవంటే అతిశయోక్తి కాదు. నిమిషాల్లోపే యాప్ మూసివేయడం, నిల్వలు ఖాళీ అవడంతో రైతులు ఎరువుల కోసం రంది పడుతున్నారు.

**ఏటేటా ఎరువుల వాడకాన్ని పెంచుకుంటూ పోతున్న రైతులు**
జిల్లాలో 435210 ఎకరాల్లో మాత్రమే సాగు : జిల్లాలో 6,37,800 ఎకరాల్లో సాగు అంచనాలు తయారు చేశారు. కానీ ప్రస్తుతం 435210 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారు. పత్తి 236491 ఎకరాలు, వరి 86975 ఎకరాలు, మొక్కజొన్న 6521 ఎకరాలు, మినుము 322 ఎకరాలు, పెసర 6937ఎకరాలు, కంది 2946 ఎకరాలు, ఆయిల్ ఫామ్ 95000 ఎకరాల్లో సాగువుతోంది. ఇంకా జిల్లాలో 2,02,590 ఎకరాల్లో సాగు ముందుకు సాగట్లేదు.

## అనుమానాస్పదంగా యువకుడి మృతి

రెండో అంతస్తు నుంచి దూకే క్రమంలో పట్టుతప్పిందా..?

సిసి ఫుటేజీ ఆధారంగా పలు కోణాల్లో దర్యాప్తు

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి పట్టణంలోని శ్రీవాణి విద్యాలయం రోడ్డులో గురువారం తెల్లవారుజామున ఓ యువకుడు అపార్ట్‌మెంట్ పై నుంచి కిందపడి మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఘటనకు ముందు అపార్ట్‌మెంట్ పరిసరాల్లో కొందరు వ్యక్తుల సంచారం, అనంతరం యువకుడు అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించడం వంటి పరిణామాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి. సిసి కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా, పెనమలూరు మండలం పోరంకికి చెందిన బొడ్డు వినిత్ (29) సత్తుపల్లి పట్టణంలోని వేంసూరు రోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో శ్రీవాణి కళాశాల రోడ్డులోని ఓ హాస్టల్ భవనంలోకి గేటు తీసుకుని వెళ్లిన అతడు, అక్కడి నుంచి పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. అపార్ట్‌మెంట్‌పై అంతస్తులో ఉపాధ్యాయ దంపతులు అద్దెకు ఉంటున్నట్లు సమాచారం. భార్య అశ్వారావుపేటలో ఉపాధ్యాయురాలిగా, భర్త సుజాతనగర్‌లోని ఓ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. రాత్రి సమయంలో ఇంటి తలుపులు తీసుకుని యువకుడు ఇంట్లోకి ప్రవేశించి బెడ్ పక్కన దాక్కున్నట్లు తెలుస్తోంది. అతడిని గమనించిన ఉపాధ్యాయురాలు కేకలు వేయడంతో భర్త నిద్రలేచి అరవగా, యువకుడు అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో తన చెప్పులను ఇంటి గుమ్మం వద్దే వదిలి అపార్ట్‌మెంట్ పై అంతస్తు నుంచి కిందకు దూకేందుకు ప్రయత్నించగా పట్టుతప్పి కిందపడినట్లు స్థానికులు చెబుతున్నారు. భారీ శబ్దం వినిపించడంతో అపార్ట్‌మెంట్ యాజమాని సహా ఇతరులు అప్రమత్తమై కిందకు వెళ్లి చూడగా యువకుడు తీవ్ర గాయాలతో పడి ఉన్నట్లు సమాచారం. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. అయితే మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిసింది.

సీసీ ఫుటేజీలో కీలక ఆధారాలు..?

ఈ ఘటనకు ముందు అపార్ట్‌మెంట్ పరిసరాల్లో ఇద్దరు వ్యక్తులు సంచరించినట్లు సీసీ కెమెరా ఫుటేజీలో నమోదైనట్లు సమాచారం. వారు కొంతసేపటి తర్వాత బయటకు వెళ్లి, మరో వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడినట్లు కూడా దృశ్యాలు ఉన్నట్లు తెలుస్తోంది. అనంతరం మరో వ్యక్తి వేరే వైపు నుంచి అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. దీంతో యువకుడు ఒంటరిగానే అక్కడికి వచ్చాడా? లేక మరికొందరితో కలిసి వచ్చాడా? అపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించడానికి ముందుగా రెక్కీ నిర్వహించారా? ఘటనకు ముందు ఫోన్‌లో ఎవరితో మాట్లాడాడు? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు.

# ఎన్‌డిఎ Vs 'ఇండియా'




**న్యూఢిల్లీ:** జార్ఖండ్‌లో ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిరానికి అందిన విరాళాల నిధుల దుర్వినియోగం లేదా చోరీకి సంబంధించిన ఆరోపణలపై గురువారం పార్లమెంట్ మకర్ ద్వార్ వద్ద అధికార ఎన్‌డిఎ, ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపిలు పరస్పరం ఎదురెదురుగా నిలబడి నిరసనలు చేపట్టారు. ఇరు వర్గాల మధ్య భద్రతా సిబ్బంది రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. ఇరుపక్షాల ఎంపిలు పరస్పర వ్యతిరేక నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలపై చర్చను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వెనుకడుగు వేస్తున్నారని ఎన్‌డిఎ ఎంపిలు ఆరోపించారు. మరోవైపు, జులై 20న పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని ఇండియా కూటమి ఎంపిలు డిమాండ్ చేశారు. అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాల నిధుల చోరీకి సంబంధించిన ఆరోపణలపై కూడా వారు ప్రశ్నలు లేవనెత్తారు. ఇరుపక్షాల ఎంపిలు మొదట విడివిడిగా నిరసనలు చేపట్టారు. ఎన్‌డిఎ ఎంపిలు మకర్ ద్వార్ మెట్లపై కూర్చొని రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ఆందోళనలపై చర్చకు రాహుల్ గాంధీ ముందుకు రావడం లేదని వారు ఆరోపించారు. బిజెపి ఎంపి కంగనా రనౌత్ ప్రతిపక్షంపై విమర్శలు చేశారు. దేశాభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ, రక్షణ వంటి అంశాలపై ప్రతిపక్షానికి మాట్లాడేందుకు విషయాలు లేవని ఆమె అన్నారు. చర్చ కావాలని మొదట డిమాండ్ చేసి, ఆ తర్వాత సమాధానాలు కోరుతున్నారని విమర్శించారు. మరోవైపు, నీట్ పేపర్ లీక్ అంశంపై విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ నిర్వహించిన సమయంలో పోలీసులు అతిగా వ్యవహరించారనే ఆరోపణలపై అమిత్ షా సమాధానం చెప్పాలని ప్రతిపక్ష ఎంపిలు మరోసారి డిమాండ్ చేశారు. ప్లకార్డులు పట్టుకుని మకర్ ద్వార్ ముందు నిలబడి 'అమిత్ షా మాఫీ మాంగో', 'చందా చోర్, గద్దీ ఛోడ్' వంటి నినాదాలు చేశారు. చందా ఎవరు దోచుకున్నారు? అనే పెద్ద బ్యానర్ వెనుక కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టిఎంసీకి చెందిన ఎంపిలు నిలబడి బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒకరికి వ్యతిరేకంగా మరొకరు నినాదాలు చేస్తూ, ఎన్‌డిఎ, ఇండియా కూటమి ఎంపిలు పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముక్తాయింపునిచ్చారు.

## సైబర్ నేరగాళ్ల ఉచ్చులో
# మాజీ జిల్లా న్యాయమూర్తి
### సిబిఐ, ఆర్‌బిఐ మేనేజర్లుగా నటించి ఘరానా మోసం

**జైపూర్:** రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన 90 ఏళ్ల మాజీ జిల్లా న్యాయమూర్తి సైబర్ మోసగాళ్ల చేతిలో రూ.2.50 కోట్లు కోల్పోయారు. సిబిఐ అధికారులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మేనేజర్లుగా నటించిన మోసగాళ్లు ఆయనను దాదాపు 15 రోజులపాటు 'డిజిటల్ అరెస్ట్'లో ఉంచి భయపెట్టారని పోలీసులు గురువారం తెలిపారు. బాధితుడు గణపత్ సింగ్ భండారీ తన పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పిపిఎఫ్) ఖాతా నుంచి కూడా డబ్బు బదిలీ చేయబోతుండగా ఎస్‌బిఐ మేనేజర్ అప్రమత్తతతో ఆ లావాదేవీ ఆగిపోయింది. దీంతో మోసం వెలుగులోకి వచ్చింది. ఆయన మేనల్లుడు రవీంద్ర సింగ్ మొహనోత్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జైపూర్‌లోని జ్యోతి నగర్ పోలీసులు బుధవారం సాయంత్రం కేసు నమోదు చేశారు.



ఎఫ్‌ఐఆర్ ప్రకారం, జులై 28న భండారీకి గుర్తుతెలియని నంబర్ నుంచి వాట్సాప్ వీడియో కాల్ వచ్చింది. పోలీసు యూనిఫాంలో ఉన్న వ్యక్తి తాను ముంబైకి చెందిన సిబిఐ అధికారినని పరిచయం చేసుకున్నాడు. రూ.50 కోట్ల హవాలా లావాదేవీ బయటపడిందని, అందులో రూ.40 లక్షలు భండారీ ఎస్‌బిఐ ఖాతాలో జమయ్యాయని చెప్పాడు. ఈ వ్యవహారంలో అరెస్టు చేస్తామని బెదిరించిన మోసగాడు కుటుంబ సభ్యులకు విషయం చెప్పవద్దని హెచ్చరించాడు. ఆ తర్వాత మరో వ్యక్తి వాట్సాప్‌లో సంప్రదించి తాను ఆర్‌బిఐ మేనేజర్‌గా పరిచయం చేసుకున్నాడు. హవాలా లావాదేవీకి సంబంధించిన డబ్బును మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టారని చెప్పి భండారీ ఆర్థిక పెట్టుబడుల వివరాలను కోరాడు. భయంతో, ఒత్తిడితో ఉన్న భండారీ తన మ్యూచువల్ ఫండ్స్, ఇతర ఆర్థిక పత్రాలకు సంబంధించిన వివరాలను వారికి అందించారు. అనంతరం దర్యాప్తుకు సహకరిస్తున్నామనే పేరుతో వివిధ బ్యాంకు ఖాతాలకు డబ్బు బదిలీ చేయాలని మోసగాళ్లు ఆదేశించారు. ఆగస్టు 3 నుంచి 10 మధ్య గాంధీ నగర్‌లోని ఎస్‌బిఐ ఖాతా నుంచి భండారీ మొత్తం రూ.2,50,51,000 బదిలీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రతి సంభాషణ అనంతరం వాట్సాప్ చాట్లు, కాల్ లాగ్‌లు, ఇతర సందేశాలను తొలగించాలని కూడా మోసగాళ్లు ఆదేశించారు. దీంతో కుటుంబ సభ్యులకు విషయం తెలియకుండాపోయింది. చివరికి భండారీ పిపిఎఫ్ ఖాతాలోని డబ్బును కూడా బదిలీ చేయాలని మోసగాళ్లు ఒత్తిడి చేశారు. బుధవారం జోహరి బజార్‌లోని ఎస్‌బిఐ శాఖకు వెళ్లినప్పుడు బ్యాంకు మేనేజర్‌కు అనుమానం వచ్చింది. భండారీతో మాట్లాడిన అనంతరం ఆయన సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి లావాదేవీని అడ్డుకున్నారు. తర్వాత భండారీ తన మేనల్లుడిని సంప్రదించగా, అతను పోలీసులను ఆశ్రయించాడు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్), సమాచార సాంకేతిక చట్టంలోని నిబంధనల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటన 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల తీవ్రతను మరోసారి చూపిస్తోంది. నకిలీ పోలీసు, సిబిఐ, ఆర్‌బిఐ అధికారులు వీడియో కాల్ ద్వారా బెదిరించడం, విచారణ పేరుతో డబ్బు బదిలీ చేయించడం ఈ తరహా మోసాల్లో సాధారణ పద్ధతిగా మారింది. ముఖ్యంగా వృద్ధులను భయపెట్టి, కుటుంబ సభ్యులతో మాట్లాడకుండా నిర్బంధించడం మోసగాళ్ల ప్రధాన వ్యూహంగా పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## స్పీకర్ టీ పార్టీని బహిష్కరించిన 'ఇండియా'

**న్యూఢిల్లీ:** లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడిన అనంతరం గురువారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన సంప్రదాయ టీ పార్టీని ఇండియా కూటమిలోని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) బహిష్కరించాయి. అయితే డిఎంకె నేత కనిమొళి ఈ సంప్రదాయ సమావేశానికి హాజరైనట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజ్యసభలో మాత్రం ప్రతిపక్ష నేతలు స్పీకర్ ఏర్పాటు చేసిన టీ పార్టీలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు రాజ్యసభ ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఏర్పాటు చేసిన టీ పార్టీకి హాజరయ్యారు. లోక్‌సభ స్పీకర్ ఛాంబర్‌లో జరిగిన టీ పార్టీలో ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులు పాల్గొన్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. అయితే కాంగ్రెస్, ఎస్‌పి, టిఎంసితో పాటు 'ఇండియా కూటమి'కి చెందిన పలు ఇతర పార్టీల నేతలు ఈ కార్యక్రమానికి హాజరు కాలేదని కాంగ్రెస్‌కు చెందిన ఓ సీనియర్ నేత వెల్లడించారు. రెండు సభల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడిన అనంతరం లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ తమ తమ ఛాంబర్లలో సంప్రదాయంగా టీ పార్టీని ఏర్పాటు చేస్తారు.

## అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులపై 'సుప్రీం'కు రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ:** ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై దర్యాప్తు జరపాలని సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ను ఆదేశించిన అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈనెల 17న విచారించే అవకాశం ఉంది. జులై 20న అలహాబాద్ హైకోర్టులోని లక్నో బెంచ్ సిబిఐ సమర్పించిన నివేదికపై అసంతృప్తి వ్యక్తం చేసింది. రాహుల్ ఆస్తులకు సంబంధించిన ఆరోపణలపై దర్యాప్తు ఎంతవరకు సాగిందో వివరించే తాజా అఫిడవిట్‌ను సిబిఐ సీనియర్ అధికారి స్వయంగా దాఖలు చేయాలని ఆదేశించింది. దర్యాప్తులో ఏదైనా అక్రమాన్ని సూచించే పత్రాలు, ఆధారాలు ఇడికి లభిస్తే, చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవచ్చని కూడా హైకోర్టు పేర్కొంది. రాహుల్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలపై సిబిఐ, ఇడి దర్యాప్తు జరపాలని కోరుతూ కర్ణాటకకు చెందిన ఎస్.విగ్నేశ్ శిశిర్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరుపుతోంది. బిజెపి కార్యకర్త అయిన విగ్నేశ్ గతంలో రాహుల్‌కు ద్వంద్వ పౌరసత్వం ఉందంటూ కూడా పిటిషన్లు దాఖలు చేశారు. తాజా కేసులో సిబిఐ సమర్పించిన అఫిడవిట్ గత ఆదేశాలకు అనుగుణంగా లేదని, దర్యాప్తు పురోగతిని స్పష్టంగా వివరించలేదని హైకోర్టు పేర్కొంది. కేసుకు సంబంధించిన మొత్తం రికార్డును సీల్ కవర్‌లోనే ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. కేసు సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకొని, బహిరంగ కోర్టులో విచారణ జరపడం లేదు.

## విద్యార్థులపై ఎఫ్‌ఐఆర్‌ల కొట్టివేతకు
# సుప్రీం కోర్టును ఆశ్రయించండి

- కేంద్ర ప్రభుత్వానికి శివసేన (యుబిటి) నేత ఆదిత్య థాక్రే డిమాండ్



**ముంబయి:** నీట్‌యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనల సందర్భంగా నమోదైన అన్ని ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని శివసేన (యుబిటి) నేత ఆదిత్య థాక్రే గురువారం డిమాండ్ చేశారు. విద్యార్థులపై నమోదైన కేసులను చట్ట ప్రకారం ముగించడానికి లేదా ఉపసంహరించుకోవడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడాన్ని సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశం అడ్డుకోదని ఇటీవల స్పష్టం చేసింది. విద్యార్థుల విడుదలకు సంబంధించి గతంలో ఇచ్చిన ఆదేశాల్లో ఉపయోగించిన 'క్రిమినల్ యాంటిసిడెంట్స్' అనే పదం తీవ్రమైన, ఘోరమైన నేరాలకు పాల్పడిన వ్యక్తులకు మాత్రమే వర్తిస్తుందని ఈనెల 3వ తేదీన ఇచ్చిన ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఆదిత్య థాక్రే 'ఎక్స్'లో చేసిన పోస్టులో మహారాష్ట్ర ప్రభుత్వం చార్జిషీట్ దాఖలైన తర్వాత కేసులను ఉపసంహరించుకోవడానికి నోటిఫికేషన్ జారీ చేయడం వల్ల సమయం, శ్రమ, ప్రజాధనం వృథా అవుతాయని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు కేసులను ఉపసంహరించుకునే చర్యలు చేపట్టినప్పుడు మహారాష్ట్ర ప్రభుత్వం కూడా అదే విధంగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఈ వ్యవహారం సాగుతున్నా, కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టును ఆశ్రయించి అన్ని ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయించాలి అని థాక్రే అన్నారు. తమను సంప్రదించిన విద్యార్థులకు తాము ఇచ్చిన హామీకి కట్టుబడి ఉంటామని, వారందరితో సమావేశం ఏర్పాటు చేసి కేసులను ఎలా ఎదుర్కోవాలో వివరిస్తామని తెలిపారు. ఎఫ్‌ఐఆర్‌ల ఉపసంహరణపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని మహారాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా ఉంటుందని థాక్రే వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై జరిగిన యువజన నిరసన 36 రోజులపాటు కొనసాగిన విషయం తెలిసిందే. అనంతరం అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఆందోళన ముగిసింది. జులై 20న నిరసనకారులు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా ఢిల్లీ పోలీసులు వారిని అడ్డుకుని చెదరగొట్టేందుకు బలప్రయోగం చేశారు. దీంతో పోలీసులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. జులై 25న ప్రధాన్ రాజీనామా చేయడం, ప్రభుత్వం ఆందోళనకారులతో చర్చలు జరపడం, వారి డిమాండ్లను అంగీకరించడంతో నిరసన విరమించారు.

## డిజిపి నియామకంపై పేర్లను ఖరారు చేయకండి
# యుపిఎస్‌సికి సుప్రీంకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ:** ఒడిశా డిజిపి నియామకానికి సంబంధించి సంభావ్య అధికారుల పేర్లను ఆగస్టు 18 వరకు ఖరారు చేయవద్దని సుప్రీంకోర్టు గురువారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి)ని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. డిజిపి పదవికి జూనియర్ అధికారిని కూడా పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం 2006లోని ప్రకాశ్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తోందంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై యుపిఎస్‌సి, ఒడిశా ప్రభుత్వం తదితరుల నుంచి సమాధానాలు కోరింది. ప్రస్తుత ఒడిశా డిజిపి వైబి ఖురానియా ఆగస్టు 16న పదవీ విరమణ చేయనున్నారు. యుపిఎస్‌సి గురువారం ఈ అంశంపై సమావేశం నిర్వహించాల్సి ఉందని కోర్టుకు తెలియడంతో, తదుపరి విచారణ వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆగస్టు 18న కేసును మళ్లీ విచారించనుంది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పి.చిదంబరం వాదిస్తూ, ఒడిశా ప్రభుత్వం అర్హత లేని ఎజిపిడి స్థాయి అధికారిని పదోన్నతి కల్పించి డిజిపి ఎంపిక ప్యానెల్‌లో చేర్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించలేదని తెలిపింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ పిటిషన్‌కు మద్దతు తెలిపారు. 2006 ప్రకాశ్ సింగ్ తీర్పు ప్రకారం, యుపిఎస్‌సి ఎంపిక చేసిన ముగ్గురు అత్యంత సీనియర్ అర్హత కలిగిన అధికారుల్లో ఒకరిని రాష్ట్ర ప్రభుత్వం డిజిపిగా ఎంపిక చేయాలి. ఎంపికైన అధికారికి కనీసం రెండేళ్ల పదవీకాలం ఉండాలి. బ్యాక్ డోర్ ఎంట్రీ ఉంటే అంగీకరించం అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## 22 ఏళ్లలో అత్యల్ప ఉత్పాదకత
# ఇదీ పార్లమెంటు వర్షాకాల సమావేశాల తీరు



**న్యూఢిల్లీ:** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ రెండు దశాబ్దాలకు పైగా కాలంలో అత్యంత తక్కువ ఉత్పాదకతను నమోదు చేసిన సమావేశాల్లో ఒకటిగా నిలిచింది. 2004 తర్వాత కేవలం రెండు పార్లమెంటు సమావేశాల్లోనే లోక్‌సభ ఇంతకంటే తక్కువగా పనిచేసిందని పిఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ గణాంకాలు వెల్లడించాయి. గత 22 సంవత్సరాల గణాంకాలను పరిశీలిస్తే పార్లమెంటు పనితీరులో తీవ్ర హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. కొన్ని సమావేశాల్లో సభలు నిర్ణయించిన సమయం కంటే ఎక్కువసేపు పనిచేయగా, మరికొన్ని సమావేశాల్లో రాజకీయ ఘర్షణలు, అంతరాయాల కారణంగా సభా కార్యకలాపాలకు కేటాయించిన సమయం చాలావరకు వృథా అయింది. తాజాగా ముగిసిన వర్షాకాల సమావేశం లోక్‌సభ పనితీరులో అత్యంత అధ్వాన్నమైన సమావేశాల్లో ఒకటిగా నిలిచింది. పిఆర్‌ఎస్ గణాంకాల ప్రకారం లోక్‌సభ నిర్ణయించిన సమయంలో కేవలం 15 శాతం మాత్రమే పనిచేసింది. 2016 శీతాకాల సమావేశంలోనూ ఇదే స్థాయి నమోదైంది. 2010 శీతాకాల సమావేశంలో లోక్‌సభ ఐదు శాతం, 2013 శీతాకాల సమావేశంలో ఎనిమిది శాతం సమయం మాత్రమే పనిచేశాయి. రాజ్యసభ పరిస్థితి లోక్‌సభ కంటే మెరుగ్గా ఉన్నప్పటికీ, నిర్ణయించిన సమయంలో కేవలం 33 శాతం మాత్రమే పనిచేసింది. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల పనితీరును పరిశోధించి, పర్యవేక్షించే స్వతంత్ర లాభాపేక్షలేని సంస్థగా పిఆర్‌ఎస్ పనిచేస్తోంది. అయితే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాత్రం వర్షాకాల సమావేశంలో లోక్‌సభ ఉత్పాదకత 19 శాతంగా, రాజ్యసభ ఉత్పాదకత 39 శాతంగా ఉందని తెలిపారు. ఈ స్వల్ప వ్యత్యాసంపై పిఆర్‌ఎస్ వివరణ ఇచ్చింది. ఒక సమావేశంలో పార్లమెంటు వాస్తవంగా పనిచేసిన గంటలను, ఆ సమావేశానికి నిర్ణయించిన మొత్తం పని గంటలతో భాగించి సభ ఉత్పాదకతను లెక్కిస్తామని తెలిపింది. నిర్ణయించిన సమయం కంటే సభ ఎక్కువసేపు పనిచేస్తే ఉత్పాదకత 100 శాతాన్ని కూడా దాటవచ్చని పేర్కొంది. వివిధ సమావేశాలను ఒకే ప్రమాణంతో పోల్చేందుకు ఈ విశ్లేషణలో పిఆర్‌ఎస్ గణాంకాలనే ఉపయోగించినట్లు తెలిపింది.

2004 తర్వాత అత్యంత తక్కువగా సభా కార్యకలాపాలు జరిగిన సందర్భం 2010 శీతాకాల సమావేశం. అప్పట్లో యూపీఏ2 ప్రభుత్వం అధికారంలో ఉంది. లోక్‌సభ నిర్ణయించిన సమయంలో కేవలం ఐదు శాతం మాత్రమే పనిచేసింది. రాజ్యసభ పరిస్థితి మరింత దారుణంగా ఉండి రెండు శాతం సమయం మాత్రమే పనిచేసింది. 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపుల్లో అవకతవకలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో దర్యాప్తు చేయాలన్న ప్రతిపక్ష డిమాండ్‌తో ఆ సమావేశాలు స్తంభించిపోయాయి.

2013 శీతాకాల సమావేశాల్లోనూ సభా కార్యకలాపాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. లోక్‌సభ ఎనిమిది శాతం, రాజ్యసభ 19 శాతం సమయం మాత్రమే పనిచేశాయి. ఆంధ్రప్రదేశ్ విభజన, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రతిపాదనపై జరిగిన ఆందోళనలు, బొగ్గు బ్లాకుల కేటాయింపులపై నిరసనలు సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలిగించాయి.

2014 బడ్జెట్ సమావేశం కూడా తక్కువ ఉత్పాదకతను నమోదు చేసింది. సాధారణ ఎన్నికలకు ముందు జరిగిన ఆ చివరి సమావేశంలో ఆంధ్రప్రదేశ్ విభజన అంశంపై తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో లోక్‌సభ నిర్ణయించిన సమయంలో సుమారు 21 శాతం, రాజ్యసభ 27 శాతం మాత్రమే పనిచేశాయి.

కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యుపిఎ) 2004 మే నుంచి 2014 మే వరకు అధికారంలో ఉంది. 2014 మే 26న బిజెపి నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) అధికారంలోకి వచ్చింది.

2016 శీతాకాల సమావేశాల్లో లోక్‌సభ ఉత్పాదకత 15 శాతానికి పడిపోయింది. తాజాగా ముగిసిన సమావేశంతో ఇది సమాన స్థాయి. ఆ సమయంలో పెద్ద నోట్ల రద్దు అంశం ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రధాన వివాదంగా మారింది. రాజ్యసభ నిర్ణయించిన సమయంలో 18 శాతం మాత్రమే పనిచేసింది.

అయితే కొన్ని సందర్భాల్లో పార్లమెంటు నిర్ణయించిన సమయం కంటే ఎక్కువసేపు కూడా పనిచేసింది. యుపిఎ హయాంలో 2004 శీతాకాల సమావేశం, 2005 వర్షాకాల సమావేశం, 2009 బడ్జెట్ సమావేశాల్లో లోక్‌సభ ఉత్పాదకత 100 శాతాన్ని దాటింది. ఆ కాలంలో రాజ్యసభ కూడా మూడు సమావేశాల్లో 100 శాతానికి పైగా పనిచేసింది.

2014 తర్వాత లోక్‌సభ అత్యధిక ఉత్పాదకతను 2024 ఫిబ్రవరి బడ్జెట్ సమావేశంలో నమోదు చేసింది. ఆ సమావేశంలో ఉత్పాదకత 148 శాతానికి చేరింది. ఆ తర్వాత 2020 వర్షాకాల సమావేశంలో 145 శాతం, 2023 ప్రత్యేక సమావేశంలో 137 శాతం నమోదయ్యాయి. గత 22 ఏళ్లలో రాజ్యసభ అత్యధిక ఉత్పాదకతను 2024 ఫిబ్రవరి బడ్జెట్ సమావేశంలో నమోదు చేసింది. ఆ సమయంలో అది 137 శాతానికి చేరింది.

## శిరోమణి అకాలీదళ్ చీఫ్
# బాదల్‌పై కత్తితో దాడి
### మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఘటన

**నాందేడ్ :** శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడి) అధ్యక్షుడు, పంజాబ్ మాజీ ఉపముఖ్యమంత్రి సుఖ్ బీర్ సింగ్ బాదల్‌పై దాడి జరిగింది. మహారాష్ట్రలోని నాందేడ్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గురుద్వారా మాతా సాహిబ్ దేవాన్ జి ముగత్‌ను సందర్శిస్తున్నప్పుడు హఠాత్తుగా బాదల్‌పై ఒక వ్యక్తి పదునైన కత్తితో దాడిచేయగా, ఆయన కుడిచేతికి గాయమైంది. ఆయన్ను వెంటనే సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఒక అధికారి చెప్పారు. ఈ దాడి మధ్యాహ్నం 1.45గంటలకు జరిగిందని ఆయన తెలియజేశారు. దాడి జరిగినప్పుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ సతీమణి, అకాలీదల్ ఎంపి హర్ సిమ్రత్ కౌర్ బాదల్ ఆయన వెంట ఉన్నారు. ఈ ఘటనలో హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ భద్రతా సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. బాదల్ తన కుడిచేతికి ఒక వస్త్రం చుట్టి భవనంలోకి నడుచుకుంటూ వెళుతోన్న దృశ్యాలు ఉన్న ఒక వీడియో తాజాగా వైరల్ అయ్యింది. గురువారం ఉదయం అకాలీదల్ ఎంపి అయిన హర్ సిమ్రత్ కౌర్ బాదల్‌తో కలిసి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ నాందేడ్‌లోని తఖ్త్ శ్రీ హుజుర్ సాహిబ్‌ను సందర్శించారు. బాదల్‌పై 2024 డిసెంబర్ లోనూ ఒకసారి హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే.

# అస్సాం – అరుణాచల్ సరిహద్దుల్లో మళ్లీ ఘర్షణ

**నార్త్ లఖింపూర్ (అస్సాం):** అస్సాం–అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులోని ధేమాజీ జిల్లాలో అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ నిరసనకారుల మధ్య మరోసారి ఘర్షణ చెలరేగింది. అరుణాచల్ ప్రదేశ్ వైపు నుంచి ఆందోళనకారులపై రాళ్లు రువ్వడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. గుంపును అదుపు చేయడానికి ఇరుగుపొరుగు రాష్ట్ర పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరపాల్సి వచ్చింది. సరిహద్దులో జరిగిన కాల్పుల ఘటనను నిరసిస్తూ అస్సాంలోని మిసింగ్ సంఘం విద్యార్థి సంఘం (టిఎంపికె) ఇతర స్థానిక సంస్థలతో కలిసి అరుణాచల్ ప్రదేశ్‌పై కొనసాగిస్తున్న ఆర్థిక దిగ్బంధం రెండవ రోజుకు చేరుకుంది. రెండు రోజుల క్రితం జరిగిన కాల్పుల్లో అస్సాంకు చెందిన 12 మంది స్థానికులు గాయపడ్డారు. ఈ సరిహద్దు వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. అత్యవసర, పాఠశాల వాహనాలను మినహాయించి మిగతా అన్ని వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అస్సాం సరిహద్దు రక్షణ మరియు అభివృద్ధి మంత్రి అతుల్ బోరా, విద్యా మంత్రి రణోజ్ పేగు టిఎంపికె నాయకులతో సమావేశమై దీనిపై చర్చిస్తున్నారు. అస్సాంఅరుణాచల్ ప్రదేశ్ మధ్య 804.1 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. ఈ సరిహద్దు వివాదాలను పరిష్కరించడానికి ఇరు రాష్ట్రాలు ప్రాంతీయ కమిటీలను ఏర్పాటు చేసి చర్చలు జరుపుతున్నాయి.

# సిబిఐ పిటిషన్‌ను కొట్టివేయండి
### మద్యం కేసులో ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్, సిసోడియా

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం విధానానికి సంబంధించిన కేసులో తమను కేసు నుంచి డిశ్చార్జ్ చేయడాన్ని సవాలు చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా ఢిల్లీ హైకోర్టును కోరారు. సిబిఐ పిటిషన్‌ను అసాధారణ తొందరపాటుతో, చాలా నిర్లక్ష్యంగా దాఖలు చేసిందని వారు ఆరోపించారు. సిబిఐ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్ విచారణకు అర్హతను కేజ్రీవాల్, సిసోడియా వేర్వేరు దరఖాస్తుల్లో ప్రశ్నించారు. పిటిషన్ చాలా సంక్షిప్తంగా, నిర్దిష్ట వివరాలు లేకుండా ఉందని, అందులో తమపై సిబిఐ చేస్తున్న అసలు ఆరోపణలను కూడా స్పష్టంగా అర్థం చేసుకోలేకపోతున్నామని పేర్కొన్నారు. ఫిబ్రవరి 27న ప్రత్యేక కోర్టు కేజ్రీవాల్, సిసోడియా సహా 23 మందిని ఈ కేసులో డిశ్చార్జ్ చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, మూడు నెలలకు పైగా విచారణ జరిపిన తర్వాత ప్రత్యేక కోర్టు ఈ నిర్ణయం తీసుకుందని కేజ్రీవాల్, సిసోడియా తెలిపారు. అయితే తమను డిశ్చార్జ్ చేయడంలో కోర్టు ఏదైనా వక్రీకృత నిర్ణయం తీసుకుందని లేదా న్యాయపరమైన లోపం జరిగిందని సిబిఐ తన పిటిషన్‌లో నిర్దిష్టంగా చూపలేదని వారు వాదించారు. డిశ్చార్జ్ ఉత్తర్వులోని 1,133 పేరాగ్రాఫ్‌లలో ఒక్క పేరాగ్రాఫ్‌ను కూడా సిబిఐ ప్రస్తావించలేదని వారు పేర్కొన్నారు. ఆధారపడుతున్న పత్రాలు, నిర్దిష్ట ఆరోపణలు లేకుండా పిటిషన్ దాఖలు చేసినందున దాన్ని ప్రస్తుత రూపంలోనే కొట్టివేయాలని కోరారు. రివిజన్ పరిధిలో హైకోర్టు మొత్తం సాక్ష్యాలను మళ్లీ పరిశీలించరాదని, తీవ్రమైన న్యాయపరమైన లోపం ఉన్న సందర్భాల్లో మాత్రమే జోక్యం చేసుకోవాలని వారు పేర్కొన్నారు. కాగా, ట్రయల్ కోర్టు తీర్పును సిబిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. డిశ్చార్జ్ ఉత్తర్వు చట్టవిరుద్ధమని, స్పష్టమైన న్యాయపరమైన లోపాలతో ఉందని సిబిఐ తన రివిజన్ పిటిషన్‌లో పేర్కొంది.

SHRIRAM Finance
**వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS02EY-1721 | SRIKANTH BANTU | ETIOS D 4D GD DIESEL 5 SEATER | 2012 |
| 2 | TG24T0574 | Jittaboina Naresh | EICHER PRO 2095XP BS6 FBT | 2024 |
| 3 | AP01Y-8366 | SRINIVAS VADNALA | TATA WINGER AMBULANCE SPL-P | 2013 |
| 4 | TS03FF-7785 | VIJAY KUMAR KASHETTI | SCALA RXE DIESEL 5 SEATER | 2013 |

**AUCTION DATE 14-08-2026**
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

**SHRIRAM FINANCE LIMITED**
D No :19-11-409/3. 1st floor, Beside GMR Gokul Appartments
Shambunipet, Warangal - 506002, Cell 9989809938, 9000298883

# తప్పుడు అంచనాలు, నిఘా వైఫల్యమే ఇరాన్ యుద్ధం

● ట్రంప్‌పై అబ్బాస్ అరాఘ్చి విమర్శ



**టెహ్రాన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తప్పుడు అంచనాలు, నిఘా విభాగ వైఫల్యానికి ఇరాన్ యుద్ధం ఒక స్పష్టమైన నిదర్శనమని ఆ దేశ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి విమర్శించారు. ఇప్పుడు హోర్ముజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ అంతకంటే చాలా పెద్ద తప్పుడు అంచనాలు వేశారని ఎక్స్ వేదికగా రాశారు. ఇరాన్ శక్తి సామర్థ్యాలను ట్రంప్ తక్కువగా చూశారన్నారు. నిఘా వైఫల్యం కారణంగా అమెరికా చాలాకాలంగా తప్పుడు అంచనాలు వేస్తోందని హెచ్చరించారు. ''అల్లాహ్ చాలా గొప్పవాడు, భూమిపైన ఉన్న ఏ శక్తికంటే కూడా అల్లాహ్ గొప్పవాడు,మా నమ్మకం అల్లాహ్‌పైనే ఉంది'' అని రాశారు. తప్పుడు అంచనాలు, తప్పుడు వార్తలు రాయడం,తప్పుడు నిఘా వేయడం అత్యంత ప్రమాదకరం, జాగ్రత్తగా ఉండండి, ఇప్పుడు ఇంకా హోర్ముజ్ విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్నారని హితవు చెప్పారు. ఫ్రాన్స్ ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. ఫ్రాన్స్‌లాంటి దేశం మానవహక్కుల గురించి, అంతర్జాతీయ చట్టాల గురించి ఉపన్యాసాలు చెప్పడం ఆపాలని హెచ్చరించారు. ఈ విధమైన ప్రవర్తన సిగ్గుచేటు,కపటత్వం అని విమర్శించారు. ''గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమానికి మీరు మద్దతు ఇస్తున్నారు, ఇరాన్‌పై దురాక్రమణకు, యుద్ధానికి మద్ద తు ఇస్తున్నారు, మీకు ఉన్నాయని మీ రు ఊహించుకుంటున్న నైతిక ఉన్నతి ఈ చర్యలతో నాశనమైంది'' అని ఎక్స్ వేదికగా విమర్శించారు. ఈ ఏడాది ఆరంభంలో ఇరాన్ వ్యా ప్తంగా అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్ల లో 52,000 మంది మరణించారని, కా ల్పివేతకు గురయ్యారని, ఈ అల్లర్లకు సూత్రధారులుగా భావించిన అనేకమందికి మరణశిక్షలు అమలు చేశారని పశ్చిమదేశాలు విమర్శించాయి. ఫ్రాన్స్‌తో పాటు మరో 25 దేశాలు ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఒక ప్రకటన జారీ చేశాయి. యూరోపియన్ యూనియన్ విదేశాంగ విభాగాధిపతి కాజా కల్లాస్‌సహా అందరి సంతకాలతో ఫ్రా న్స్ విదేశాంగ మంత్రిత్వశాఖ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసిన తర్వాత అబ్బాస్ అరాఘ్చి ఎక్స్‌వేదికగా మండిపడ్డారు.

**అమెరికా బెదిరింపులు, దాడులు జెనీవా ఒప్పందాల ఉల్లంఘనే: బఖాయీ**

అమెరికా చేస్తున్న బెదిరింపులు, ఇరాన్‌పై వైమానిక దాడులు, గ్రామాలు, పట్టణాలపై విధ్వంసం, మౌలిక సదుపాయాల విధ్వంసాలన్నీ స్పష్టమైన యుద్ధ నేరాలేనని ఇరాన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ ఎక్స్ వేదికగా విమర్శించారు. నాలుగు జెనీవా ఒప్పందాల 77వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ప్రకటన చేస్తూ, ఈ చర్యలన్నీ జెనీవా ఒప్పందాల ఉల్లంఘనేనని పేర్కొన్నారు. ఈ ఉల్లంఘనను సాధారణాంశంగా చూడటం అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను క్షీణింపజేసినట్లేనని, ఎక్కడా న్యాయానికి తావు లేకుండా చేయడమేననీ అన్నారు. 1949 ఆగస్టు 12వ తేదీన జెనీవా ఒప్పందాల అమోదం జరిగింది. ఈ ఒప్పందాల ప్రకారం, మానవత్వం,విచక్షణ,సైనిక దాడి అవసరం వంటి అంశాలను ఈ తీర్మానంలో స్పష్టంగా నిర్వచించారు.ఈ తీర్మానాలను ఆమోదించిన 77 సంవత్సరాల తర్వాత ఈ తీర్మానాలను ఆమోదించినవారు యుద్ధోన్మాదంతో చెలరేగిపోతున్నారని విమర్శించారు. ఐక్యరాజ్యసమితికి ఆతిథ్యదేశంగా, భద్రతామండలిలో శాశ్వత సభ్య దేశంగా ఉన్న అమెరికా ఈనాడు మరోదేశ మౌలిక సదుపాయాలు, వంతెనలు, విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని, మరి ఎందుకు ఈ విషయంలో ప్రపంచదేశాలు ఉదాసీనంగా ఉన్నాయని బఖాయీ ప్రశ్నించారు. అధికారం ముందు చట్టం ఎక్కడ మౌనం వహిస్తుందో అక్కడ కూలిపోయేది వంతెనలు, విద్యుత్ కేంద్రాలు కాదు, అంతర్జాతీయంగా మానవాళి విశ్వాసం కూలిపోతుందని పేర్కొన్నారు.

**హోర్ముజ్ ఇరాన్ అధీనంలోనే ఉంది**

హోర్ముజ్ జలసంధి ఐఆర్‌జిసి దళాల కనుసన్నలలోనే ఉందని ఇరాన్ పారామిలిటరీ బస్సెజ్ దళాల అధిపతి హోస్సేన్ తాయబ్ స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధి పూర్తిగా తమ అధీనంలోనే ఉందని డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఆయన తిరస్కరించారు. ఇరాన్ పెట్టిన షరతులు అంగీకరించేవరకూ జలసంధిని తెరబోమని ప్రకటించారు.జలసంధిలో ప్రధాన జలమారర్గాలు మా అధీనంలోనే ఉన్నాయి, ఐఆర్‌జిసి దళాలు కనిపెట్టుకుని ఉన్నాయి, ఈ జలసంధి ఎప్పటికీ మీకు దక్కదు,పూర్తి భద్రతతో మా దేశం ముందుకు సాగుతోంది అని ప్రకటించారు. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడి తెస్తున్నామని, జలసంధి పూర్తిగా సెంట్‌కామ్ అధీనంలోనే ఉందని, వారు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని ట్రంప్ చేసిన పోస్టింగ్‌లను తాయబ్ తిరస్కరించారు.

## లెబనాన్, సిరియా, గాజాలలో శాశ్వత తిష్ట: కట్జ్

● ఇజ్రాయెల్ ప్రకటనపై మండిపడిన అమెరికా



**బీరూట్:** దక్షిణ లెబనాన్‌లోనే తమ సైన్యాలు తిష్టవేసి ఉంటాయని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. దీంతో అమెరికా తీవ్రస్థాయిలో మండి పడింది. హెజ్బొల్లా ఉగ్రవాద సైన్యాలు ఆయుధాలు వదిలే వరకూ తాము దక్షిణ లెబనాన్‌ను వదిలివెళ్ళే ప్రసక్తే లేదని కట్జ్ ప్రకటించారు. ఒకవైపు ఒప్పంద ప్రక్రియ అమలులోకి వ స్తున్న తరుణంలో కట్జ్ ఈ ప్రకటన చేశారు. లెబనాన్‌లో భూభాగాలను స్వాధీనం చేసుకోవాలన్న ప్రాదేశిక ఆకాంక్షలేవీ తమకు లేవని ఇజ్రాయెల్ ప్రకటించిన తర్వాత రక్షణ మంత్రి కట్జ్ ఈ విధంగా వ్యాఖ్యానించడాన్ని ట్రంప్ ప్రభుత్వం తీవ్రం గా తప్పుపట్టింది. లెబనాన్ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాలకు అమెరికా ఎంతో మద్దతు ఇస్తోందని ఆ దేశ విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి వ్యాఖ్యానించారు. కానీ గురువారం దక్షిణ లెబనాన్‌ను సందర్శించిన ఇజ్రాయెల్ మంత్రి కట్జ్ మాత్రం, ఇజ్రాయెల్ రాజ్యాన్ని సంరక్షించుకునేందుకు ఐడిఎఫ్ దళాలు లెబనాన్, సిరియా, గాజా భద్రతా మండలాలలో శాశ్వతంగా తిష్టవేసి ఉంటాయని ప్రకటించడంతో ట్రంప్ ప్రభుత్వం మండిపడింది. అదేవిధంగా గత నెలలో దక్షిణ లెబనాన్ గ్రామాలను ధ్వంసం చేసిన ఐడిఎఫ్ దళాలను కూడా కట్జ్ ప్రశంసించారు. ఇజ్రాయెల్‌లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కట్జ్ ఈ విధమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. ట్రంప్ మధ్యవర్తిత్వంలో లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య సమస్య పరిష్కారినికి ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిగాయి. ఒప్పందం అమలుకు ఒక ఫ్రేమ్‌వర్కుపై అంగీకారం కుదిరింది. దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక దళాల ఉనికి అంశం ఈ ఫ్రేమ్‌వర్కు నిబంధనలలో ఎక్కడా లేదు. ఇజ్రాయెల్ దళాలు ఖాళీచేసిన ప్రాంతాలను లెబనాన్ సైన్యాలు స్వాధీనం చేసుకుంటాయి. ఈ ప్రాంతాలలో హెజ్బొల్లా ఉగ్రవాదులు తిరిగి ప్రవేశించకుండా చూసుకునే బాధ్యత కూడా లెబనాన్ సైన్యాలదే. కానీ లెబనాన్ సైన్యాలపై ఇజ్రాయెల్ ఐడిఎఫ్‌కు విశ్వాసం లేదు. .

# కురిల్ దీవుల్లో పుతిన్ పర్యటన: జపాన్ నిరసన



**మాస్కో:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ పసిఫిక్ దీవుల్లో పర్యటించారు. దీంతో జపాన్ ప్రభుత్వం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ పసిఫిక్ దీవులు లేదా నాలుగు కురిల్ దీవుల శ్రేణిలోని ఇటురుప్ దీవిలో పుతిన్ పర్యటించారు. ఈ చర్యను జపాన్ ప్రధానమంత్రి సనై తకచి తీవ్రంగా ఖండించారు. జపాన్ ప్రజల దృష్టిలో పుతిన్ మరింత దిగజారారని విమర్శించారు. ఇదెంతమాత్రం ఆమోదయోగ్యమైన చర్య కాదన్నారు. ఈ దీవుల శ్రేణి జపాన్ ప్రత్యేక భూభాగమని, దీనిని రెండో ప్రపంచ యుద్ధసమయంలో రష్యా స్వాధీనం చేసుకుందని విమర్శించారు. జపాన్‌కు దక్షిణంగా ఉన్న నాలుగు దీవులపై తమకే అధికారాలు ఉన్నాయని తకైచీ పేర్కొన్నారు. ఈ దీవులను జపాన్ ఉత్తర ప్రాంత దీవులుగా పేర్కొంటున్నది. వీటిపై జపాన్ సార్వభౌమాధికారం ఉందని ఉద్ఘాటించింది. ఈ విషయంలో దశాబ్దాలుగా శాంతి పరిష్కారం రాలేదు. ఈ కారణంగానే రష్యా,జపాన్ శాంతి ఒప్పందంపై సంతకాలు చేయలేదు. ఈ దీవులలో ఒకటిగా ఉన్న ఇటురుప్ దీవిలో ఉన్న ఒక చేపల కర్మాగారాన్ని పుతిన్ సందర్శించారు. అక్కడి ప్రజలతో సంభాషణ చేశారు. సఖాలిన్ ప్రాంత గవర్నర్ వలేరీ లిమరెంకోతో ఆయన సమావేశమయ్యారు. ఇటురుప్ ప్రాంతా న్ని జపాన్‌వాసులు ఎటోరోఫు అని పిలుస్తారు. ఉత్తర జపాన్‌లోని హొక్కైడో, రష్యాలోని కమ్చట్కా ద్వీపం మధ్యలో ఈ కురిల్ దీవుల శ్రేణి ఉంది. రెండో ప్రపంచ యుద్ధంలో ఈ దీవులను రష్యా స్వాధీనం చేసుకుని 17,000 మంది జపనీయులను బహిష్కరించింది. అప్పటినుండీ ఈ దీవులు రష్యా పాలనలోనే ఉన్నాయి. ఈ దీవులను రష్యా ఒక వ్యూహాత్మక ప్రాంతంగా తీర్చిదిద్దింది. వైమానికస్థావరంగా ఉపయోగించుకుంటున్నది.ఈ దీవులలో రష్యా క్రమం తప్పకుండా సైనిక విన్యాసాలు చేస్తుంది.

**ఉక్రేన్‌కు 261 మృతదేహాలు..**

యుద్ధంలో మరణించిన 261 మంది సైనికులమృతదేహాలను ఉక్రేన్‌కు రష్యా స్వాధీనం చేసింది. ఉక్రేన్ స్వాధీనం చేసిన ప్రతి రష్యా సైనికుడి మృతదేహానికి ప్రతిగా 24 మంది ఉక్రేన్ మృతదేహాలను రష్యా తిరిగి స్వాధీనం చేసింది. మరోసారి మృతదేహాల మార్పిడి జరిగిందని, ఇప్పుడే మేం ఉక్రేన్‌కు మృతదేహాలను రష్యా స్వాధీనం చేసిందని యుద్ధ విలేకరి అలెగ్జాండర్ కోట్స్ తన మాక్స్ ఛానల్‌లో రాశారు.

## తొమ్మిదిమంది భారత జాలర్ల అరెస్ట్: శ్రీలంక

**కొలంబో:** శ్రీలంక జలాల్లో చేపలవేట చేస్తున్నారన్న ఆరోపణలపై తొమ్మిదిమంది భారత జాలర్లను ఆ దేశ అధికారులు అరెస్టు చేశారు. వారి ట్రాలర్లను కూడా శ్రీలంక నౌకాదళం స్వాధీనం చేసుకుంది.శ్రీలంక నౌకాదళం గురువారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, భారత జాలర్లకు చెందిన ట్రాలర్లు అంతర్జాతీయ సముద్ర సరిహద్దు (ఐఎంబిఎల్)ను దాటి ముందుకు చొచ్చుకువెళ్ళి చేపలవేట చేస్తున్నాయి. ట్రాలర్లను స్వాధీనం చేసుకునే సమయానికి వేటగాళ్ళందరూ శ్రీలంక సముద్ర జలాల్లోనే ఉన్నారు. మన్నార్ ద్వీపం,ఆడమ్స్ బ్రిడ్జి చుట్టూ ఉన్న ప్రాంతాన్ని జీవవైవిధ్యప్రాంతంగా అంతర్జాతీయంగా,ప్రాంతీయంగా కూడా గుర్తించారని శ్రీలంక నౌకాధికారులు చెప్పారు. భారత్–శ్రీలంక మధ్య చేపలవేటకు సంబంధించిన వివాదం అనేక దశాబ్దాలుగా కొనసాగుతోంది. అధికారిక లెక్కల ప్రకారం 2026 ఏప్రిల్ నాటికి అక్రమంగా చేపలవేట చేస్తున్నారనే ఆరోపణలపై 128 మంది భారతీయ జాలర్లను శ్రీలంక అధికారులు అరెస్టు చేశారు. 18 ట్రాలర్లను కూడా స్వాధీనం చేసుకుంది. భారత మత్స్యకారులు తరచు అంతర్జాతీయ రేఖను ఉల్లంఘించి శ్రీలంక జల్లాల్లోకి ప్రవేశిస్తున్నరని ఆ ప్రభుత్వం ఆరోపణలు చేస్తూ ఉంటుంది. పాల్క్ జలసంధి (తమిళనాడు–శ్రీలంకలను వేరుచేసే సన్ననిదారి)లో ఒకసారి శ్రీలంక నావికాధికారులు భారత జాలర్లపై కాల్పులు కూడా జరిపిన ఘటనలున్నాయి.

## పాలస్తీనా కుటుంబాలకు సెటిలర్స్ వేధింపులు

●ఇది భయంకర ఉగ్రవాద చర్య: అమెరికా వ్యాఖ్య




**జెరూసలెం:** కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన తర్వాత కూడా గాజాలో ఒకవైపు ఇజ్రాయెల్ సైన్యం హత్యాకాండ కొనసాగిస్తుండగా, మరోవైపు ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో ఇజ్రాయెలీ సెటిలర్స్ పాలస్తీనా గ్రామాలలో కుటుంబాల ఇళ్ళను చుట్టుముట్టి వేధింపుల హింస సృష్టిస్తున్నారు. పాలస్తీనియన్ల ఇళ్ళు,భూములు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారు. దక్షిణ నాబ్లస్ ఖుస్రా గ్రామం దీనికి ప్రధాన కేంద్రంగా మారింది. 2023 అక్టోబరు నుండి ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో 127 పాలస్తీనా కుటుంబాలు తమ ఇళ్ళను, భూములను కోల్పోయాయి. 3,800 మంది పాలస్తీనియన్లు పూర్తిగా నిరాశ్రయులయ్యారు. మితవాద ప్రధానమంత్రి నెతన్యాహూ ఈ ప్రాంతంలో సెటిలర్స్ నివాసాలను శరవేగంగా విస్తరిస్తూ ఉండటంతో వారు ప్రభుత్వ అండతో మరించి రెచ్చిపోయి పాలస్తీనియన్లపై దాడులు చేస్తున్నారు. గడచిన అక్టోబరులో గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటినుండీ వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో 87 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెలీ సెటిలర్స్ హతమార్చారు. అక్కడ మసీదులు కూలిపోతున్నాయి. పాలస్తీనా పురాతన నిర్మాణాలు ధ్వంసమవుతున్నాయి.ఈ తరుణంలో పాలస్తినా గ్రామాల దిగ్బంధనాన్ని అమెరికా ఒక భయంకరమైన చర్యగా అభివర్ణించింది.అమెరికా పౌరసత్వం ఉన్న పాలస్తీనా జాతీయ కుటుంబం ఇంటిని వెస్ట్‌బ్యాంక్‌లో చుట్టుముట్టి కదలనివ్వకుండా చేయడాన్ని అమెరికా దౌత్యకార్యాలయంలో రాయబారి మైక్ హకబీ తీవ్రగా ఖండించారు. దీనిని భయంకరమైన ఉగ్రవాద చర్యగా పేర్కొన్నారు. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో పరిస్థితులను చక్కదిద్దేందుకు ఇజ్రాయెల్ సైన్యాలు ఆదివారం నుండీ రంగ ప్రవేశం చేశాయి. కానీ ఐడిఎఫ్ సైన్యాలు వారిని అదుపు చేయలేకపోతున్నాయి. సైన్యం నిబంధనలను ఉల్లంఘిస్తూ, యూదు సెటిలర్స్ పాలస్తినా కుటుంబాలను వేధింపులకు గురిచేస్తున్నారు. పదులసంఖ్యలో ఉన్న యూదులు మూడు పాలస్తీనా కుటుంబాలపై రాళ్ళు విసురుతున్నారు. ఇళ్ళకు ఉన్న రాతిగోడలను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారి ఇళ్ళకు నీరు, విద్యుత్ సరఫరా నిలిపివేశారు. బయటకు రాకుండా ముట్టడించారు. ఇళ్ళు వదిలి వెళితే స్థిరవాసులు వెంటనే ఆ ఇళ్ళను ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. ఖుస్రా గ్రామంలో కొత్త నిర్మించిన ఒక మసీదును కూడా సెటిలర్స్ ధ్వంసం చేశారు. పొరుగున జులుద్ గ్రామంలో కూడా పాలస్తీనా కుటుంబాలను ముట్టడించి వారిని భూముల నుండి ఇళ్ళ నుండి వెళ్ళగొట్టారు.

# ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు

- బిసి మహిళలకు ఆర్థిక చేయూత
- రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కుట్టు వృత్తి ద్వారా స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకాన్ని ప్రారంభించింది. రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. బిసి మహిళలను కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.

**1.19 లక్షల మందికి ప్రయోజనం**

రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఒక్కో కుట్టు మిషన్ విలువ రూ.12 వేలు కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడిపై అందజేస్తామని చెప్పారు. అర్హులైన బిసి మహిళల నుంచి ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

**పేద మహిళలకు ప్రాధాన్యం**

కుట్టు వృత్తిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ బిసి మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే పథకం ప్రధాన ఉద్దేశమన్నారు. అత్యంత పేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, నిరాశ్రయులు, అనాథలు, వికలాంగులు, కుట్టు వృత్తిలో అనుభవం ఉన్న మహిళలకు నిబంధనల ప్రకారం ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జరుగుతుందని స్పష్టం చేశారు. కుట్టు మిషన్ల వినియోగంపై అవసరమైన శిక్షణను కూడా అందిస్తామని చెప్పారు. తొలి దశలో 1.19 లక్షల మంది అర్హులకు ప్రయోజనం కల్పిస్తామన్నారు. భవిష్యత్‌లో పథకాన్ని మరింత విస్తరించి, ఎక్కువ మంది బిసి మహిళలకు లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

**ఇంటి నుంచే ఉపాధి**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు పెట్రోల్ బంకులు, ఆర్‌టిసి బస్సులు, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి ప్రభాకర్ తెలిపారు. 'ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్లు' పథకం ద్వారా బిసి మహిళలు ఇంటి నుంచే ఆదాయం పొందే అవకాశం ఏర్పడుతుందన్నారు. బిసి సంక్షేమ శాఖ ద్వారా ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి, పనులను పూర్తి చేస్తామన్నారు. కులగణన అనంతరం బిసిల అభివృద్ధికి సంబంధించిన తదుపరి కార్యాచరణను ముందుకు తీసుకెళ్తామన్నారు.

**పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ**

ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు హెచ్‌ఎండిఏ గ్రౌండ్స్ ఎదురుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల్లో బిసి ప్రజాప్రతినిధులు, బిసి సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బిర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్, కాలేరు వెంకటేశ్, బిసి సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయాదేవి, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




ఎఐఎస్‌ఎఫ్ 90 వార్షికోత్సవాలలో భాగంగా 'ప్రభుత్వ విద్య పరిరక్షణ'పై నిర్వహించిన సెమినార్‌లో ప్రసంగిస్తున్న లక్నో యూనివర్సిటీ మాజీ విసి ప్రొఫెసర్ రూప్ రేఖ వర్మ

## పుట్ట లక్ష్మణ్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర మహాసభల్లో మరోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. లక్ష్మణ్ విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూనే ఎంబిఎ, ఎల్‌ఎల్‌బి, ఎల్‌ఎల్‌ఎం పూర్తి చేశారు.కాగా, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షునిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు జాతీయ, రాష్ట్ర నాయకత్వాలకు పుట్ట లక్ష్మణ్ ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థిలోకం సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని,దేశవ్యాప్తంగా విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి, రాజ్యాం గపరమైన హక్కుల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.



## భూములకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కెపిహెచ్‌బి కాలనీలో 'క్యూర్' పరిధిలో పేదల కోసం చేపట్టనున్న 'ఇందిరమ్మ ఇండ్ల (ఎల్‌ఐజి) టవర్ల' నిర్మాణానికి గురువారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తాను ఎంపిగా పోటీ చేసినప్పుడు కూకట్‌పల్లి ప్రజలు ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉండటం, గత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని, అయితే ఇప్పుడు కూకట్‌పల్లిని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకునే అధికారం తమకు ఉందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో అభివృద్ధి చేయాలని మంత్రి శ్రీధర్ బాబును ఆదేశించినట్లు చెప్పారు.

**అప్పులు తీరుస్తూనే సంక్షేమం**

గత ప్రభుత్వం చేసిన భారీ అప్పులను చెల్లిస్తూనే మరోవైపు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, గతంలో దొడ్డు బియ్యం ఇస్తే బర్రెలకు దానాగా వేసే పరిస్థితి ఉండేదన్నారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం సహాయక సంఘాలకు రూ. 65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించినట్లు తెలిపారు. 'గతంలో డబ్బా ఇండ్లు వద్దు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పిన వాళ్లు మీలో ఒక్కరికైనా ఇచ్చారా?, పట్టణ పేదల సొంతింటి కలను నిజం చేసేందుకే మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల టవర్లకు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించాం.' అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**రాష్ట్రానికి కరువు రావాలని క్షుద్ర పూజలు చేశారు..**

సభలో సిఎం ప్రతిపక్ష బిఆర్‌ఎస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి కరువు రావాలని కోరుకుంటూ కొందరు దుర్మార్గులు క్షుద్ర పూజలు చేశారని ఆరోపించారు. అయినప్పటికీ దేవుడు తమ వైపు ఉండి వర్షాలు కురిపించాడని, మంచి మనసుతో అభివృద్ధి చేయాలన్న తమ సంకల్పానికి దేవుడి ఆశీర్వాదం ఉందన్నారు. కుటిల బుద్ధితో చేసే క్షుద్ర పూజలు తిరిగి వారినే అష్టదిగ్బంధనం చేస్తాయని, ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వరకు వెళ్లారని వ్యాఖ్యానించారు.

**వచ్చే ఏడాది ఇక్కడి నుంచే బోనాలు ఎత్తిస్తాం: మంత్రి పొంగులేటి**

హౌసింగ్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 'గత ప్రభుత్వం కమిషన్లు రావనే నెపంతో పేదలకు ఇళ్లు కట్టకుండా, కమిషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి పెట్టింది. కానీ మా ప్రభుత్వం ఎకరం రూ.200 కోట్లు విలువ చేసే హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్ల పక్కనే పేదలకు కూడా ఉచితంగా ఇందిరమ్మ టవర్లు నిర్మిస్తోంది' అని తెలిపారు. మొదటి విడతలో లక్ష ఇళ్లకు గాను ఇప్పటివరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తు గడువు ముగిశాక అందరి సమక్షంలో ఎలాంటి సిఫార్సులు లేకుండా లక్కీ డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామన్నారు.

ఈ నిర్మాణాలు పూర్తి చేసి వచ్చే ఏడాదే ఈ ఇందిరమ్మ టవర్స్ నుంచి బోనాలు ఎత్తిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్లలో బిఆర్‌ఎస్ నిర్మించిన ఇళ్ల కంటే మూడు రెట్లు ఎక్కువ ఇళ్లను నిర్మించి చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఆరికెపూడి గాంధీ, కృష్ణా రావు, హౌజింగ్ బోర్డు గౌతం, సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## బిల్లులు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు.

సమావేశాల సమయంలో ప్రతిపక్ష సభ్యులు చర్చల్లో పాల్గొనాలని స్పీకర్ బిర్లా పలుమార్లు కోరారు. అయితే ప్రతిపక్షం తమ నిరసనలు కొనసాగించడంతో సభను పదేపదే వాయిదా వేయాల్సి వచ్చింది. గురువారం కూడా ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జులై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాల్లో తొలుత నీట్ పేపర్ లీక్, అయోధ్య రామమందిర విరాళాల నిధులపై ఆరోపణలకు సంబంధించి ప్రతిపక్షం ఆందోళనలు చేపట్టింది. ఆ తర్వాత జూలై 20న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలపై పోలీసులు వ్యవహరించిన తీరుపై హోంమంత్రి అమిత్ షా సభలో సమాధానం చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. బుధవారం అమిత్ షా చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ప్రతిపక్షం లేవనెత్తే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానని చెప్పారు. విద్యార్థుల అంశంపై చర్చకు సమయం కేటాయించే విషయాన్ని ప్రతిపక్షంతో సంప్రదించాలని స్పీకర్‌ను కోరారు. ప్రజాస్వామ్యంలో సమస్యలకు పరిష్కారం సంభాషణ, చర్చల ద్వారానే సాధ్యమవుతాయని స్పీకర్‌కు రాసిన లేఖలో షా పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయాన్ని ఏ రోజూ పూర్తిగా నిర్వహించలేకపోయారు. అయినప్పటికీ మొత్తం 12 బిల్లులు ఆమోదం పొందాయి. వీటిలో రెండు బిల్లులను రాజ్యసభ ఇప్పటికే ఆమోదించింది. వీటిలో కేవలం రెండింటిపైనే చర్చ జరిగింది. మిగిలిన బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించారు. పేపర్ లీక్‌లను నిరోధించే చట్ట సవరణ బిల్లుపై మాత్రం సుమారు పది గంటలపాటు విస్తృత చర్చ జరిగింది. జాతీయ గీతం వందేమాతరాన్ని అవమానించడాన్ని శిక్షార్హమైన నేరంగా మార్చే బిల్లుపై మాత్రం తీవ్ర నినాదాల మధ్య ఇద్దరు సభ్యులు మాత్రమే మాట్లాడారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లుపై ప్రభుత్వం, ప్రతిపక్షం మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. ఈ బిల్లును బుధవారం పార్లమెంట్ సంయుక్త కమిటీకి పంపారు. బిల్లులోని నిబంధనలను సమగ్రంగా పరిశీలించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా, సమావేశాల చివరి దశలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. న్యాయమూర్తి యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణలను పరిశీలించేందుకు స్పీకర్ ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఆయనపై వచ్చిన వివరణ లేని నగదు, సాక్ష్యాలకు భంగం కలిగించడం, ఆరోపణలకు తప్పించుకునే సమాధానాలు ఇవ్వడం వంటి అభియోగాలు రుజువయ్యాయని కమిటీ తేల్చింది. ఈ నేపథ్యంలో శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్ ద్వారా న్యాయమూర్తి అభిశంసన, తొలగింపు ప్రక్రియను ప్రభుత్వం చేపట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# వయసు కాదు.. ఆటే కొలమానం

## మెస్సీకి కోహ్లీ, రోహిత్ ఏమీ తీసుపోరు



పలువురు మాజీ ఆటగాళ్లు విరాట్, రోహిత్ అనుభవం భారత్‌కు కలిసొస్తుందని వాదిస్తున్నారు. తాజాగా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సైతం ఈ వెటరన్స్‌కు వరల్డ్‌కప్ స్క్వాడ్‌లో చోటు కల్పించాలని డిమాండ్ చేశాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు ఆడడంపై ఇంకా స్పష్టత లేదు. దిగ్గజాలైన ఇద్దరిని మెగా టోర్నీలో ఆడించాలనే డిమాండ్‌లు వస్తున్నా సెలెక్టర్లు, బిసిసిఐ మాత్రం ఏదీ తేల్చట్లేదు. అయితే.. పలువురు మాజీ ఆటగాళ్లు విరాట్, రోహిత్ అనుభవం భారత్‌కు కలిసొస్తుందని వాదిస్తున్నారు. తాజాగా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సైతం ఈ వెటరన్స్‌కు వరల్డ్‌కప్‌కు స్క్వాడ్‌లో చోటు కల్పించాలని డిమాండ్ చేశాడు. భారత జట్టుకు దశాబ్దాలుగా సేవలందిస్తున్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు వన్డే వరల్డ్‌కప్ ఆడాలని భావిస్తున్నారు. వన్డేలో మాత్రమే కొనసాగుతున్న ఈ స్టార్ ద్వయం. మెగా ఈవెంట్‌తో వీడ్కోలు పలికే అవకాశాలున్నాయి. అయితే.. వయసు 35 ప్లస్ దాటడంతో వీరిని పక్కనపెట్టి.. కుర్రాళ్లను తీసుకోవాలనే ప్రయత్నాల్లో ఉన్నారు సెలెక్టర్లు. కానీ, అనుభవజ్ఞులైన ఇద్దరినీ ఆడించాలని మాజీలు అభిప్రాయపడుతుండగా.. పిటిఐ పాడ్కాస్ట్ ఇంటర్వ్యూలో హర్భజన్ సింగ్ మాట్లాడుతూ.. వరల్డ్‌కప్ కోసం ఆటగాళ్ల ఎంపికలో నిలకడ కొలమానం కావాలని అన్నాడు. 'ఆటగాళ్ల వయసు ముఖ్యం కాదు. వారు పరుగులు సాధిస్తున్నారా? నిలకడ ఉందా? అనేవి మాత్రమే చూడాలి. వచ్చే ఏడాది వరల్డ్‌కప్ సమయానికి కోహ్లీకి 39 ఏళ్లు, రోహిత్‌కు నలభై వస్తాయి. ఫిట్‌నెస్‌లో రారాజైన విరాట్ ఇప్పటికీ మైదానంలో 20 ఏళ్ల కుర్రాళ్లతో పోటీపడగలడు. లియోనల్ మెస్సీని తీసుకోండి.. అతడికి 39. అయినా.. ఫిఫా వరల్డ్‌కప్‌లో మెరిశాడు. ఫిట్‌గా ఉన్న అతడిని మైదానంలో ఐదుగురు ప్రత్యర్థులు కూడా అడ్డుకోలేరు.

వయసు కంటే నైపుణ్యమే పరిగణనలోకి తీసుకోవాలి. ఆట, ఫిట్‌నెస్‌లో కోహ్లీ, విరాట్ అదరగొడుతున్నప్పుడు.. శ్రేయాస్ అయ్యర్, యశస్వీ జైస్వాల్ అవసరం ఉండదుగా. అలానే.. పదిహేనేళ్ల వైభవ్ సూర్యవంశీ నుంచి ఎక్కువగా ఆశించడం పొరపాటే అవుతుంది. కోహ్లీ, రోహిత్కు మూడొందల మ్యాచ్‌లో అనుభవముంది. కాబట్టి.. వీరిని ఆడించడం టీమిండియాకు మంచిది' అని భజ్జీ పేర్కొన్నాడు. వచ్చే ఏడాది అక్టోబర్ 4 నుంచి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికగా వరల్డ్‌కప్ మొదలవ్వనుంది.

### క్రీడాభారత్ కోసం చేతులు కలిపిన చోప్రా, గోపిచంద్

# ఇక కోచ్‌లు, అథ్లెట్‌లకు బోలెడు అవకాశాలు



జావెలిన్ స్టార్ నీరచ్ చోప్రా, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ కొత్తగా కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. యువ క్రీడాకారులను సానబెట్టేందుకు ఇద్దరు దిగ్గజాలు చేతులు కలిపారు. జావెలిన్ స్టార్ నీరచ్ చోప్రా, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ కొత్తగా కోచింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ కోచింగ్ ఎక్సలెన్స్‌ను గురువారం చోప్రా, గోపిచంద్లు ఆవిష్కరించారు. భారత క్రీడా వ్యవస్థను పటిష్టం చేయడమే తమ ఉద్దేశమంటున్నారీ స్పోర్ట్స్ స్టార్స్. నూట నలభై కోట్లకుపైగా జనాభా ఉన్నా.. ఇప్పటికీ ఒలింపిక్స్ పతకాలను వేళ్లమీద లెక్కించాల్సిన పరిస్థితి మనదేశానిది. ప్రతిభావతులున్నా.. అవకాశాలు రాక కొందరు, సరైన మార్గ నిర్దేశం లేక మరొకొందరు ఆటల్లో రాణించలేకపోతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్ది.. క్రీడా భారత్‌ను సాకారం చేయాలనే లక్ష్యంతో ముందుకొచ్చారు పుల్లెల గోపిచంద్, నీరజ్ చోప్రాలు. ఇండియన్ స్కూల్ ఆఫ్ కోచింగ్ ఎక్సలెన్స్ ప్రారంభించిన వీరు.. క్రీడా వ్యవస్థను పటిష్టం చేయాలనుకుంటున్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ కోచింగ్ ఎక్సలెన్స్‌లో పలు అంశాలు ప్రాధాన్యమివ్వనున్నారు. కోచ్‌లకు పలు కార్యక్రమాలు, శారీరకంగా సిద్ధంగా ఉండడం, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ ఎడ్యుకేషన్, సాంకేతికత, కెరీర్ డెవలప్‌మెంట్.. వంటివి చేపట్టనున్నారు. అథ్లెట్లకు వివిధ దశల్లో అవసరమైన శిక్షణ ఇచ్చేలా కోచ్‌లకు నైపుణ్యాలు అలవర్చడం ఈ కోచింగ్ ప్రధాన ఉద్దేశాల్లో ఒకటి. భారత క్రీడాధికార సంస్థ, స్పోర్ట్స్ సమాఖ్య, సంఘాలు, హై పెర్మారెన్స్ కేంద్రాలు, విద్యా సంస్థలు, ప్రైవేట్ కోచింగ్ సంస్థలతో కలిసి ఐఎస్‌సిఇ పనిచేయనుంది. ప్రతి అథ్లెట్ కెరీర్ కోచ్‌ల సలహాలతోనే రూపొందుతుంది. క్రీడాకారులకే కాదు వ్యక్తిగతంగా ఎవరికైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. కోచ్‌లో నిరంతరం నేర్చుకునేలా, యువతలో స్ఫూర్తి రగిలించేలా ఐఎస్‌సిఇతో పాటు నీరజ్ చోప్రా ఫౌండేషన్ చేయూతనిస్తుంది'. అని నీరజ్ చోప్రా వెల్లడించాడు. 'భారతదేశం క్రీడా వ్యవస్థ పురోగతి అనేది మనం కల్పించే వనరులపై ఆధారపడి ఉంటుంది. కోచ్‌లే క్రీడాకారుల భవిష్యత్తులో కీలకం. వారు నిరంతరం నేర్చుకునేలా, తమ నైపుణ్యాలు పెంచుకునేలా మా సంస్థ సహకరిస్తుంది' అని గోపిచంద్ పేర్కొన్నాడు.

# పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## ప్రపంచంలో 'తేయాకు' ఉత్పత్తిలో ఏ దేశానిది ప్రథమ స్థానం?

- అతివాదులు నాయకుడు?— బాలగంగాధర్ తిలక్
- వందేమాతరం ఉద్యమంతో సంబంధమున్న అంశం? బెంగాల్ విభజన
- మలేరియా వ్యాధికారకం ఆడ ఎనాఫిలస్ దోమ
- ఉత్తరాఖండ్ 6వ ముఖ్యమంత్రి — బి.సి. ఖండూరి
- రక్తం ఘనీభవించుటలో ప్రధాన పాత్రధారి — రక్త ఫలకికలు
- జ్ఞానేంద్రియాలలోని కణాలు: గ్రాహకాలు
- అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సెప్టెంబర్ 8
- ప్రపంచంలో అత్యధిక వర్షపాతం సంభవించే ప్రదేశము వయలీలీ శిఖరం
- ప్రపంచంలో ఎక్కువ తపాలా కార్యాలయాలు గల దేశం ఏది? భారత్
- 'గోధుమ విప్లవం' దేనికి సంబంధించినది? సాంప్రదాయేతర ఇంధన వనరులు
- ఈగ జీవిత చరిత్రలో ఆఖరి దశ ఏది? ఇగో
- మనదేశానికి గుత్తాధిపత్యంగల పంట ఏది? జనుము
- నానాసాహెబ్ సైన్యాలకు నాయకత్వం వహించినది ఎవరు? తాంతియా తోపే
- ప్రపంచంలో 'తేయాకు' ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది? భారత్
- లీపు సంవత్సరం ఎన్ని సంవత్సరాలకు ఒకసారి వస్తుంది? 4 సంవత్సరాలు
- 'ఊదా విప్లవం' దేనికి సంబంధించినది? ఉన్ని
- పెనిసిల్లిన్ కింది దాని నుండి తయారు అవుతుంది శిలీంధ్రాలు
- కారన్ వాలీస్ చేసిన ఒక సంస్కరణ : ప్రాచీన గ్రామపంచాయితీ వ్యవస్థ రద్దు చేశాడు
- ఉత్తర రొడీషియాకు ప్రస్తుత పేరు జాంబియా
- వందేమాతరం గీత రచయిత బంకించంద్ర ఛటర్జీ
- నానాజాతి సమితి స్థాపకుడు ఎవరు? — ఉడ్రో విల్సన్
- . ప్రపంచంలో అత్యంత లవణీయత ఉన్న 'వాన్ సరస్సు ' ఏ దేశంలో ఉంది? టర్కీ
- బుద్ధుని మహాభినిష్క్రమణకు చిహ్నం? — గుర్రం
- 1857 తిరుగుబాటు ఇచ్చట ప్రారంభమైంది మీరట్



- రవీంద్రనాథ్ ఠాగూర్కు నోబెల్ బహుమతి ఈ సంవత్సరంలో లభించింది: 1913
- కమ్యూనిస్టు మేనిఫెస్టో గ్రంథకర్త: కారల్ మార్క్స్
- భారత రాజ్యాంగం అమలులోనికి వచ్చిన సంవత్సరం 1950
- అంతర్జాతీయ న్యాయస్థానములోని న్యాయమూర్తుల పదవీకాలం 9 సంవత్సరాలు
- పులులను సంరక్షించేందుకు భారత ప్రభుత్వం 'టైగర్ ప్రాజెక్టు'ను ఎప్పుడు ప్రారంభించింది? 1972
- 'Father of Modern Yoga' అని ఎవరిని పిలుస్తారు? తిరుమలై కృష్ణమాచార్యులు
- 'East Indian Association' స్థాపకుడు? దాదాభాయ్ నౌరోజీ
- 'లేటరైట్ నేలలు' అనే పదంలో లేటర్ అంటే అర్థం ఏమిటి? ఎర్రగుణం
- తెలుగులో తొలిసారిగా ఏ కావ్యానికి జ్ఞానపీఠ్ అవార్డు లభించింది? రామాయణ కల్పవృక్షం
- అలెగ్జాండర్ ఫ్లెమింగ్ కనుగొన్నది — డి.పి.టి
- ఐక్యరాజ్యసమితి ఆవిర్భావం ఈ నగరంలో జరిగింది శాన్‌ఫ్రాన్సిస్కో
- డైమండ్లో ఉన్న బంధం — సమయోజనీయ
- నీటియొక్క వాయు స్థితి — ఆవిరి
- విద్యుత్ బల్బుల తయారీలో వాడే గాజు — క్వార్ట్జ్ గాజు
- రెండవ ప్రపంచ యుద్ధంలో దారుణంగా ధ్వంసమైన నగరం: నాగసాకి
- సర్పాల పార్కు ఉండే చోటు ఏది? — గిండి
- ప్రపంచంలో 'మేకపాలు' ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది? భారత్
- రాగి నటరాజ విగ్రహం ఎక్కడ ఉంది? — చిదంబరం
- చేపల మాంసంలో లభించే విటమిన్లు ఏవి? A, D
- ఎపిలో పెసరు పంట ఏ జిల్లాలో అధికంగా పండుతుంది? తూర్పు గోదావరి
- పరోక్ష ఎన్నిక పద్ధతి ప్రకారం ఎన్నికయ్యే పదవి: రాష్ట్రపతి
- హిమాలయా నదులకు చెందనిది ? గోదావరి
- ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రత 58ఓ సెంటీగ్రేడు ఎచట నమోదు చేయబడింది అజీజియా
- కాంతి తరంగ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త: న్యూటన్

# సినిమాలు చూసేందుకే భీమవరంలో ఉన్నా !

## 'ఇరుముడి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో రవితేజ



హాలో భీమవరం. నాకు భీమవరంతో మంచి అనుబంధం ఉంది. నా జీవితంలో దాదాపు ఎనిమిది నెలల పాటు కేవలం సినిమాలు చూడటానికే భీమవరంలో ఉన్నాను. మా తాతయ్య, నానమ్మ డిఎన్ఆర్ కాలేజ్ దగ్గర ఉండేవారు. భీమవరానికి చాలా మంచి వైబ్ ఉంటుంది. మాది భీమవరం అని ఎవరైనా సరే గర్వంగా చెప్పుకుంటారు. ఇక్కడి ఫుడ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నెక్ట్స్ సంక్రాంతికి కోడిపందాలులో కలుద్దాం. మీతో పాటు ట్రైలర్ నేను కూడా ఈ రోజే చూశాను. మీ అందరికీ ట్రైలర్ నచ్చడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమా సక్సెస్ అవుతుందని నమ్మకంగా ఉంది. ఈ సినిమా మీ అందరికీ కచ్చితంగా నచ్చుతుంది. ఈ వైబ్‌ను ఇలాగే కంటిన్యూ చేద్దాం అని భీమవరంలో ఘనంగా జరిగిన ఇరుముడి ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రవితేజ అన్నారు. రవితేజ తాజాగా నటించిన ఇరుముడి సినిమా ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం భీమవరం నిర్వహించారు. ఇరుముడి' చిత్రం 21న థియేటర్లలో విడుదల కానుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై తెలుగు, తమిళ భాషలలో నిర్మించారు. ట్రైలర్‌తో సినిమా కథలోని ప్రధాన అంశంపై స్పష్టత వచ్చింది. రవితేజ ఇందులో మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తిగా కనిపించారు. భార్య, కూతురిని ఎంతో ప్రేమగా చూసుకునే వ్యక్తి. తన కుటుంబానికే కాదు.. ఊరిలోని ప్రతి అమ్మాయిని కూడా తన కూతురిలాగే భావిస్తాడు. వాళ్లకు ఏదైనా సమస్య వస్తే మాత్రం ఆయనలోని రక్షణ భావం కోపంగా మారుతుంది. ఈ పాత్రకు మరో కోణం ఉంది. రవితేజ పాత్రకు మద్యపానం అలవాటు ఉంటుంది. అదే సమయంలో ప్రతి ఏడాది అయ్యప్ప మాల వేసుకుంటాడు. మాల ధరించిన సమయంలో పూర్తిగా ప్రశాంతమైన, భిన్నమైన వ్యక్తిగా మారతాడు. ఇలాంటి విభిన్నమైన వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి జీవితంలోకి వరుసగా అమ్మాయిల హత్యలు రావడంతో.. అసలు ఆ హత్యలకు కారణం ఎవరు? వాటిని అతను ఎలా అడ్డుకున్నాడు? అనేదే కథలో కీలకంగా కనిపిస్తోంది. ఈ చిత్రంలో డైరెక్టర్ శివ నిర్వాణ, డిప్యూటి స్పికర్ రఘురామకృష్ణంరాజు, హీరోయిన్ ప్రియ భవానీ శంకర్, నిశాంత్ ,బేబీ నక్షత్ర, నిర్మాత రవి శంకర్ పాల్గొన్నారు.

# ఫాంటసీ థ్రిల్లర్‌గా 'కెరూబ్'




విహాన్ కార్తీక్, దివ్య విశ్వకర్మ హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్న సినిమా 'కెరూబ్'. ఈ చిత్రాన్ని ఖుషి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ బాలు బల్లెకారి నిర్మిస్తున్నారు. ఫాంటసీ థ్రిల్లర్ కథతో దర్శకుడు ఎం జె నాయుడు (జీవన్) రూపొందిస్తున్నారు. ఫస్ట్ కాపీ రెడీ చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సెప్టెంబర్‌లో 'కెరూబ్' చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు దర్శక నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా రిలీజ్ చేసిన 'కెరూబ్' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ వైవిధ్యంగా కనిపిస్తోంది. ఈ పోస్టర్‌లో జలపాతంతో కూడిన ఆహ్లాదకరమైన ప్రకృతిలో హీరో వేణువు వాయిస్తున్న స్టిల్ తో ఫస్ట్ లుక్ పోస్టర్ చూడగానే ఆకట్టుకుంటోంది. ఒక సరికొత్త ఫాంటసీ థ్రిల్లర్ కథను 'కెరూబ్' చిత్రంలో చూడబోతున్నామనే ఫీల్ ప్రేక్షకుల్లో కలుగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ కొక్కుల ప్రసాద్, డిఒపి రమేష్ తోకల, మ్యూజిక్ సత్య రాధాకృష్ణ.

లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ నిర్మిస్తున్న 'సిగ్మా' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దర్శకుడిగా జేసన్ సంజయ్ అరంగేట్రం చేస్తున్న ఈ చిత్రంలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ సింగిల్ సిగ్మా స్టయిల్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఓలమ్మో వగలాడి సాంగ్ రిలీజ్ చేశారు. తమన్ ఎనర్జిటిక్ నెంబర్‌ని కంపోజ్ చేశారు. యువన్ శంకర్ రాజా, సంజనా దివాకర్ కల్మంజే కలిసి ఆలపించిన ఈ పాట విన్న వెంటనే కనెక్ట్ అవుతుంది. కృష్ణ చైతన్య సాహిత్యం క్యాచిగా వుంది. ఈ పాటలో సందీప్ కిషన్, ఫారియా అబ్దుల్లా మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. ఇద్దరి మధ్య ఉన్న ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ పాటకు మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. మెలోడీతో పాటు ఎనర్జిటిక్ బిట్‌తో సాగుతున్న ఈ పాట సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు థాసన్, యోగ్ జాపీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి థమన్ ఎస్ సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కె.ఎల్ ఎడిటింగ్, హరిహర సుధన్ విజువల్ ఎఫెకట్స్ సూపర్వైజర్‌గా పనిచేస్తున్నారు.

## 'ఓలమ్మో వగలాడి' పాట రిలీజ్



# రీల్



## బైక్ మీదొస్తుంటే నన్ను అందరూ 'ఫాలో' అయ్యారు !

### 'చిట్ చాట్' లో 'అగధ' హీరోయిన్ కామాక్షి భాస్కర్ల

పొలిమేర' సినిమాతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న కామాక్షి భాస్కర్ల ఇప్పుడు 'అగాధ'లో నటించింది. ప్రముఖ నిర్మాత ఎం ఎస్ రాజు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యలో కామాక్షి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. శ్యాం ప్రసాద్ రెడ్డి అంత పెద్ద నిర్మాత నన్ను అనుష్కతో పోల్చడం ఆనందంగా అనిపించింది. ఆయన అనుష్కతో పోల్చడం అనేది నన్ను మరింత బాధ్యతగా ఉండేలా చేస్తుంది 'అగధ'లో ప్రతీది కూడా రాజు విజన్ అని చెప్పుకోవచ్చు. ప్రతీది డిఫరెంట్‌గా ఉండాలని ముందే ఆయన అనుకున్నారు. అలాంటి చీరకట్టులో నాకు కాస్త ఇబ్బంది అనిపించింది. 'అగధ'లోని యాక్షన్ సీక్వెన్స్ కోసం మేం ముందుగానే వర్క్ షాప్స్ చేశాం. రిహార్సల్స్ చేశాం. అయితే సెట్‌లో చిన్న చిన్న ఇబ్బందులు సహజం. కానీ టీం అంతా కలిసి శ్రమించడం వల్ల అవుట్ పుట్ బాగా వచ్చింది. మహాదేవి పాత్ర కోసం మారేందుకు నాకు టైం పట్టింది. కామాక్షిగా నన్ను నేను పక్కనపెట్టి, నా ప్రిన్సిపల్స్ పక్కన పెట్టి ఆ పాత్ర కోసం మారడానికి ఇబ్బంది అనిపించింది. దేవుడి అనుగ్రహంతో పుట్టే పాత్ర అది. బుద్ధిజం పుస్తకాల్ని చదివాను. బ్లాక్ మ్యాజిక్ గురించి తెలుసుకున్నాను. ప్రతీ ముద్ర గురించి, ఆ పాత్ర నడవడిక గురించి అర్థం చేసుకుని నటించాను. సినిమాలో ఎక్కడా కూడా కామాక్షి కనిపించకూడదని జాగ్రత్తలు తీసుకున్నాను. నాకు ఎం.ఎస్. రాజు సినిమాలు అంటే చాలా ఇష్టం. ఆయన తీసిన వాటిల్లో 'మనసంతా నువ్వే' నాకు ఆల్ టైం ఫేవరేట్. ఆయన 'అగధ' కోసం ఫోన్ చేయడంతో చాలా సంతోషంగా అనిపించింది. నా 'పొలిమేర' చూశానని ఆయన అన్నారు. ఆయన ప్రతీ సినిమాలోని ప్రతీ ఆర్టిస్ట్ పవర్ ఫుల్‌గానే కనిపిస్తారు. మేల్ చేసినప్పుడు మేల్ సెంట్రిక్ సినిమాలు అనరు. కానీ ఫీమేల్ చేస్తే మాత్రం ఫీమేల్ సెంట్రిక్ సినిమా అంటారు. ఇంట్లో మహిళలు మల్టీపుల్ టాస్క్‌లు చేస్తుంటారు. స్క్రీన్ మీద ఫీమేల్ కారెక్టర్స్ ఇండిపెండెంట్గా ఎందుకు ఉండకూడదు అని అనుకునేదాన్ని. 2019 నుంచి సరైన అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉన్నాను. చిన్న చిన్న పాత్రల కోసం ఎన్నో ఆడిషన్స్ ఇచ్చాను. నేను సినిమాల కోసం ఎంతో కష్టపడ్డాను. ఇప్పటికీ నాకు కారు లేదు. బైక్ మీదే వస్తాను. ఇప్పుడు అందరూ రోడ్ల మీద గుర్తు పట్టి నన్ను ఫాలో అవుతున్నారు. ప్రొడక్షన్ వాళ్లు ఇచ్చే వెహికల్ కూడా నాకు కొత్తగా అనిపిస్తుంది. మాది మిడిల్ క్లాస్ కావడంతో మాకు కారు పెద్ద విషయం. సత్యం రాజేష్ పక్కన చేసిందా? అయితే వద్దు అని నా ముందే చాలా మంది అన్నారు. కొన్ని సినిమాల్ని డబ్బుల కోసం చేస్తాం. ఇంకొన్ని మనల్ని మనం సంతృప్తి పర్చుకునేందుకు చేస్తుంటాం. చిన్న అవకాశం, పెద్ద అవకాశం అని నేను చూడను. వచ్చిన అవకాశాల్లో నాకు నచ్చిన పాత్రను ఎంచుకుంటాను. నెకట్స్ నేను ఒ లవ్ స్టోరీకి సైన్ చేశాను. 'పొలిమేర', 'అగధ' వంటి చిత్రాలకే సూట్ అవుతాను అని అనుకునే విషయాన్ని నేను బ్రేక్ చేస్తాను. నాకు గ్లామర్, క్వీన్ వంటి పాత్రల కన్నా.. సాధారణ మహిళా పాత్రలే ఇష్టం.డాక్టర్ వృత్తికి కాస్త గ్యాప్ ఇచ్చాను. నేను అక్కడ ఉండే కంటే ఇక్కడే ఇండస్ట్రీలో ఉండాలని అనుకుంటున్నాను. నాలాంటి సాధారణ మహిళల్ని రిప్రజెంట్ చేయాలని, తెరపై వారందరినీ చూపించాలని అనుకుంటున్నాను. ఇంత వరకు నేను అసిస్టెంట్ డైరెక్టర్గా, అసోసియేట్ డైరెక్టర్గా, రైటింగ్ టీంలోనూ పని చేశాను. నాకు దర్శకత్వం వహించాలనే ఆలోచన కూడా ఉంది. కానీ ఇప్పుడు కాదు. దానికి ఇంకా చాలా టైం పడుతుంది.

# కిమ్స్ ఆసుపత్రి నుంచి ఎన్‌టిఆర్ డిశ్చార్జ్




జూనియర్ ఎన్‌టిఆర్ రైట్ హ్యాండ్ కు జరిగిన ఆపరేషన్ సక్సెస్ ఫుల్ అయింది. హైదరాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో జూనియర్ ఎన్‌టిఆర్‌కు ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ విజయవంతమైన నేపథ్యంలో బుధవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో జూనియర్ ఎన్‌టిఆర్ నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ లోనే యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పుడు భుజానికి గాయమైంది. దీంతో కిమ్స్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. కిమ్స్ ఆసుపత్రి సిఎండి డాక్టర్ భాస్కర్ రావు నేతృత్వంలో డాక్టర్ పూర్ణచంద్ర తేజస్వి, డాక్టర్ నితిన్ బెజ్జంకి బృందం జూనియర్ ఎన్‌టిఆర్‌కు ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ విజవంతమైందని, ఎన్‌టిఆర్ సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ భాస్కర్ రావు విడుదల చేసిన హెల్త్ బులిటెన్ లో పేర్కొన్నారు.



## హామీల కమిటీ చైర్మన్‌గా శంకర్‌నాయక్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ హామీల కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ శాసన మండలిలో జరిగిన హామీల కమిటీ 2026/27 ప్రాథమిక సమావేశంలో చైర్మన్‌గా పాల్గొని కమిటీ భవిష్యత్ కార్యకలాపాలపై సమీక్షించారు. ప్రభుత్వం శాసనసభలో ఇచ్చిన హామీల అమలును సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ, ప్రజలకు అందించిన వాగ్దానాలు సకాలంలో నెరవేరేలా ప్రత్యేక కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, కమిటీ సభ్యులు భాను ప్రసాద్, రవీందర్, మధుసూదన్, లెజిస్లేటివ్ సెక్రటేరియట్ అధికారులు నరసింహాచారి, తిరుపతి కెతావత్ శంకర్‌నాయక్‌కు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, కమిటీ సభ్యులు భాను ప్రసాద్, రవీందర్, మధుసూదన్, లెజిస్లేటివ్ సెక్రటేరియట్ అధికారులు నరసింహాచారి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ సంబంధం అడ్డు తొలగించుకోవాలనే...

### భర్తభార్యలను చంపిన కానిస్టేబుల్ షరీఫ్?



**ప్రజాపక్షం/మోతె :** మండల కేంద్రంలో మంగళవారం రాత్రి సుమారు 3 గంటల సమయంలో జంట హత్యలు చేసిన ఘటన అందరికి తెలిసిందే. మండల పరిధిలోని భీక్యతండ గ్రామానికి చెందిన హలావత్ నాగు బుబాలు భార్య భర్తలు కాగా మండల కేంద్రంలో వ్యవసాయ చేసుకుంటూ సుమారు 3 సంవత్సరాల నుండి జీవనం సాగిస్తున్నారు. ఈ తరుణంలో మండల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న షరీఫ్ గత కొంతకాలంగా వివాహం కుదరడం జరిగిందని తెలిసిన సదరు మహిళ తన పరిస్థితి ఏమిటని నిలదీయడంతో అడ్డు తొలగించుకునేందుకు భర్త భార్యలను చంపినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. జరిగిన ఘటనపై పోలీస్ ఉన్నత అధికారులు విచారణ చేపట్టడంతో సుమారు 5 మంది ఈ ఘటనలో పాల్గొన్నట్లు సమాచారం.

## మహిళా సంఘాలకు నా మిల్లు అప్పగించేందుకు సిద్ధం : వట్టె



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మహిళా సంఘాలకు నా మిల్లు అప్పగించేందుకు సిద్ధమని వజ్రా రైస్ మిల్లు నిర్వాహకులు వట్టె జానయ్య యాదవ్ ప్రకటించారు. గురువారం మండల పరిధిలోని వజ్రా రైస్ మిల్లు ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వజ్రా రైస్ మిల్లు ప్రారంభమైనప్పటి నుంచి సిఎంఆర్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి ఒక్కసారి కూడా నోటీసు తీసుకునే పరిస్థితి రాకుండానే చెల్లింపులు పూర్తి చేస్తూ వచ్చామన్నారు. అయినప్పటికి రాజకీయ ఒత్తిళ్లకు లోనైన అధికారులు తమ మిల్లును లక్ష్యంగా చేసుకుని దాడులు చేశారని ఆరోపించారు. రైస్ మిల్లుల వ్యవహారంలో వర్తించాల్సిన చట్టపరమైన నిబంధనలకు భిన్నంగా అనేక క్రిమినల్ కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వంతో సిఎంఆర్‌కు సంబంధించి ఒప్పందం చేసుకున్న వ్యక్తులపైనే చట్టపరమైన బాధ్యత ఉంటుందన్నారు. ఏదైనా ఉల్లంఘన జరిగితే వారిపైనే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. కానీ అందుకు భిన్నంగా తన కుటుంబ సభ్యులను కూడా కేసుల్లో చేర్చారని ఆరోపించారు. కర్ణాటకలో ఎంబిబిఎస్ చదువుతున్న తన చిన్న కుమారుడిని సైతం అరెస్టు చేయడం రాజకీయ కక్ష, కుట్రలో భాగమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రైస్ ఇండస్ట్రీని నేరస్తులుగా చూడొద్దని, రాష్ట్రంలో రైస్ మిల్లింగ్ పరిశ్రమను, మిల్లర్లను నేరస్తులుగా చిత్రీకరించే విధానం సరికాదని హితవు పలికారు.

## గిరిజనుల ఐక్యతకు 'తీజ్' ప్రతీక

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తీజ్ వేడుకలు గిరిజనుల ఐక్యతకు ప్రతీక అని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. మండలంలోని ఐలాపురం గ్రామంలో గిరిజనులు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో గురువారం శాసనసభ్యులు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు, యువతీ యువకులు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించిన సంప్రదాయ తీజ్ వేడుకలను ప్రత్యక్షంగా తిలకించారు. తరతరాలుగా వస్తున్న గిరిజనుల విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉందని ఆకాంక్షించారు. ఈ పండుగ వేడుకల సందర్భంగా ఐలాపురం గ్రామ ప్రజలకు, గిరిజన సోదర సోదరీమణులకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిజన సంస్కృతికి తగిన గుర్తింపు, గౌరవం ఎల్లప్పుడూ లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన పెద్దలు, మహిళలు, యువత, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా బోర్లు వేస్తే రూ. లక్ష జరిమానా

**ప్రజాపక్షం/త్రిపురారం:** రెవిన్యూ శాఖ అనుమతులు లేకుండా పొలాలు, నివాసాలలో బోర్లు వేస్తే లక్ష జరిమానా విధిస్తామని త్రిపురారం తహసిల్దార్ గాజుల ప్రమీల అన్నారు. గురువారం మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం జిపిఓలు,రెవిన్యూ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాహసిల్దార్ గాజుల ప్రమీల మాట్లాడుతూ సర్ ప్రక్రియను పరిశీలన చేసుకోవాలన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లు సకాలంలో అందే విధంగా జిపిఓలు చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామస్థాయిలోపర్యటించి బోర్లు వేసి ప్రాంతాలను పరిశీలించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోష,జిపిఓలు సైదులు,రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువతే దేశ రాజకీయాలను శాసించే శక్తి

### హక్కుల కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలి

### పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని దివిస్‌పై పోరాటానికి సిద్ధం కావాలి: ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు



**ప్రజాపక్షం/మునుగోడు :** యువతే దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి అని,నిరుద్యోగం,ఉద్యోగాల భర్తీ, విద్య, ఉపాధి తదితర సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలనే డిమాండ్‌తో త్వరలో చలో దివిస్ కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించారు.మునుగోడు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఏఐవైఎఫ్ నల్లగొండ 15వ జిల్లా ప్రతినిధుల మహాసభలకు యువత భారీగా హాజరయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారుయువత జెండాలు చేతబూని విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధన కోసం పోరాడుతామని నినదించారు. ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలతో ప్రదర్శన సాగింది.అనంతరం మహాసభల సూచికగా ఏఐవైఎఫ్ జెండాను కల్లూరు ధర్మేంద్ర ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా దేశ యువతను మోసం చేసిందని విమర్శించారు.ఉన్నత విద్య పూర్తి చేసిన యువత ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.యువత ఓటు వేసే వయసుకే పరిమితం కాకుండా దేశ రాజకీయాలను మార్చే శక్తిగా ఎదగాలని అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్య,వైద్యం వ్యాపారమయం కావడంతో పేద,మధ్యతరగతి ప్రజలకు భారంగా మారాయని,ప్రతి ఒక్కరికీ ఉచితంగా నాణ్యమైన విద్య,వైద్యం అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మునుగోడు నియోజకవర్గంలో రసాయన పరిశ్రమలు పెరుగుతున్నా స్థానిక యువతకు ఆశించిన స్థాయిలో ఉద్యోగాలు దక్కడం లేదని సత్యం ఆరోపించారు.పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులకు ఉద్యోగాలు కాలుష్యానికి అడ్డుకట్ట వేయాలనే డిమాండ్‌తో చేపట్టే చలో దివిస్ కార్యక్రమానికి యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

**జెన్ జీ పోరాట స్ఫూర్తితో బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను సాగనంపాలి : కల్లూరు ధర్మేంద్ర**

ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ జెన్‌జీ యువత పోరాట స్ఫూర్తితో కేంద్రంలోని బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి,యువత హక్కుల సాధన కోసం సమరశీల పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ యువతపై కపట ప్రేమను ప్రదర్శిస్తోందని విమర్శించారు.యువతకు ఉపాధి, నాణ్యమైన విద్య,సామాజిక భద్రత, ప్రజాస్వామ్య హక్కులు కల్పించే విధానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. దేశంలో ఇటీవల విద్యార్థులు,యువత తమ భవిష్యత్తు కోసం సాగించిన పోరాటాలు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. ఉద్యోగం, విద్య, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కులు, శా)య దృక్పథం కోసం యువత ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.

ఏఐవైఎఫ్ నాయకులు తీర్పారీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ, ఉపాధి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న యువతకు వెంటనే రుణ సదుపాయం కల్పించాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 8,9,10 తేదీల్లో యాదగిరిగుట్టలో నిర్వహించనున్న నేపథ్యంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురిజ రామచంద్రం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. అంజాచారి, నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్, నల్పరాజు సతీష్‌కుమార్, బీమనపల్లి రమేష్, బుర్ర శేఖర్, జిల్లా యాదగిరి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి. జగన్, జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగారావు, బి.లాలయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు ఎనమల్ల నవీన్, ఎషమోని మల్లేష్, గడ్డం నవీన్, ఎస్.కె. షరీఫ్, పగిళ్ల రమేష్, కట్ట దశరథ,కట్కూరి లింగస్వామి, గొప్పగోని ఉదయ్, మాదగోని అశోక్, తీర్పారీ సైదులు, శ్రీపతి రవీందర్, సూరిగి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్‌టిలకు అన్యాయం జరగనివ్వం

### రాష్ట్ర ఎస్సీ, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ప్రజాపక్షం/సూర్యాపేట :** జిల్లాలో ఎస్సి, ఎస్‌టి వర్గాల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధితులకు అన్ని వేళలా అండగా ఉంటామని రాష్ట్ర ఎస్సి, ఎస్‌టి కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమీషన్ సభ్యులు, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పి నరసింహ, నియోజక వర్గ ప్రజాప్రతినిధులు, జిల్లాస్థాయి అధికారులతో కలిసి జిల్లాలోని ఎస్సి, ఎస్‌టిలకు సంబంధించిన భూముల సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలలో ఎస్సి, ఎస్‌టి రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. వివిధ అంశాలపై సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సిలకై వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న సబ్ ప్లాన్ నిధులు పక్కాగా వినియోగించాలని, నిధులు దారి మళ్లించవద్దని, ఒకవేళ దారి మళ్లిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎక్కడైనా సబ్‌ప్లాన్ నిధులు మిగిలిపోతే తిరిగి ఎస్సి, ఎస్‌టి కాలనీలో రోడ్లు, ఇతర పనులు చేపట్టాలన్నారు. ఉద్యోగాలు, ప్రమోషన్లలో ఎస్సి, ఎస్‌టిలకు తప్పనిసరిగా ఆర్‌ఓఆర్ అమలు చేయాలని ఈ విషయంలో అన్యాయం జరిగితే కమీషన్ ఊరుకోదని హెచ్చరించారు. ఎంపి నిధులు నియోజక వర్గ అభివృద్ధి నిధులు, ఎస్‌డిఎఫ్ నిధులను రిజర్వేషన్ ప్రకారం కేటాయించాలన్నారు. జిల్లాలో ఎస్సి, ఎస్‌టిలపై దాడులకు సంబంధించి కోర్టు కేసుల జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. శిక్షల శాతాన్ని పెంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించారు. మున్సిపాలిటిలు, గ్రామ పంచాయితీలలో ఎక్కువ మంది ఎస్సి, ఎస్‌టిలే పనిచేస్తున్నందున పారిశుధ్య కార్మికులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా ప్రతి నెల చివరి వారంలో తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని ఎస్పికి సూచించారు. ఈ సమావేశాలకు స్థానిక ఎస్ఐ, తహశీల్దార్లతో పాటు శాఖాపరమైన అధికారులు తప్పకు హాజరుకావాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎస్సి, ఎస్‌టిలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సి, ఎస్‌టి సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ చేపట్టిన ప్రజెంటేషన్ విధానం బ్రహ్మాండంగా ఉందని ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ప్రతి అంశంపై పూర్తి సమాచారంతో ప్రణాళికలు సిద్ధం చేశారని కొనియాడారు. కేసుల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్పి వినూత్నంగా ముందడుగు వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సి, ఎస్‌టి కమిషన్ మెంబర్స్ లక్ష్మి నారాయణ, రాంబాబు నాయక్, శంకర్, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, ఎస్సి డిడి లత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## యాదాద్రి భువనగిరి జిల్లాలో విషాదం

### విద్యార్థిపై భారీ వేపచెట్టు కొమ్మకూలి మృతి

### చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి ఆర్థిక సాయం : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని బాగాయత్ పాఠశాల ఆవరణలో గురువారం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పాఠశాల మైదానంలో విద్యార్థులు ఆడుకుంటుండగా ఆవరణలోని భారీ వేపచెట్టు కొమ్మ ఒక్కసారిగా విద్యార్థులపై కూలిపోయింది. ఈ ప్రమాదంలో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఈ ఘటనలో హలిమా అనే విద్యార్థిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందింది. ఘటన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బీబీనగర్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న గాయపడిన విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. మృతి చెందిన విద్యార్థిని హలిమా కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. అలాగే గాయపడిన పలువురు విద్యార్థులకు చికిత్స నిమిత్తం ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులపై భారీ చెట్టు కొమ్మ కూలి ప్రాణ నష్టం జరగడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థిని హలిమా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన విద్యార్థులు త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి పాఠశాలకు రావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## వరి వేసుకోకండి.. నష్టపోకండి

### జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ రైతులకు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/తిప్పర్తి :** ఈ ఖరీఫ్ సీజన్ సమయం ముగిసినందున జిల్లాలోని రైతులు ఎట్టి పరిస్థితులలో వరి వేయవద్దని,వరి వేస్తే నష్టపోవాల్సి వస్తుందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.వ్యవసాయ అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో ప్రతి రైతు పొలం వద్దకు వెళ్లి రైతులు వరి వేయకుండా అవగాహన కల్పించాలన్నారు.వరి పంట వేసేందుకు పెట్టే పెట్టుబడి,నీటి లభ్యత,వర్షాలు,భూగర్భ జలాలు,కూలీల పెట్టుబడి అన్నింటిని రైతులకు వివరించి చెప్పి వరి పంట జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ ,తిప్పర్తి మండల కేంద్రం శివారులో వరి సాగుకు భూములు సిద్ధం చేసుకుంటున్న రైతులు మోహన్,పరశురాం,ఖాదర్ తదితరులతో మాట్లాడారు.వరి పంటకు సాగునీటి అవకాశాలే లేవని,అలాంటప్పుడు వరి ఎందుకు వేస్తున్నారని జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. బలవంతంగా వరి సాగు చేస్తే నష్ట పోవలసి వస్తుందని రైతులతో చెప్పారు.ఆరతడి పంటలు వేసుకుంటే నష్టం లేకుండా,ఆదాయం వస్తుందని తెలియజేస్తూఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు.ఎల్ నినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం వర్షాలు కురిసే అవకాశం లేదని,వచ్చే ఖరీఫ్ సీజన్ వరకు వర్షాలు కురిసే అవకాశం లేనందున ప్రస్తుతం వరి వేసుకునేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని, అంతేకాక ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు వచ్చే అవకాశం లేదని, శ్రీశైలం,నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుండి కూడా సాగునీరు రాదని, వర్షం లేకపోవడం, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు తగ్గిపోయిందని తెలిపారు.వ్యవసాయ సహాయ సంచాలకులు విజయేందర్ రెడ్డి, సన్నీ రాజ్, గిరిరాజు,ఏవో శ్రీనివాస్,ఏఈఓ సంతోషి ఉన్నారు.

## బునాదిగాని కాలువ నీటిని విడుదల



**ప్రజాపక్షం/బీబీనగర్ :** భువనగిరి నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ బునాదిగాని కాలువపై చేపట్టిన కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తికావడంతో గురువారం బీబీనగర్ మండలం మక్త అనంతారం వద్ద బునాదిగాని కాలువ నీటిని భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు సాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాలువల అభివృద్ధి, ఆధునీకరణ, అవసరమైన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని అన్నారు. బునాదిగాని కాలువ పరిధిలో నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలిగించే ప్రాంతాలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగానే కొత్త బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులను పూర్తి చేసి, కాలువ నీటిని విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ పొట్టోల శ్యామ్ గౌడ్, సీనియర్ నాయకులు పంజాల రామాంజనేయులు, గోలి పింగల్ రెడ్డి, గోలి నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురకంటి సత్తిరెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్, వాకిటి చంద్రశేఖర్ రెడ్డి పిఎసిఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఉద్యమాలు మరింత ఉధృతం



సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** ప్రజా సమస్యలపై సిపిఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని,రైతులు,కార్మికులు,చేనేత కార్మికులు, పేదల హక్కుల కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ తెలిపారు. మండలంలోని పల్లెపహాడ్ లో గురువారం నిర్వహించిన జీపు జాతా చలో ఢిల్లీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అర్హులందరికీ సబ్సిడీలు వెంటనే అందించాలని,గీత,చేనేత కార్మికులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. చేనేత కార్మిక సంఘ అధ్యక్షులు వనం వాసుదేవులు మాట్లాడుతూ నూలు పోగుల కష్టం... నేతన్న కన్నీళ్లు చేతి మగ్గమే ఊపిరిగా బతుకుతున్న వేలాది చేనేత కుటుంబాల ఆవేదన బయటపడింది. ప్రభుత్వ విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చేనేత కార్మికులకు పెన్షన్ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్,ఎండి అక్బర్, పల్లెపహాడ్ శాఖ కార్యదర్శి నరసింహ,చిరబోయిన మల్లయ్య,పెండ్యాల ఎల్లయ్య,పులుసాని అనంతరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,సీలోజి వెంకటయ్య, జిల్లా దశరథ తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ప్రజా చైతన్య యాత్ర : పబ్బు

**ప్రజాపక్షం/కనగల్:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, దేశ రాజకీయాల్లో మార్పు రావాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం కనగల్ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వ హించారు. అంతకుముందు పొనుగోడు,కురంపల్లి, ఎడవల్లి, ధర్వేశిపురం,పర్వతగిరి తదితర గ్రామాల్లో ప్రచార యాత్ర నిర్వహిస్తూ ప్రజలకు ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాత్రను ప్రారంభించిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని పబ్బు వీరస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ,జోగు సురేందర్,గట్టిగుండ్ల నరసింహ,దోటి అక్కలయ్య, జోగు కృష్ణయ్య,జోగు గిరి,చిలక రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.



## బుల్లెట్ ట్రైన్ కోసం కదం తొక్కిన విద్యార్థులు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జాతీయ రహదారి 65 సమాంతర బుల్లెట్ ట్రైన్ కారిడార్ సాధన కోసం సూర్యాపేటలో విద్యార్థి లోకం కదం తొక్కారు. గురువారం పట్టణంలోని ప్రధాన కూడళ్ళు విద్యార్థులు నిరసనలతో మారుమోగాయి. పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డు, కొత్త బస్టాండ్ ఏరియా, పిఎస్ఆర్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, వాణిజ్య భవన్ సెంటర్‌లో వేలాది మంది విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘం నాయకులు పుల్లూరి సింహాద్రి, ధనియాకుల శ్రీకాంత్ వర్మ, భాషపంగు సునీల్, ఎర్ర అఖిల్, బొమ్మగాని వినయ్, భారీ అశోక్, పోలోజు మహేష్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పాల్గొన్నారు.



## ఎంజిఎం సూపరింటెండెంట్‌కు ఎఐటియుసి నాయకుల అభినందన



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ ఎంజీఎం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కాటం రామ్‌కుమార్ రెడ్డిని గురువారం మధ్యాహ్నం ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా సమితి నాయకుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనకు పూల బోకే అందజేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి యాదవ్, శ్రమశక్తి అవార్డు గ్రహీత పంకేర్ల కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణ ప్రాంతానికే తలమానికమైన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి నిత్యం వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు, నిరుపేద కార్మికులు వైద్య సేవల కోసం వస్తుంటారని పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి అత్యుత్తమ వైద్య సేవలు, సకాలంలో ఉచిత మందులు, మౌలిక వసతులు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూపరింటెండెంట్ ను కోరారు.ఆసుపత్రి అభివృద్ధితో పాటు అక్కడ నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది, పేషెంట్ కేర్ నర్సింగ్, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం, వేతన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించి, కాలపరిమితిలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.ఏఐటీయూసీ నాయకుల శుభాకాంక్షలకు ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ కాటం రామ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, శ్రమ శక్తి అవార్డు గ్రహీత పంకేర్ల కుమారస్వామి యాదవ్,నాయకులు రామ రాజేష్ ఖన్నా, ఇతర కార్మిక సంఘ నాయకులు, ఆసుపత్రి వర్కర్ల యూనియన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వెదురు సాగు చేపట్టి అదనపు ఆదాయం పొందాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** వెదురు సాగు చేపట్టి అదనపు ఆదాయం పొందాలని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. గురువారం మండలంలోని సూరారం గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెంచుతున్న వెదురు మొక్కల నర్సరీని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు, నర్సరీలో మొక్కల పెంపకం, నిర్వహణ, పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కల వివరాలను సంబందిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు సాగు తక్కువ నిర్వహణ ఖర్చుతో దీర్ఘకాలిక లాభాలను అందించే ఆదాయ వనరుగా నిలుస్తుందని తెలిపారు. రైతులు వెదురు సాగును ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా చేపట్టి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లాలోని ఆరు మండలాల్లో వెదురు పెంపకం కొనసాగుతోందని సుమారు 70 వెల వెదురు మొక్కలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 1200 మంది రైతులను వెదురు సాగుకోసం గుర్తించినట్లు, 15 గుంటల భూమికి ఒక్కో రైతుకు 60 మొక్కలను ఉచితంగా అందజేయనున్నట్లు వల్లడించారు. వెదురు సాగు చేపట్టిన రైతులకు వివిజి రాంజీ పథకం ద్వారా నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం చెల్లించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థా నిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ,శిక్ష ణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి బాలకృష్ణ, రవిందర్, తాండ్ర సురేష్, సర్పంచ్, గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బ ంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నార్కోటిక్ డాగ్‌తో కిరాణం షాపులలో విస్తృత తనిఖీలు

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** పసర గ్రామంలోని పలు కిరాణాం షాపులలో పై అధికారుల ఆదేశాల మేరకు పసర పోలీస్ స్టేషన్ సెకండ్ ఎస్ఐ ఎర్రయ్య ఆధ్వరంలో గురువారం నార్కోటిక్ డాగ్ సహాయంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు మత్తు పదార్థాలు గుట్కా అంబర్ తదితరాలను విక్రయిస్తున్నారన్న సమాచారంతో గ్రామంలోని పలు కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు అనంతరం పసరలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోనూ నార్కోటిక్ డాగ్ సహాయంతో తనిఖీలు చేపట్టారు ఈ సందర్భంగా ఎస్ఐ ఎర్రయ్య విద్యార్థులకు గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు నార్కోటిక్ డాగ్ లు మత్తు పదార్థాలను గుర్తించే విధానం వాటి పనితీరును విద్యార్థులకు ఉపాధ్యాయులకు వివరించారు పాఠశాల ఆవరణలో ఆకతాయిల మత్తు పదార్థాలను సేవిస్తూ కనిపించినా మత్తు పదార్థాల విక్రయాలు లేదా అనుమానిస్పదా కార్యకలాపాలు గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ ఎర్రయ్య సూచించారు యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులు తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

## పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు: నాగసాగర్



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** పాఠశాలల్లో సమస్యల పరిశ్కారానికి చర్యలు తీసుకుని నాణ్యమైన భోజన వసతులు కల్పించాలని జిల్లా గిరిజన శాఖ అధికారి నాగసాగర్ అన్నారు. గురువారం మేడిపల్లి మహాదేవపూర్,కాళేశ్వరం ఆశ్రమ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వసతులు, పాఠశాలల నిర్వహణ పరిశీలించారు.అనంతరం బాలికల పాఠశాలలో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం,భోజన వసతులు,పాఠశాలలో ఎదురౌతున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహాదేవపూర్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. ఈ సందర్భంగా భోజన నాణ్యత,అమలు చేస్తున్న కామన్ మెనూపై విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మూడు పాఠశాలల్లో కామన్ మెనూ సక్రమంగా అమలు అవుతున్నట్లు , ఉపాధ్యాయులు రూపొందించిన లెస్సన్ ప్లాన్స్ సంతృప్తికరంగా ఉన్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది,విద్యార్థుల మధ్య సమన్వయం బాగుందని పాఠశాలల్లో సానుకూల వాతావరణం ఉందని పేర్కొన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే సరిశ్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సిజిహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్
# పెండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలి

కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి
ఎంపి కావ్య వినతి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్:** వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్ఎస్) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను త్వరితగతిన మంజూరు చేసి, మిగిలిన ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో గురువారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేసి పరిస్థితిని వివరించారు.వరంగల్, పరిసర ప్రాంతాల్లో సుమారు 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సీజీహెచ్ఎస్ వైద్య సేవలపై ఆధారపడుతున్నారని ఎంపీ వివరించారు. వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవల కోసం 350 కి.మీ.కు పైగా దూరం ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, తరచూ వైద్య సేవలు అవసరమైన పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఆర్థిక అనుమతుల కోసం పెండింగ్‌లో ఉందని ఎంపీ కడియం కావ్య తెలిపారు. భవనానికి సంబంధించిన ఫెయిర్ రెంట్ అసెస్‌మెంట్ ఇప్పటికే పూర్తయిందని, అద్దె ఫైల్‌కు ఆల్ ఇండియా రేడియో సీఈఓ ఆమోదం కూడా లభించిందని వివరించారు.పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను వెంటనే మంజూరు చేసి, మిగిలిన అధికారిక ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ ఎంపీ విజ్ఞప్తి చేశారు. వరంగల్‌లో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తే వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు స్థానికంగానే వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగుతాయని పేర్కొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి



**ప్రజాపక్షం/ములుగు:** ఈనెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన పైలాన్ నిర్మాణ పనుల పురోగతిని నూతన కలెక్టరేట్ భవన సముదాయాన్ని గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబందించిన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నూతన కలేక్టరేట్ భవన సముదాయాన్ని పరిశీలించిన మంత్రి, భవనంలోని వివిద విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, పరిసరాల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. పారిశుద్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు, పార్కింగ్‌తో పాటు అవసరమమైన మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా సంబందిత శాఖ అదికారులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రవిచందర్ ఆధికారులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/మహాదేవపూర్:** అక్రమంగా తరలిస్తున్న రేసన బియ్యాన్ని మమాదేవపూర్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై సాంబమూర్తి సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టగా కాటారం నుండి వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా 7 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు. బియ్యం విలువ సుమారు 24,500 ఉంటుందని వాహనాన్ని స్వాధీనం చేసుకుని బొమ్మ గణపతి, హనుమల గణపతి లను అదుపులోకి తీసుకుని బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై సాంబమూర్తి మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిడిఎస్ బియ్యం అక్రమ నిలువ,రవానా,విక్రయాలు చేస్తున్నట్లు తెలిస్తే 8712658116 కు సమాచారం అందించాలని తెలిపారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు: కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఈనెల 15న జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆగస్టు 15న ఉదయం 9:30 గంటలకు జిల్లా కేంద్రంలోని డా. బి.ఆర్. అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించి, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారని కలెక్టర్ వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, అధికారులు, విద్యార్థులు, యువత, జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూ సర్వే

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి/చిట్యాల:** రైతుల భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూ సర్వే నిర్వహిస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గాండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు.భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండలం చల్లగరిగ రెవెన్యూ గ్రామ పరిధి,తిరుమలాపూర్ పరిధిలోని గ్రామాలు, చిట్యాల హెడ్‌క్వార్టర్ రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన గ్రామసభలు గురువారం చల్లగరిగ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో, తిరుమలాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో, చిట్యాల రైతు వేదికలో నిర్వహించారు. ఈ గ్రామసభలకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రెవెన్యూ భూ సర్వే ద్వారా గ్రామాల్లోని రైతుల భూముల సరిహద్దులతో పాటు గ్రామ సరిహద్దులను కూడా స్పష్టంగా గుర్తించి, పట్టా భూములు, ప్రభుత్వ రెవెన్యూ భూములు, అటవీ భూములను శాస్త్రీయంగా కొలతలు వేసి హద్దులు నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. భూ వివరాలు స్పష్టంగా నమోదు చేసి ప్రతి అర్హత కలిగిన రైతుకు పట్టాదారు పాస్‌బుక్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పట్టాదారు పాస్‌బుక్ ద్వారా రైతులకు రైతుబంధు, రైతుబీమా, పంట రుణాలు పొందడంతో పాటు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, ఇతర కొనుగోలు , పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సులభంగా విక్రయించుకునే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, భూ సర్వే ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, సమన్వయంతో నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, అధికారులు పరస్పరం సహకరించి సర్వే విజయవంతంగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.డి. సర్వే అధికారి, ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అర్హులందరికీ ఇందిరా మహిళా
చీరలు అందిస్తాం
ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని, అర్హులందరికీ ఇందిరా మహిళా చీరలు అందిస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. హసన్ పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట సమీపంలోని అమిత్ గార్డెన్స్ లో మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరై గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ లోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. 200 యూనిట్లకు ఉచిత విద్యుత్,ఆర్టీసీ బస్సుల్లో మహిళకు ఉచిత బస్సు సౌకర్యం,ఆరోగ్య శ్రీ 10 లక్షలకు పెంపు,నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.స్వంత ఇంటి కల సాకారం కోసం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము,55వ డివిజన్ అధ్యక్షులు గడ్డం అరుణ్,56వ డివిజన్ అధ్యక్షులు కొంకా హరిబాబు,66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్,మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు,పీఏసిఎస్ చైర్మెన్ గోపాల్ రెడ్డి,సీనియర్ నాయకులు విసం సురేందర్ రెడ్డి,వెంకన్న,కనుపర్తి కిరణ్,రవి యాదవ్,నాయకులు,మహిళలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## నిత్యావసరాల ధరలు తగ్గించడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు
నల్లు సుధాకర్ రెడ్డి




**ప్రజాపక్షం/మరిపెడ:** వంద రోజులలో ధరలు తగ్గిస్తామని ప్రగాల్పలు పలికిన కేంద్ర బిజెపి ప్రభుత్వం నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధకర్ రెడ్డి విమర్శించారు. గురువారం మరిపెడ మండల కేంద్రంలో సిపిఐ ప్రజా చైతన్య యాత్రను సుధకర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించక పోవడం, అసంఘటిత రంగ కార్మికులకు పని భద్రత లేక,యువతకు ఉపాధి అవాకాశాలు కల్పించడంలో మోడి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర విభజన చట్టం అమలు ,సాక్షాత్తు పార్లమెంటు ఆమెదం పోందిన బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, జాతియ ప్రాజెక్ట్ కు హోదా,కేంద్ర విద్యా సంస్థల ఎర్పాటు లాంటి హామిలను అమలు పరచకపోవడం బిజెపి ప్రభుత్వ వైఫల్యలకు నిదార్శనమని అన్నారు. అదే విధంగా మార్పు కావాలి అనే నినాదంతో సిపిఐ చేపట్టిన సెప్టంబర్ 1న చలో ఢీల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయలనీ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు అబ్దుల్ రషిద్, అంజి, పాక వెంకన్న, వీరన్న, హనుమంతు, సత్యం, రవిందర్, బద్రు,ఆంగోత్ వెంకన్న, రమేష్, వీరేందర్, నరసయ్య,లింగయ్య, తురక రమేష్, కన్నె వెంకన్న, కలగూర నాగరాజు, తదితరులు పాల్గోన్నారు.

## మహాముత్తారం పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో పోలీసు సేవలను సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని కేసులను నాణ్యతతో దర్యాప్తు చేయాలని ఆయన సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎస్పీ వెంట స్థానిక ఎస్సై పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇండియన్ బ్యాంక్‌లో 'గోల్డ్ గాయబ్'!

అసిస్టెంట్ మేనేజర్ చేతివాటం

22 మంది ఖాతాదారులకు చెందిన 810 గ్రాముల ఆభరణాలు గల్లంతు
సుమారు రూ. కోటి విలువ
ముత్తూట్ ఫైనాన్స్‌లో 16 మంది బంగారం తాకట్టు పెట్టి రూ 96 లక్షలు తీసుకున్నట్లు సమాచారం
పరారీలో ఉన్న అసిస్టెంట్ మేనేజర్ కోసం పోలీసులు గాలింపు




**ప్రజాపక్షం/మహబూబాబాద్/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండియన్ బ్యాంక్‌లో సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. ఖాతాదారులు తమ అవసరాలకు కోసం బ్యాంక్ తాకట్టు పెట్టిన బంగారు మాయమైనట్లు గుర్తించినట్లు సమాచారం. సుమారు 22 మంది ఖాతాదారులకు చెందిన ఈ బంగారం విలువ దాదాపు రూ కోటి వరకు ఉంటుందని తెలుస్తోంది. బ్యాంక్ నెలవారీ తనిఖీలు ఆడిట్ సందర్భంగా బంగారం లెక్కల్లో తేడాలు బయటపడటంతో ఈ వ్యవహా రం వెలుగులోకి వచ్చింది. బంగారం మామమైన వి షయం తెలియడంతో ఖాతాదారుల్లో ఆందోళన నెలకొం ది.

**అసిస్టెంట్ మేనేజర్ అదృశ్యం:**
బ్యాంక్‌లో బంగారం లెక్కల్లో తేడాలు బయటపడిన సమయంలో అసిస్టెంట్ మేనేజర్ గొవిందం అందుబాటులో లేకపోవడంతో బ్యాంక్ అధికారులు అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అంతర్గత తనిఖీల్లో 22 మంది ఖాతాదారులకు సంబంధించిన బంగారం కనిపించకపోవడంతో బ్యాంక్ మేనేజర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్లు సమాచారం ప్రస్తుతం అసిస్టెంట్ మేనేజర్ పరారీలో ఉండటంతో పోలీసులు అతని కోసం గాలింపు చేపట్టారు.

**ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు?**
పోలీసుల ప్రాథమిక విచారణలో భాగంగా వెలుగులోకి వచ్చిన సమాచారం ప్రకారం మాయమైన బంగారంలో 16 మంది ఖాతాదారులకు చెందిన ఆభరణాలను మహబూబాబాద్‌లోని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి సుమారు రూ 96 లక్షలు తీసుకున్నట్లు తెలిసింది. తాకట్టు పెట్టిన ఆభరణాల మొత్తం బరువు రాళ్లతో కలిపి సుమారు 810 గ్రాములగా ఉండగా రాళ్ల బరువు తొలగించిన అనంతరం అసలు బంగారం బరువు సుమారు 77 గ్రాములుగా లెక్కల్లో నమోదైనట్లు సమాచారం అయితే ఈ లెక్కలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

**వాహనం డిక్కీలోనూ బంగారం?:**
మిగిలిన ఆరుగురు ఖాతాదారులకు చెందిన బంగారాన్ని అసిస్టెంట్ మేనేజర్ తన వద్దే ఉంచుకున్నట్లు పోలీసుల విచారణలో అనుమానాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. పరారీలో ఉన్న అతని ఇంటిపై పోలీసులు తనిఖీలు నిర్వహించగా ఆరుగురికి చెందిన కొంత బంగారంతో పాటు అతనికి సంబంధించిన వాహనం డిక్కీలో కొన్ని ఆభరణాలు అభించినట్లు సమాచారం.

**పూర్తి విచారణతో మరిన్నీ విషయాలు వెలుగులోకీ?**
ఇండియన్ బ్యాంకులో చోటుచేసుకున్న ఈ వ్యవహారం ప్రస్తుతం మహబూబాబాద్‌లో తీవ్రచర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ఖాతాదారులు తమ బంగారం పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తుండగా మరోవైపు బ్యాంక్ అధికారులు పూర్తి స్థాయిలో అంతర్గత విచారణ చేపడుతున్నారు. ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన వివరాలు ప్రాథమిక దర్యాప్తులో భాగమైనవే కాగా మొత్తం ఎంత బంగారం మాయమైంది? ఎంతమంది ఖాతాదారులు బాధితులుగా ఉన్నారు? ఈవ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా? అనే అంశాలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. బ్యాంక్ అధికారలు పూర్తిస్థాయి ఆడిట్ నిర్వహించి పోలీసుల దర్యాప్తు పూర్తియితే ఈ వ్యవహారానికి సంబంధించిన మరిన్ని కీలక విషయాలు వెలుగులోకీ వచ్చే అవకాశం ఉంది. ఖాతాదారులకు చెందిన బంగారాన్ని భద్రతగా ఉంచాల్సిన బ్యాంక్‌లోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై ఖాతాదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శుక్రవారం
14-08-2026
www.prajapaksham.in

‘ కేంద్ర, రాష్ట్ర పాలకులు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు జరుగుతున్న ప్రజా పాదయాత్రల్లో సిపిఐ నాయకులు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ’



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో...


నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో...


సూర్యాపేట జిల్లా మునగాలలో...


యాద్రాద్రి జిల్లా బొమ్మలరామారంలో


జగిత్యాల జిల్లా పెగడపల్లిలో...


నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లిలో...

# వాడవాడన పాదయాత్రలు

ప్రజాపక్షం / విలేకరుల బృందం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఐ చేపట్టిన పాదయాత్రలు వాడవాడన జరుగుతున్నవి. పాదయాత్రలలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రజలకు బిజెపి పాలనపై ప్రజలకు వివరిస్తున్నారు.

### సమ సమాజ నిర్మాణమే ఎర్రజెండా లక్ష్యం

ప్రజలు తిప్పికొట్టాలని సమ సమాజ నిర్మాణమే ఎర్రజెండా అంతిమ లక్ష్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ జరుగుతున్న ప్రజాపోరు యాత్ర గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్ జి, తన్నీరు, నరసింహ, ఈర్ల చంద్రమౌళి, పి.కృష్ణాజి, మర్యాద వెంకటయ్య, తన్నీరు మల్లయ్య, మారేడు శివ శంకర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు తన్నీరు మల్లయ్య, మాడుగుల నరసింహ, కొత్త రామస్వామి, వాంకేశ్వరం శ్రీనివాసులు, కొ్రట శేఖర్, ఎం.ఆంజనేయులు, విజయ్ పాల్గొన్నారు.

### పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

స్వామినాథన్ సిఫారసు ప్రకారం పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. సిపిఐ ప్రచార జాతాలో భాగంగా గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో పసుపు రాశులను సందర్శించి రైతులతో మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఎఐకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య మాట్లాడుతూ సాగుకవసరమైన ప్రతి యంత్రాన్ని సబ్సిడీతో ఇవ్వాలని, క్వింటా పసుపుకు రూ.26 వేల గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు స్వరూపరాణి, గంగారాం, ఫిరోజ్‌అలీ, సురేష్, రమేష్, అంజయ్య, నగేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగ హక్కులను రక్షించుకుందాం

ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. చిలుకూరు మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్‌కె సాహెబ్‌అలీ నాయకత్వాన్న పాత చిలుకూరులో పాదయాత్రను బెజవాడ ప్రారంభించారు. చిలుకూరు, దూదియతండా, శీతలతాండ, నారాయణపురం, సీతరాంపురం, సబ్బువారిగూడెం, బేతవోలు, జెర్రిపోతుల గూడెం గ్రామాలలో యాత్ర సాగింది. కార్యక్రమంలో నాయకులు నంద్యాల రామిరెడ్డి, చేపూరి కొండలు, రెమిడాల రాజు, పిల్లుట్ల కనకయ్య, చిలువేరు ఆంజనేయులు, తాళ్లూరి వెంకటయ్య, బెజవాడ వినోద్, కందుకూరి శ్రీను, దొడ్డ నాగేశ్వరరావు, కస్తూరి సైదులు, తాళ్లూరి రామారావు, నేలపట్ల జనార్దన్, కొడారు శ్రీను పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించేందుకు సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచారజాతను బొమ్మలరామారం పట్టణ కేంద్రంలోని యానాల దామోదర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, నాయకులు చెక్క వెంకటేష్, ఇంజ హేమలత, పిట్టల శంకర్, ఇనగందుల రాజప్ప, వడ్లకొండ భారతమ్మ, సంధ్య, చిట్టి, ఆనందం, మెట్ల బాబు, కూర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్నె విశ్వనాథం పిలుపునిచ్చారు. సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రను గురువారం పెగడపల్లి మండల కేంద్రంలో విశ్వనాథం, జిల్లా సహాయ కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ ప్రారంభించారు. నామాపూర్, మ్యాకవెంకయ్య పల్లి, రాజారాంపల్లి, కీచులాట పల్లి,ఎల్లాపూర్, ఏడుమోటలపల్లి మీదుగా వెంగళాయిపేట వరకు యాత్ర కొనసాగింది. కార్యక్రమంలో నాయకులు ఇరుగురాల భూమేశ్వర్, మోనుగురి హన్మంతు, శనిగారపు ప్రవీణ్, గుడ్ల శ్రీనివాస్, ఎండి.హీనా ఫిరోదాస్, ఎండి.సైనా, ఎండి.ఆయేషా, బొల్లె లక్ష్మి రాజం పాల్గొన్నారు.




### కేంద్ర, రాష్ట్ర పాలన ఎండగట్టేందుకే పాదయాత్రలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న పాలనను ఎండగట్టేందుకే సిపిఐ పాదయాత్రలు చేపట్టిందని పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలో కొల్లాపూర్ సిపిఐ మండల్ కార్యదర్శి తుమ్మల శివుడు అధ్యక్షతన 9వ రోజు గురువారం సిపిఐ పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రలో నాయకులు పెబ్బేటి విజయుడు, బండి లక్ష్మి పతి, బిజ్జా శ్రీనివాసులు, తప్పెట కిరణ్ కుమార్, కంటే వెంకటస్వామి, తప్పట కిరణ్ కుమార్, బండి లక్ష్మి పత్తి, ఎం.లక్ష్మి నారాయణ, నరసమ్మ, తుమ్మల శివుడు, కృష్ణ, చింతలపల్లి కురుమయ్య, ధనుంజయుడు, నరసయ్య, రామకృష్ణ, మైబూస్, రామస్వామి, గోపి, సుధాకర్, వాసు, రామకృష్ణ, చందు, సల్లేశ్వరం రవి పాల్గొన్నారు.

### ప్రజల సంపదను కొల్లగొడుతున్న బిజెపి ప్రభుత్వం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను పెంచి ప్రజల సంపదను కొల్లగొడుతూ, ఆ సంపదను బడా కార్పోరేట్లకు, మోదీ మిత్రులకు దోచిపెట్టి పాలన సాగిస్తోందని సిపిఐ గద్వాల్ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు ఆరోపించారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాత గద్వాల్ జిల్లా ధరూర్ మండలం రేవులపల్లి గ్రామం నుంచి ప్రారంభమై చింతరేవుల, నర్సన్‌దొడ్డి సర్కిల్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఏసు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పేరు కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు భరత్, ఎఐటియుసి హమాలీ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బతుకున్న, ఆంజనేయులు, నాయకులు రాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బిజెపి పాలకులు

మతం పేరుతో దేశ ప్రజల మధ్య బిజెపి పాలకులు చిచ్చుపెడుతున్నారని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో కొనసాగుతున్న పాదయాత్ర ఐదో రోజుకు చేరుకుంది. ఐదో రోజు పాదయాత్ర జిల్లాలోని పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్‌కు చేరుకుంది. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహా కార్యదర్శి లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రమేష్, బద్రి, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

### కేంద్ర విధానాలపై పోరాటం

ప్రజా వ్యతిరేక కేంద్ర విధానాలపై నిరసన తెలపాలని సిపిఐ ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు పేర్కొన్నరు. ములుగు జిల్లా వాజేడు మండలం ధర్మారం గ్రామంలో సిపిఐ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆచంట ప్రసాద్, మండల కార్యదర్శి రవీందర్, సంతోష్, కొప్పుల శ్రీను, గగ్గురి నరసింహారావు, భాస్కర్ పాల్గొన్నారు.

### బిజెపి పాలనకు వ్యతిరేకంగా పోరాడుదాం

కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా పోరాడుదామని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మంద అనిల్ కుమార్, సావనపెల్లి మల్లేశం ఆధ్వర్యంలో పాత్తూర్ బ్రిడ్జ్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో భూంపెల్లి భూమిరెడ్డి, కాదురు మొండయ్య, పెండెల అధిత్య, గుంటి బక్కయ్య, గుంటి తిరుపతి, రాజయ్య, దొమ్మరి కనకయ్య, కోల వెంకటయ్య, అశోక్ పాల్గొన్నారు.


గద్వాల్ జిల్లా ధరూర్‌లో...


వరంగల్ జిల్లా పర్వతగిరిలో...


ములుగు జిల్లా వాజేడులో...


రాజన్న సిరిసిల్లలో...

## జంకు ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)




కళాక్షేత్రంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సాంబశివరావు మాట్లాడుతూ ప్రజలు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు కమ్యూనిస్టు పోరాట ఫలితంగా వచ్చాయని, ఇప్పుడు దేశంలో మార్పు సైతం, కమ్యూనిస్టుల ద్వారానే సాధ్యమవుతుందని ఇది తథ్యమని అన్నారు. ఎన్నికలు ఆర్థిక వ్యవహారంతో ముడిపడి కోట్లు ఖర్చు చేస్తున్నవారు మాత్రమే విజయం సాధిస్తున్న ఈ రోజుల్లో కమ్యూనిస్టులు సీట్లు గెలవలేకపోవచ్చు కాని, గెలుపు ఓటములను, శాసించే శక్తి కమ్యూనిస్టులకు ఉందని సాంబశివరావు తెలిపారు. మోడి, అమిత్‌షాలు తప్పు చేశామన్న భావనతో ఉన్నారని, అందుకే పార్లమెంట్ వచ్చేందుకు జంకుతున్నారన్నారు. మోడికి తిరోగమనం ప్రారంభమైందని, సబ్బండ వర్గాలు మోడి పాలనను వ్యతిరేకిస్తున్నాయన్నారు. ధర్మేంద్రప్రధానే రాజీనామాతో మోడి అహంకారం దిగిపోయిందని, యువత ముఖ్యంగా జెన్‌జీ ఉద్యమం దేశవ్యాపితమైందని, బిజెపి అధికారం కోల్పోటమే ఇక మిగిలిందని కూనంనేని తెలిపారు. కమ్యూనిస్టులు ప్రపంచ వ్యాపితంగా పురోగమిస్తున్నారని, అందుకే అక్కడ ట్రంప్, ఇక్కడ మోడి బయటపడుతున్నారన్నారు. దేశాన్ని దోచుకుంటూ సంపదను, కార్పోరేట్లకు కట్టబెడుతున్న బిజెపి సర్కార్, ఇప్పుడు అయోధ్య రాముని సోమ్ముకు ఎసరు పెట్టిందని, బిజెపి దాని అనుబంధ సంస్థలు, దొంగల దండుల దేశంపై పడ్డారని, చీమల దండులా కదిలి దొంగల దండును తరిమి వేయాలని సాంబశివరావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయమంటే కాంగ్రెస్ నేతలు బాధపడుతున్నారని, అయినా ప్రజల పక్షాన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రశ్నిస్తూనే ఉంటామని కూనంనేని తెలిపారు. గెలుపు ఓటములు ఎన్నికల వరకే పరిమితమని, ఒకటి రెండు సీట్ల కోసం ప్రజా సమస్యల విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో ఈ సారి పోటీ తథ్యమన్నారు

**హామీల అమలుకు పోరాటం : -బాగం**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను, అమలు చేయడంలో తాత్సారం ప్రదర్శిస్తుందని, హామీలను విస్మరిస్తే ఆందోళన తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సన్నబియ్యం, ఉచిత బస్సు మినహా మిగిలిన హామీలలో ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. సిపిఐ ప్రజాచైతన్య యాత్రతో హేమంతరావు మాట్లాడుతూ అప్పుల పేరుతో హామీలను అమలు చేయకపోతే ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. బిఆర్ఎస్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల మాదిరే కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో రాజకీయ వివక్ష పాటిస్తుందని, జెండా కప్పుకుంటునే ఇండ్లు కేటాయిస్తామనటం సరికాదు. సీతారామ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియచేయాలని డిమాండ్ చేశారు. మోడి ప్రజా వ్యతిరేక విధానాల పైనా, రాష్ట్రంలో హామీల అమలు కోసం నిరంతర పోరాటం కొనసాగుతుందని హేమంతరావు స్పష్టం చేశారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు ప్రసంగించగా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు. సభలో నగర కార్యదర్శి షేక్ జానీమియా, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లైమెంట్, అజ్మీరా రామమూర్తి పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి, కళాకారులు సతీష్ బృందం అలపించిన గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.





## సీతారామ పనులను వేగవంతం చేయాలి

### మంత్రి ఉత్తమ్‌తో తుమ్మల భేటీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు. గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయి సీతారామ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మూడవ పంపు హౌజ్ నుంచి నాల్గవ పంపు హౌజ్ వరకు నీటిని తరలించేందుకు అవసరమైన 532 ఎకరాల భూ సేకరణ ప్రక్రియను రూ. 45 కోట్లతో చేపట్టినట్లు తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట, ముల్కలపల్లి మండలాల పరిధిలో ఈ భూసేకరణ పూర్తయితే ఆయా ప్రాంతాలకు గోదావరి జలాలు అందుతాయన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతుల భూములను సస్యశ్యామలం చేయాలన్నారు.

## ఒడిశాలో భారీ వర్షాలు
## ఐఎండి ‘రెడ్ వార్నింగ్’ జారీ

**భువనేశ్వర్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి అల్పపీడన వ్యవస్థ (డిప్రెషన్)గా మారడంతో, గత 24గంటలుగా ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, దీనివల్ల రాష్ట్రంలోని ఉత్తరజిల్లాలలో వరదల భయం నెలకొందని గురువారం భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఒడిశా అంతటా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఐఎండి ‘రెడ్ వార్నింగ్’ (తక్షణ చర్యలు చేపట్టాలని సూచించే హెచ్చరిక) జారీ చేసింది. వాతావరణ సంస్థ ఒక జాతీయ బులెటిన్‌ను జారీచేస్తూ ‘పశ్చిమబెంగాల్‌లోని తీరప్రాంతం, బంగ్లాదేశ్‌ను ఆనుకుని ఉన్న ప్రాంతాలు, వాయవ్య బంగాళా ఖాతంపై ఏర్పడిన సుస్పష్టమైన అల్పపీడన ప్రాంతం వాయవ్య దిశగా కదిలి వాయుగుండంగా బలపడింది’ అని ఐఎండి వెల్లడించింది.గురువారం ఉదయం 8.30గంటలకు అల్పపీడన వ్యవస్థ కోల్‌కతా(పశ్చిమబెంగాల్)కు ఆగ్నేయంగా 40కి.మీ, మేదినీపూర్ (పశ్చిమబెంగాల్) కు తూర్పున 180కిలోమీటర్లు, ఒడిశాలోని బారిపడకు తూర్పు ఈశాన్యంగా 190కి.మీ, జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు తూర్పు ఆగ్నేయంగా 260కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమైందని ఐఎండి పేర్కొంది. ‘రాబోయే 24గంటల్లో ఇది గంగానది పరీవాహక పశ్చిమబెంగాల్, జార్ఖండ్ మీదుగా దాదాపు వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉంది’ అని ఐఎండి వివరించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com